సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 147

శనివారం 17-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



**బజరంగ్‌కు ఖేల్‌రత్న**

అగ్రశ్రేణి రెజ్లర్ పేరును ప్రతిపాదించిన ఎంపిక కమిటీ - స్పోర్ట్స్‌లో



**భారత కోచ్‌గా రవిశాస్త్రికే ఓటు**

2021 టి20 వరల్డ్ కప్ వరకు పదవిలో కొనసాగింపు - స్పోర్ట్స్‌లో

## అణ్వస్త్ర విధానం మారొచ్చు



సరిహద్దులో పాక్ కయ్యానికి కాలు దువ్వుతున్నవేళ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మొదటగా అణ్వాయుధాలను ప్రయోగించరాదు' అన్న విధానానికే భారత్ కట్టుబడి ఉందనీ, అయితే భవిష్యత్‌లో ఎదురయ్యే పరిస్థితుల దృష్ట్యా ఇది మారవచ్చని పరోక్షంగా పాక్‌ను హెచ్చరించారు.

5లో

## కశ్మీర్‌పై ఐరాసలో చర్చలు




జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని భారత్ తొలగించిన అంశంపై ఐరాస భద్రతా మండలి శుక్రవారం రహస్య చర్చలు జరిపింది. పాక్ కోసం చైనా విజ్ఞప్తి మేరకు జరిగిన ఈ చర్చల్లో ఏ దేశం ఏం మాట్లాడిందనే విషయం బయటకు రాలేదు.

5లో

## అరగంట చదివినా అర్థంకాలే



రాజ్యాంగంలోని 370వ అధికరణం రద్దును వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. ఆ పిటిషన్లలో లోపాలు ఉన్నాయనీ, అరగంట చదివినా అర్థంకాలేదని, ముందు వాటిని సరిచేసుకోవాలని సూచించింది.

5లో

## గ్రీన్‌లాండ్‌ను కొనేద్దామా!



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై కన్నేశారు. 'డెన్మార్క్‌లో భాగంగా ఉన్న గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయడం వీలవుతుందా?' అని సలహాదారుల అభిప్రాయాన్ని కోరినట్లు తెలిసింది. అపార వనరులతో పాటు వ్యూహాత్మకంగా కీలకమైనది కావడంతో గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ దృష్టి సారించినట్లు వెల్లడించాయి.

5లో

**భారత్‌కు మళ్లీ వస్తాం..**

- బిజినెస్‌లో

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్ చదవండి ... గెలవండి

20 కూపన్










# మాయా విత్తనం




**రాష్ట్రంలో భారీస్థాయిలో విత్తన రీసైక్లింగ్ దందా..**

- కాలం చెల్లిన విత్తనాలను అంటగడుతున్న కంపెనీలు
- మళ్లీ మళ్లీ రీసైక్లింగ్ చేస్తూ కొత్త విత్తనాల్లో కలిపి విక్రయాలు
- మొత్తం 30 రకాల విత్తనాల సరఫరాలో అక్రమాలు
- బడా కంపెనీలది సైతం ఇదే దారి
- విజిలెన్స్ దాడుల్లో బట్టబయలు
- చర్యలు తీసుకోవడంలో అధికారుల మీనమేషాలు
- ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లే కారణం!

సాక్షి, హైదరాబాద్

ఆరుగాలం శ్రమించి పంట పండించే అన్నదాతలతో విత్తన కంపెనీలు ఆటలాడుతున్నాయి. కాలం చెల్లిన విత్తనాలను అంటగట్టి వారిని నిలువునా మోసం చేస్తున్నాయి. గడువు తీరిన విత్తనాలను రీసైక్లింగ్ చేసి కొత్తవని చెప్పి రైతులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాయి. ఆ విత్తనం.. ఈ విత్తనం అనే తేడా లేకుండా దాదాపు అన్ని రకాల విత్తనాలనూ ఇలాగే విక్రయించి రైతన్నలను నష్టాల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. ఒకసారి రూపొందించిన విత్తనాలనే మళ్లీ మళ్లీ రీసైక్లింగ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాయి. నాణ్యత లేని విత్తనాల వల్ల సరైన దిగుబడి రాకపోవడంతో రైతాంగం కుదేలవుతోంది. చిన్న కంపెనీలే కాకుండా

మిగతా 2వ పేజీలో ▶

"పెద్ద కంపెనీలూ కల్తీ విత్తనాలు అంటగట్టి మోసం చేయడం ఆవేదన కలిగిస్తోంది. కల్తీ విత్తనాలు ఏవో మాకు తెలియడంలేదు. రైతులకు ఇచ్చాక అవి మొలకెత్తకపోవడంతో వారు మమ్మల్ని నిలదీస్తున్నారు. ఈ విషయంపై వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేశాం. రీసైక్లింగ్ చేస్తున్న కంపెనీల వివరాలను అధికారులకు తెలియజేశాం.

*– పృథ్వీ, విత్తన డీలర్, ఖమ్మం*

కంపెనీలు విత్తనాలను కల్తీ చేస్తున్న వ్యవహారం మా దృష్టికి వచ్చింది. గడువు తీరిన వాటిలో కొన్ని విత్తనాలను మరోసారి లేబొరేటరీలో పరీక్షించి మొలకెత్తే లక్షణం ఉన్న వాటిని అమ్ముకోవడానికి అనుమతి ఉంటుంది. అలా కాకుండా పూర్తిగా గడువు తీరిన విత్తనాలను గోదాముల్లో గుర్తించాం. వాటిని అలా ఉంచడం నేరం. విత్తనాలను రీసైక్లింగ్ చేయకూడదు. ఈ విషయంలో 15 కంపెనీలకు నోటీసులు జారీచేశాం. ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చాం.

*– రాహుల్ బొజ్జా, కమిషనర్, వ్యవసాయశాఖ*

## ఆరోగ్యశ్రీ ఆగింది

నెట్‌వర్క్ ఆసుపత్రులతో మంత్రి ఈటల చర్చలు విఫలం

**ప్రభుత్వ వాదన...**

- ఇప్పటివరకు రూ. 450 కోట్ల బకాయిలు చెల్లించాం
- మిగిలిన బకాయిలు రూ. 600 కోట్లే
- వచ్చే నెలలో రూ. 200 కోట్లు చెల్లిస్తాం
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు సమ్మెలో లేవు
- బంద్ ప్రభావం పెద్దగా లేదు

**ఆసుపత్రుల మాట...**

- బకాయిలు రూ. 1,500 కోట్లు
- ఇప్పటివరకు 15–20 శాతం బకాయిలే అందాయి
- ప్యాకేజీ సొమ్ము పెంచాలి
- ప్రభుత్వంతో చర్చల్లో స్పష్టత రాలేదు
- నేడు, రేపు కూడా ప్రభుత్వంతో చర్చిస్తాం

- వివరాలు 2లో









## ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా వినోద్‌కుమార్

- కేబినెట్ హోదాతో మూడేళ్లు ఈ పదవిలో కొనసాగనున్న మాజీ ఎంపీ
- మంత్రివర్గ భేటీలకు శాశ్వత ఆహ్వానం
- టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కీలకనేతగా పనిచేసిన బోయినపల్లి

- వివరాలు 4లో



## రంగు పడుద్ది

- హైదరాబాద్‌లో జలమండలి, బల్దియా ఆధ్వర్యంలో కార్యక్రమం
- తొలుత ఖైరతాబాద్‌లో.. త్వరలో సిటీ అంతా..
- కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ అధికారుల ఆసక్తి..

- వివరాలు 14లో



## క్లుప్తంగా...

### నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రధానంగా నైరుతి/పశ్చిమ దిశ నుంచి గాలులు వీస్తున్నాయని పేర్కొంది. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధిక వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. కాగా, పినపాకలో (భద్రాద్రి కొత్తగూడెం) 4 సెం.మీ, అశ్వాపురం (భద్రాద్రి కొత్తగూడెం) 3 సెం.మీ, నాగిరెడ్డిపేట్(కామారెడ్డి) 2 సెం.మీ, మంథని(పెద్దపల్లి) 1 సెం.మీ, కొత్తగూడెం 1 సెం.మీ, సిర్పూరులో 1 సెం.మీల వర్షం కురిసింది.

### నేడు తుంగభద్ర బోర్డు సమావేశం

సాక్షి, హైదరాబాద్: తుంగభద్ర బోర్డు సమావేశం శనివారం బెంగళూరులో జరగనుంది. తుంగభద్ర నదీ జలాల విడుదల, వినియోగం వంటి అంశాలతో పాటు రాష్ట్రానికి సంబంధించి ఆర్డీఎస్ కాల్వల ఆధునికీకరణ పైనా ఇందులో చర్చించే అవకాశం ఉంది. కాల్వల ఆధునికీకరణ ఈ ఏడాది జూలై నాటికే పూర్తికావాల్సి ఉన్నా ఇంకా కాలేదు. ఈ నేపథ్యంలో పనుల పూర్తిపై తెలంగాణ స్పష్టత కోరే అవకాశం ఉంది.

### అగ్రివర్సిటీలో డిప్లొమా కోర్సులకు 19న కౌన్సెలింగ్

హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ వివిధ డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి తుది విడత కౌన్సెలింగ్ ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్ కుమార్ తెలిపారు. ఇదివరకే ఆన్‌లైన్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. మొదటి రెండు కౌన్సెలింగ్‌లకు హాజరుకాని వారు కూడా తుది విడత కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చన్నారు. సీట్లు పొందిన వెంటనే ఫీజు రూ.16,600తోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలన్నారు. ఎస్‌ఎస్‌సీలో 10.0 జీపీఏ నుంచి 8.0 జీపీఏ పొంది ఆన్‌లైన్‌లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకున్న వారందరూ కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని, పూర్తి వివరాలకు **www.pjtrau.edu.in**లో చూడాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

### 17కు దోస్త్ ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల నిర్వహించిన చివరిదశ దోస్త్ స్పెషల్ డ్రైవ్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజ్ కన్ఫర్మేషన్ సదుపాయాన్ని ఈనెల 17 వరకు పొడిగిస్తున్నట్లు దోస్త్ కన్వీనర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 18న యూఎస్ కాన్సులేట్ 10కే రన్

సాక్షి, హైదరాబాద్: యూఎస్ కాన్సులేట్ కార్యాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 18న 10కే రన్ నిర్వహించనున్నారు. మహిళా సాధికారతను పెంచాలన్న నినాదంతో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో, వర్సిటీ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 6 గంటలకు వీసీ అప్పారావు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పలువురు అమెరికన్ దౌత్యాధికారులు, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు కార్యక్రమానికి హాజరవుతున్నారు. వివరాలకు 8008433779 లేదా **Barithma@state.gov** ద్వారా సంప్రదించవచ్చు.

### సమస్యల సాధనకు పోరాటాలే శరణ్యం: జాక్టో

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టాల్సిందేనని ఉపాధ్యాయ సంఘ సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) నిర్ణయించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన జాక్టో సమావేశంలో ప్రభుత్వం తమకు ఇవ్వాల్సిన ఐఆర్, పీఆర్సీ, పదవీ విరమణ వయస్సు పెంపు తదితర అంశాలపై సంఘ నేతలు చర్చించారు. ఈనెల 20న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని, సెప్టెంబరు 1న ఇందిరాపార్కు వద్ద ఉపాధ్యాయ గర్జన నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జాక్టో నూతన కమిటీ చైర్మన్‌గా సదానందం గౌడ్, సెక్రటరీ జనరల్‌గా రఘునందన్, కోశాధికారిగా రాధాకృష్ణతోపాటు పలువురు కోచైర్మన్లు, సభ్యులను ఎన్నుకున్నారు.

### బీజేపీ ఆఫీసులో వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం శుక్రవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ నేతలు ఇంద్రసేనారెడ్డి, చింతా సాంబమూర్తి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు వాజ్‌పేయి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. వాజ్‌పేయి దేశానికి, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

# కౌంటర్ వేయడం కూడా రాదా?

## ఐఏఎస్‌లపై ఘాటు వ్యాఖ్య చేసిన ధర్మాసనం

- మున్సి‘పోల్స్’కౌంటర్ పిటిషన్‌లో అరకొర వివరాలపై మండిపాటు
- ఎన్నికల ప్రక్రియకు 109 రోజులు కావాలని 8 రోజుల్లో ఎలా చేశారు?
- నమ్మశక్యంగా కూడా లేదు
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి



సాక్షి, హైదరాబాద్: ‘కోర్టుకు కౌంటర్ పిటిషన్లల్లో ఏవిధంగా వివరాలు సమర్పించాలో ఐఏఎస్ అధికారులకు తెలియడం లేదా.. ఒకదానికొకటి అందికా పొందికా లేని అస్పష్ట సమాచారంతో కౌంటర్ వేస్తారా..’అని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని నిర్మల్ జిల్లాకు చెందిన కె.అంజుకుమార్‌రెడ్డి, రిజర్వేషన్ కేటగిరీ ఓటర్ల గుర్తింపు చట్ట ప్రకారం జరగలేదంటూ మేడ్చల్ జిల్లాకు చెందిన ఎస్.మల్లారెడ్డి వేరువేరుగా దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ కేసులో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లో వివరాలు అరకొరగా ఉండటంపై మండిపడింది. కొత్త మున్సిపాల్టీల ఏర్పాటు ఏయే అంశాల్ని ప్రాతిపదికగా తీసుకుని చేశారని ప్రశ్నించింది. ప్రజాభిప్రాయాల్ని సేకరించకుండా వివరాల్ని వెల్లడించకుండా కొత్త వాటిని ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగం ఏముంటుందని నిలదీసింది. ఉదాహరణకు ఎల్లారెడ్డి మున్సిపాల్టీ ఏర్పాటు చేసేస్తే అక్కడి ఓటర్లకు ఏ వార్డుల్లో ఉంటారో తెలియాలి కదా.. అని ప్రశ్నించింది. ‘రిజర్వేషన్ కేటగిరీ ఓటర్ల గుర్తింపునకు జూన్ 21న సర్వే మొదలు పెట్టి అదే నెల 30తో పూర్తి చేశామన్నారు. అయితే దీనిని ఏవిధమైన చట్ట నిబంధనల ప్రకారం చేశారో వివరించలేదు. ఎన్నికలు జరగాల్సిన 123 మున్సిపాల్టీలోని వార్డులను జనాభాకు అనుగుణంగా వాటిసంఖ్య ఖరారు కోసం ఆర్డినెన్స్ 4ను తెచ్చినట్లుగా కౌంటర్ పిటిషన్‌లోని పేరా 15లో పేర్కొన్నప్పటికీ వాటి వివరాలేమీ లేవు. వార్డుల విభజనపై డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అధికారులతో శిక్షణ ఇచ్చామన్నారేగానీ ఏతరహాలో శిక్షణ ఇచ్చారో వివరించలేదు. వార్డుల విభజనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజా ప్రతినిధుల్ని భాగస్వాములు చేయాలి. అయితే అధికారులు ప్రజాప్రతినిధుల్ని ఎప్పుడు సంప్రదించారో స్పష్టత లేదు. పేరా 18లో జూలై 2న ప్రజల నుంచి 1373 అభ్యంతరాలు వస్తే అందులో 665 పరిష్కరించామని, మిగిలినవి చట్ట ప్రకారం చేయ లేనవని చెప్పారేగానీ ఏవిధంగా పరిష్కరించారో, ఎలా తోసిపుచ్చారో కూడా చెప్పలేదు..’అని హైకోర్టు తప్పుపట్టింది. జూలై 3 నుంచి 5వ తేదీ వరకూ వరసగా 313, 372, 521 చొప్పున అభ్యంతరాలు వస్తే అందులో 665 అభ్యంతరాలను ఒకే ఒక్క రోజులో ఎలా పరిష్కరించారో, 708 అభ్యం తరాలు చట్ట ప్రకారం లేవని రాత్రికి రాత్రే ఎలా తేల్చారో అంతుపట్టకుండా ఉందని, ఇది ఆశ్చర్యకరంగా కూడా ఉందని, నమ్మడానికి వీల్లేకుండా ఉందని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

### అనుమానాలు బలపడేలా ఉన్నాయి...

‘ఎన్నికల ప్రక్రియకు 109 రోజుల సమయం కావాలని సింగిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వం చెప్పింది. అందులో 30 రోజులు వార్డుల విభజనకు సమయం పడుతుందని చెప్పిన పాలకులు ఎనిమిది రోజుల్లోనే ఎలా పూర్తి చేశారో అర్థం కావడం లేదు. ఆశ్చర్యంగానే ఉంది. తూతూ మంత్రంగా చేశారనే అనుమానం వస్తోంది. కొన్ని మున్సిపాల్టీలపై వచ్చిన అభ్యంతరాలు, వాటిలో ప్రభుత్వం పరిష్కరించిన వాటిని పరిశీలిస్తే అనుమానాలు బలపడేలానే ఉన్నాయి. ఉదాహరణకు సూర్యాపేట మున్సిపాల్టీలో 79 వస్తే అందులో ఒక్కటంటే ఒక్కటే పరిష్కరించారు. ఆర్మూర్‌లో 20 అభ్యంతరాలు వస్తే అన్నింటినీ తోసిపుచ్చారు. ఇదే విధంగా మహబూబ్‌నగర్‌లో 77కు 39, కరీంనగర్ కార్పొరేషన్‌లో 109కి 59, మీర్‌పేటలో 39కి 38 అభ్యంతరాల్ని పరిష్కరించి మిగిలినవి తోసిపుచ్చారు. ఎందుకు అభ్యంతరాల్ని తోసిపుచ్చారో కారణాలు కూడా వివరించలేదు..’అని ధర్మాసనం తప్పుల్ని ఎత్తిచూపింది. అన్నింటిపైనా పూర్తి వివరాలతో 20వ తేదీనాటికి కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను 21న జరుపుతామని ప్రకటించింది.

తొలుత అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదిస్తూ.. 109 రోజుల సమయం అవసరమని సింగిల్ జడ్జి వద్ద చెప్పామని, అయితే అంతకంటే తక్కువ సమయంలో ముందస్తు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయలేమని చెప్పలేదన్నారు. పాత మున్సిపల్ చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అభ్యంతరాలన్నింటినీ చట్ట ప్రకారం పరిష్కరించామని, అధికారులకు శిక్షణ ఇవ్వడం వల్లే త్వరగా చేయగలిగామని వివరించారు.

# ఆరోగ్యశ్రీ ఆగింది!

- నెట్‌వర్క్ ఆసుపత్రులతో మంత్రి ఈటల చర్చలు విఫలం
- బకాయిల చెల్లింపు అంశంపై చర్చల్లో ప్రతిష్టంభన
- ప్యాకేజీ సొమ్ము పెంచాలనీ డిమాండ్..
- సీఎంతో మాట్లాడాకే నిర్ణయమన్న ప్రభుత్వం
- రోగులకు సేవలు నిలిపేసిన ఆసుపత్రులు
- తొలిరోజు 240 ఆసుపత్రుల్లో ఆగిన ఓపీ, ఐపీ సేవలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. బకాయిల చెల్లింపుపై ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో బంద్ యథావిధిగా కొనసాగుతుందని ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులు స్పష్టం చేశాయి. అయితే కార్పొరేట్ ఆసుపత్రులు మాత్రం సమ్మెలో పాల్గొనడం లేదని ప్రభుత్వం తెలిపింది. ఇతర నెట్‌వర్క్ ఆసుపత్రులు కూడా సేవలు నిలిపివేయకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది. పెండింగ్‌లో ఉన్న వందల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించాలంటూ ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులు శుక్రవారం నుంచి ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) రోగులకు వైద్య సేవలను నిలిపివేశాయి. దీంతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ హుటాహుటిన ఆయా ఆసుపత్రులతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ భవన్‌లో చర్చలు జరిపారు. తెలంగాణ నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఘం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఘంతో వేర్వేరుగా చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు రూ. 450 కోట్ల బకాయిలు చెల్లించామని, మరో రూ. 600 కోట్ల బకాయిలే ఉన్నాయని స్పష్టం చేశారు. వివిధ దశల్లో ఉన్న బిల్లులను కూడా బకాయిలుగా ఆసుపత్రులు చెబుతున్నాయన్నారు.

**ముఖ్యమంత్రితో మాట్లాడి చెబుతా...**

సీఎం కేసీఆర్‌తో చర్చించి ప్యాకేజీ సొమ్ము పెంపుపై నిర్ణయం తీసుకుంటామని ఈటల తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశమన్నారు. ఆసుపత్రులకు, ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందంలో సవరణలు చేయాలని కోరుతున్నారని మంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నుంచి చేపట్టిన ఆరోగ్యశ్రీ సేవల బంద్ ప్రభావం పెద్దగా లేదని మంత్రి వెల్లడించారు. ఎక్కడో ఒకచోట జరిగి ఉండొచ్చన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయన్నారు. ఎక్కువ మంది ఆరోగ్యశ్రీ రోగులు కూడా వాటిల్లోకే వస్తుంటారన్నారు. ఆ మేరకు తాము అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు.

**240 ఆసుపత్రుల్లో సేవలు బంద్..**

మొదటి రోజు 240 ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ సేవలు నిలిపివేసినట్లు తెలంగాణ నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఘం నేత డాక్టర్ రాకేశ్ వెల్లడించారు. చర్చల అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో తమకు ఎటువంటి స్పష్టత రాలేదని, అందువల్ల యథావిధిగా సేవల నిలిపివేత (బంద్) కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. తాము రూ. 1,500 కోట్లు బకాయిలు ఉన్నాయని చెబితే, ప్రభుత్వం మాత్రం రూ. 800 కోట్లే ఉన్నాయని అంటోందన్నారు. ఈ విషయంలో మరోసారి ప్రభుత్వంతో చర్చలు జరుపుతామన్నారు. ఇటీవల రూ. 300 కోట్లు విడుదల చేశామని ప్రభుత్వం తెలిపిందని, కానీ ఆయా ఆసుపత్రులకు ఆ మేరకు సొమ్ము వచ్చిన పరిస్థితి కనిపించడంలేదన్నారు. బకాయిల్లో కేవలం 15 నుంచి 20 శాతం మాత్రమే వచ్చిందన్నారు. వచ్చే నెలలో బడ్జెట్ సందర్భంగా రూ. 200 కోట్లు చెల్లిస్తామని చర్చల్లో ఈటల పేర్కొన్నారని, అయినా బకాయిలు ఇంకా ఉంటాయన్నారు. ఒప్పందంలో సవరణలు కోరామని, దీనిపై కమిటీ వేస్తామని చెప్పారన్నారు. ప్యాకేజీ సొమ్ము పెంచాలన్న అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఈటల చెప్పారన్నారు. శని, ఆదివారాల్లోనూ ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరుపుతామన్నారు. కాగా, చర్చల సందర్భంగా ఒక కీలకాధికారి ఆరోగ్యశ్రీ ఆసుపత్రులు తమ సొమ్ము తోనే బతుకుతున్నాయనంటూ చేసిన వ్యాఖ్యలపై ఆసుపత్రుల యాజమాన్యాలు మండిపడ్డాయి.

# మాయా విత్తనం

▶ మొదటి పేజీ తరువాయి

బడా కంపెనీలు కూడా ఈ విత్తన దందా కొనసాగిస్తున్నాయి. ఇవన్నీ తెలిసినప్పటికీ ఆయా కంపెనీలపై చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం వెనకడుగు వేస్తోంది. ఈ వ్యవహారంలో పలువురు పెద్దలు ఉండటమే ఇందుకు కారణమనే ప్రచారం సాగుతోంది.

**భారీ కుంభకోణం...**

రాష్ట్రంలో రీసైక్లింగ్ విత్తన కుంభకోణం భారీగా జరుగుతోంది. వరి, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, ఆవాలు, బఠానీ సహా దాదాపు 30 రకాల పంటలకు సంబంధించి రీసైక్లింగ్ చేసిన విత్తనాలనే పలు కంపెనీలు సరఫరా చేస్తూ రైతన్నలను దగా చేస్తున్నాయి. ఈ రీసైక్లింగ్ కుంభకోణంలో బహుళజాతి కంపెనీలు కూడా ఉండటం నివ్వెరపరుస్తోంది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని విజిలెన్స్ దాడుల్లో ఈ విషయాలు బయటపడినా చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనకాడుతున్నారు. ఉన్నతస్థాయిలో అండదండలు ఉండటంతో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగిపోతోంది. తాజాగా 15 కంపెనీలపై చేసిన దాడుల్లో రీసైక్లింగ్ వ్యవహారం బయటపడింది. దీంతో పలు పెద్ద కంపెనీలపైనా దాడులు చేయడానికి అనుమతించాలని కోరినా.. ఉన్నతస్థాయి నుంచి ఆమోదం రావడంలేదని తెలిసింది. వీరికి అనేకమంది పెద్దలు సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ విత్తన సదస్సుకు ఆయా కంపెనీలు చేయూత ఇవ్వడమే కారణమన్న విమర్శలూ ఉన్నాయి. దీంతో వాటిపై కన్నెత్తి చూడడానికి కూడా వెనకాడుతున్నట్లు సమాచారం.

**రీసైక్లింగ్ ఇలా జరుగుతోంది..**

రాష్ట్రానికి అవసరమైన హైబ్రీడ్ విత్తనాలను ప్రైవేటు కంపెనీలే సరఫరా చేస్తుంటాయి. మొక్కజొన్న, వరి, బఠానీ, సోయాబీన్, పత్తి వంటి హైబ్రీడ్ రకాలన్నింటినీ కంపెనీలే అభివృద్ధి చేసి రైతులకు ప్రైవేటు డీలర్ల ద్వారా విక్రయిస్తుంటాయి. ఇందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక అనుమతి ఇస్తుంది. మొదటిసారి విక్రయించిన విత్తన ప్యాకెట్లకు ఏడాదిన్నర గడువు ఉంటుంది. ఆ గడువు తీరాక ఆయా విత్తనాలను తిరిగి డీలర్ల నుంచి కంపెనీలు వెనక్కి తీసుకోవాలి. అలా వెనక్కు తీసుకున్న విత్తనాలను లేబొరేటరీలో పరీక్షించిన తర్వాత అందులో మొలకెత్తే లక్షణాలున్న విత్తనాలను వేరుచేసి మరోసారి విక్రయించేందుకు ప్రత్యేక అనుమతి తీసుకుంటారు. అలాంటి విత్తనాలకు తొమ్మిది నెలల గడువుతో అమ్మడానికి వ్యవసాయశాఖ అనుమతి ఇస్తుంది. ఇలా రెండోసారి విక్రయించే విత్తన ప్యాకెట్లపై రీవాలిడేటెడ్ అని తప్పనిసరిగా ముద్రించాలి. కానీ కంపెనీలు మాత్రం అలా ముద్రించడంలేదు. పైగా వాటి గడువును ఏడాదిన్నరగా పేర్కొంటూ కొత్త విత్తనాలుగా మళ్లీ అమ్మేస్తున్నాయి. ఇక్కడితోనూ ఆగకుండా రెండోసారి గడువు తీరిన విత్తనాలను మూడో సారీ రీసైక్లింగ్ చేసి రైతులకు అంటగడుతున్నాయి. ఇలాంటి వాటిని కొత్త విత్తనాలతో కలిపేసి విక్రయిస్తున్నారని విజిలెన్స్ దాడుల్లో వెల్లడైంది. ఇలా కొత్త విత్తనాల్లో కాలం చెల్లిన విత్తనాలను కలపడం వల్ల మొత్తం విత్తనాలన్నీ కల్తీ అయిపోతాయని వ్యవసాయ వర్గాలు పేర్కొంటున్నాయి. మూడోసారి రీసైక్లింగ్ చేసిన తర్వాత ఏమాత్రం పనికిరాని విత్తనాలను బయో కంపెనీలకు విక్రయిస్తామంటూ వ్యవసాయశాఖ నుంచి అనుమతి తీసుకుంటున్నారు. కానీ అలా చేయకుండా వాటిని నాలుగోసారి రీసైక్లింగ్ చేసి కొత్త వాటితో కలిపి మళ్లీ విక్రయించి రైతులను నిలువునా ముంచేస్తున్నారు.

### పలు రాష్ట్రాలకూ సరఫరా..

తెలంగాణలో తయారయ్యే విత్తనాల్లో రాష్ట్రానికి సరిపోను మిగిలిన వాటిని దేశంలో వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలకు కూడా ఈ రీసైక్లింగ్ విత్తనాలు తరలి వెళ్తున్నాయి. కేవలం ఒకే ఒక కంపెనీ సరఫరా చేసిన విత్తనాలే రాష్ట్రంలో లక్షన్నర ఎకరాలకు సరిపడా ఉంటాయని సమాచారం. అంటే మొత్తం రాష్ట్రంలో సరఫరా చేసిన విత్తనాల్లో దాదాపు 15 నుంచి 20 శాతం వరకు రీసైక్లింగ్ విత్తనాలే ఉంటాయని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఏమాత్రం పనికిరాని విత్తనాలను గోదాముల్లోనే ఉంచకూడదు. ఒకవేళ ఉంటే, తమ వద్ద అలాంటి విత్తనాలు ఉన్నాయనే సమాచారాన్ని ఆయా కంపెనీలు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేయాలి. కానీ ఏ ఒక్క కంపెనీ కూడా ఈ నిబంధనలు పాటించడంలేదు. ఇటీవల జరిపిన దాడుల్లో అనేక కంపెనీల గోదాముల్లో ఈ విత్తనాలు కనిపించాయి. మేడ్చల్‌లో ఉన్న ఒక కంపెనీయే దాదాపు 1200 టన్నుల వివిధ రకాల రీసైక్లింగ్ విత్తనాలను సరఫరా చేసినట్లు తేలింది. మొత్తం 15 కంపెనీలు దాదాపు 20వేల టన్నుల రీసైక్లింగ్ విత్తనాలు సరఫరా చేసినట్లు అంచనా వేస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిగితే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి.

# జనాదరణ ముఖ్యమంత్రి జగన్

సాక్షి, అమరావతి: అధికారం చేపట్టిన మూడు నెలల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా అత్యంత జనాదరణ కలిగిన ముఖ్యమంత్రుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చోటు సాధించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ముఖ్యమంత్రిగా జగన్ చేపట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజల మనసును చూరగొన్నాయి. దేశవ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రులపై ప్రఖ్యాత ‘వీడీపీ అసోసియేట్స్’సంస్థ నిర్వహించిన సర్వేలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మూడో స్థానం లభించింది. ‘దేశ్‌కా మూడ్’పేరుతో ప్రస్తుతం దేశ ప్రజల నాడి – రాజకీయంగా వారి ఆలోచనలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు వీడీపీ అసోసియేట్స్ ఈ సర్వేను నిర్వహించింది. 71 శాతం మంది ప్రజలు జగన్ పాలన పట్ల సంతృప్తికరంగా ఉన్నట్లు సర్వేలో తేలింది.

**మోస్ట్ పాపులర్ సీఎం నవీన్..**

దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఈ సర్వేను నిర్వహించారు. సర్వే వివరాల ప్రకారం మోస్ట్ పాపులర్ ముఖ్యమంత్రుల జాబితాలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అగ్రభాగాన నిలిచారు. ఆయనకు 81 శాతం మంది మద్దతు లభించింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 72 శాతంతో రెండో స్థానంలోనూ నిలవగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 71 శాతం మంది ప్రజల మద్దతుతో మూడో స్థానంలో ఉన్నారు. హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ 68 శాతం మంది మద్దతుతో 4వ స్థానంలో, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 65 శాతం మంది మద్దతుతో ఐదో స్థానంలో ఉన్నారని సర్వేలో వెల్లడైంది.

# బీజేపీలోకి 18 జిల్లాల టీడీపీ నేతలు!

- ఆయా జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుసహా కేడర్ అంతా చేరిక
- రేపు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా
- మొత్తం 20 వేల మంది బీజేపీలోకి వస్తారంటున్న నేతలు
- సభ ఏర్పాట్లు పరిశీలించిన పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీ గరికపాటి



శుక్రవారం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్, పార్టీ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదగాలన్న లక్ష్యంతో పార్టీలోకి వలసలను బీజేపీ వేగవంతం చేసింది. ముఖ్యంగా టీడీపీని లక్ష్యంగా చేసుకొని భారీఎత్తున చేరికలకు రంగం సిద్ధం చేసింది. టీడీపీ శ్రేణులంతా బీజేపీలో చేరేలా ఆపరేషన్ కమలం చేపడుతోంది. టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలను పార్టీలో చేర్చుకునేందుకు ఏర్పాట్లు చేసింది. ఇటీవల టీడీపీ సీనియర్ నేతలు మోత్కుపల్లి నర్సింహులు, నందీశ్వర్‌గౌడ్ ఇళ్లకు బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వెళ్లి మరీ ఆహ్వానించారు. అయితే వారు ఈ నెల 18న బీజేపీ తీర్థం పుచ్చుకుంటారా? తరువాత చేరుతారా? అనేది ఖరారు కావాల్సి ఉంది. మరోవైపు 18న హైదరాబాద్‌కు రానున్న బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగత్ ప్రకాశ్ నడ్డా రెండు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని లక్ష్మణ్ వెల్లడించారు. నడ్డా నేతృత్వంలోనే 18వ తేదీన రాష్ట్రంలోని 18 జిల్లాల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతోపాటు క్షేత్రస్థాయిలోని టీడీపీ శ్రేణులందరినీ పార్టీలో చేర్చుకునేలా బీజేపీ చర్యలు చేపట్టింది.

**బీజేపీలోకి 20 వేల మంది టీడీపీ శ్రేణులు..**

రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీకి చెందిన ముఖ్యనేతలతో పాటు క్షేత్రస్థాయి కేడర్ మొత్తం కలుపుకొని దాదాపు 20 వేల మందిని బీజేపీలో చేర్చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వెల్లడించారు. ఇందుకోసం నాంపల్లిలోని ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో 18న సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభాఏర్పాట్లను శుక్రవారం లక్ష్మణ్‌తోపాటు ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, టీడీపీ నేతలు శోభారాణి, దీపక్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, లంకల దీపక్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

**త్వరలో మరికొందరు సీనియర్ నేతలు..**

టీడీపీ, కాంగ్రెస్‌కు చెందిన మరికొందరు సీనియర్ నేతలు త్వరలోనే బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు పార్టీ శ్రేణులు వెల్లడించాయి. ఇప్పటికే మోత్కుపల్లి నర్సింహులు, నందీశ్వర్‌గౌడ్, మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ తదితరులతో బీజేపీ నేతలు చర్చలు జరిపారు. పార్టీ జాతీయ నేతలతో మరికొందరు ముఖ్యనేతలు టచ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అందులో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, విజయశాంతి, కె.లక్ష్మారెడ్డి, ప్రసాద్, దేవేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్, మాజీమంత్రి చంద్రశేఖర్ తదితరులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. వారు కూడా బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. మరోవైపు టీడీపీ ముఖ్య నేతలైన ఎల్.రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డితోనూ సంప్రదింపులు జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది.

**చేరికలా.. విలీనమా మీఇష్టం: కె.లక్ష్మణ్**

‘భారీ మొత్తంలో టీడీపీ శ్రేణులు బీజేపీలో చేరబోతున్నాయి. 18 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, క్షేత్రస్థాయి కేడర్ అంతా కలిపి ఇరవై వేల మందికిపైగా బీజేపీలో చేరబోతున్నారు. చేరికలంటారా? విలీనమంటారా? మీ ఇష్టం.’అని లక్ష్మణ్ అన్నారు.

**ఊహించని విధంగా సభ: ఎంపీ గరికపాటి**

రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీ అధికారంలోకి రావాల్సిందే. పాత పది జిల్లాల నుండి 25 వేలమందితో సభ నిర్వహించబోతున్నాం. ఊహించని విధంగా సభ జరుగబోతోంది. టీడీపీలో పని చేసిన దాని కంటే ఎక్కువగా బీజేపీలో పని చేస్తాం.

### బీజేపీలో చేరనున్న టీడీపీ ముఖ్యనేతలు వీరే..!

ఇప్పటికే ఏడెనిమిది జిల్లాల్లో టీడీపీకి చెందిన జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ఇతర నేతలు టీడీపీకి ముకుమ్మడి రాజీనామాలు చేశారు. వారంతా ఆదివారం నిర్వహించే బహిరంగ సభలో బీజేపీలో చేరనున్నారు. ముఖ్యంగా ఎంపీ గరికపాటి మోహన్‌రావు, రంగారెడ్డి జిల్లా టీడీపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మొవ్వ సత్యనారాయణ, ఎంఎన్ శ్రీనివాస్, లంకల దీపక్‌రెడ్డి తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన శ్రీనివాస్‌గౌడ్, మిర్యాలగూడ, ఆలేరు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జీలు సాదినేని శ్రీనివాస్, బి.శోభారాణి, పాల్వాయి రజనికుమారి, నారాయణ్‌ఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, మాజీమంత్రి పోరిక జగన్నాయక్, పటాన్‌చెరు నుంచి శ్రీకాంత్‌గౌడ్, ఖమ్మం జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, కోదాడ నుంచి శ్రీకళారెడ్డి తదితరులు, పీసీసీకి చెందిన ముగ్గురు కార్యదర్శులు తమ అనుచరులతో బీజేపీలో చేరుతారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి.




మీరు ఇంకా ఇక్కడే ఉండాలనుకుంటున్నారు కాబట్టి ఇల్లు ఇలా కట్టిస్తాం. ఓకేనా సార్!

## క్లుప్తంగా...

### ఎమ్మెల్సీగా గుత్తా ఎన్నిక లాంఛనమే!

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటాలో శాసన మండలి స్థానానికి టీఆర్‌ఎస్ అభ్యర్థి గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎన్నిక లాంఛనం కానుంది. ఈ నెల 7 నుంచి 14 వరకు జరిగిన నామినేషన్ల దాఖలు ప్రక్రియలో తొలిరోజు టీఆర్‌ఎస్ నుంచి గుత్తా సుఖేందర్, చివరిరోజున శ్రమజీవి పార్టీ తరపున భోజరాజ్ కోయల్కర్ నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారంతో ముగిసిన నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా భోజరాజ్ కోయల్కర్ నామినేషన్ పత్రాలు లేకపోవడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. దీంతో ఈ నెల 19న గుత్తా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించనుంది.

### యురేనియం తవ్వకాలను నిలిపేయండి

**కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ లేఖ**



సాక్షి, హైదరాబాద్: ఆమ్రాబాద్‌లో యురేనియం తవ్వకాలను నిలిపేయాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం పులులకు నివాస యోగ్యమైందని, చెంచుల జీవితాలను చిన్నాభిన్నం చేయడంతోపాటు పర్యావరణాన్ని నాశనం చేసే తవ్వకాల అనుమతులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. మన్ననూర్, పదిర, దేవరకొండ, నాగార్జునసాగర్ ప్రాంతంలోని లంబాపూర్‌లో తవ్వకాలకు యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉందని వివరించారు. తవ్వకాల అనుమతులను రద్దు చేసి ఆ ప్రాంతాల్లోని అటవీ జాతులను, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

### 'తాటి, ఈత చెట్లను నరికితే నాన్ బెయిలబుల్ కేసులు'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికేవారిపై సెక్షన్ 27, ఆబ్కారీ చట్టం 1968 ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. రియల్ ఎస్టేట్ సంస్థలు లేఅవుట్ల పేరుతో తాటి, ఈత చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వచ్చిన వినతులపై ఆయన ఆబ్కారీ శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. అక్రమంగా చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకునేలా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేయాలన్నారు.

### ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి: సీపీఐ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆసుపత్రులకు ఆరోగ్య శ్రీ బకాయిలను చెల్లించి, పేద రోగులను ఆదుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఒకవైపు బంగారు తెలంగాణ సాధిస్తామని చెబుతూ రూ.1,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఎందుకు పెట్టారో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గత 4, 5 నెలలుగా కోట్లాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో పడ్డాయని ప్రభుత్వం దృష్టికి వచ్చినా స్పందించడం లేదన్నారు.

### 'మీడియా స్వేచ్ఛను పరిరక్షించండి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మీడియా స్వేచ్ఛపై, జర్నలిస్టులపై కొనసాగుతున్న దాడులను, బెదిరింపులను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే), ప్రెస్ క్లబ్ హైదరాబాద్ (పీసీహెచ్) ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రతినిధి బృందం శుక్రవారం డీజీపీ మహేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించింది. కొన్ని శక్తులు పథకం ప్రకారం మీడియా స్వేచ్ఛను హరించేందుకు కుట్రలు చేస్తున్నట్లు సభ్యులు ఆరోపించారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అధ్యక్షుడు దేవులపల్లి అమర్, యూనియన్ నేత అమర్‌నాథ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి రాజమౌళి చారి తదితరులు డీజీపీని కలిసిన వారిలో ఉన్నారు.

### వీసీ పోస్టుల్లో 50 శాతం బీసీలకు ఇవ్వాలి

**బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి**



సాక్షి, హైదరాబాద్: విశ్వవిద్యాలయ వీసీ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, వర్సిటీ కాలేజీల్లోని లెక్చరర్, నాన్–టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జనార్దన్‌రెడ్డితో బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, నర్సింహా గౌడ్, రామకృష్ణల ప్రతినిధి బృందం సమావేశమైంది.

# ఏఏఐ ఓకే అంటే.. 6 జిల్లాలకు విమానయోగం..!

- సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఈ నెల 19 నుంచి పర్యటన
- నెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే అవకాశం




సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో కొత్తగా ఆరు విమానాశ్రయాల ఏర్పాటును ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం.. సాధ్యా సాధ్యాలను అధ్యయనం చేసే బాధ్యతను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు అప్పగించింది. రాష్ట్ర మౌలిక సౌకర్యాలు, పెట్టుబడుల విభాగానికి చెందిన అధికారులు ప్రతిపాదిత విమానాశ్రయాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను ఇదివరకే సందర్శించారు. తాజాగా ఈ నెల 19 నుంచి ఏఏఐ అధికారులు కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నారు. వారు పరిశీలించాక ఈ నెలాఖరులోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారు. దీని ఆధారంగా విమానాశ్రయాల ఏర్పాటులో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు, రీజినల్ కనెక్టివిటీ స్కీం (ఆర్‌సీఎస్) కింద కేంద్ర విమానయాన శాఖ నుంచి అనుమతులు, నిధులు తదితరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించనుంది.

**అధ్యయనం కోసం రూ.4.5 కోట్లు**

దేశీయ విమానాశ్రయాల ఏర్పాటులో అధ్యయనం చేసేందుకు ఏఏఐని కన్సల్టెన్సీగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఫీజు కింద రూ.4.5 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. అడ్వాన్సు కింద 20 శాతం అనగా.. రూ.1.06 కోట్లు ఈ ఏడాది మే 22న చెల్లించింది. మూడు కొత్త విమానాశ్రయాల (గ్రీన్‌ఫీల్డ్) ఫీజిబిలిటీ ముసాయిదా నివేదిక ఇచ్చిన తర్వాత 45శాతం, గతంలో ఉన్న విమానాశ్రయాల (బ్రౌన్‌ఫీల్డ్) అభివృద్ధికి ఉన్న అవకాశాలపై నివేదిక ఇచ్చిన తర్వాత మరో 15శాతం నిధులు చెల్లించేలా ఏఏఐతో ఒప్పందం కుదిరింది. ఆరు విమానాశ్రయాలపై సవివర నివేదికలు (డీపీఆర్) ఇచ్చిన తర్వాత మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆరు దేశీయ విమానాశ్రయాల ఏర్పాటును ప్రతిపాదిస్తుండగా.. ఇందులో నిజామాబాద్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ విమానాశ్రయాలు పూర్తిగా కొత్తవి (గ్రీన్‌ఫీల్డ్)కాగా.. మరో మూడు పెద్దపల్లి (బసంత్‌నగర్), ఆదిలాబాద్, వరంగల్ (మామునూరు) గతంలో ఉన్నవే (బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు) కావడం గమనార్హం. ఈ నెల 19 నుంచి పర్యటించే ఏఏఐ అధ్యయన బృందం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల్లో సాధ్యాసాధ్యాలు, బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల విస్తరణలో సాంకేతిక సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక రూపొందిస్తుంది.

**భూ సేకరణ కీలకం...**

విమానాశ్రయాల ఏర్పాటు, అభివృద్ధిలో భూసేకరణ అత్యంత కీలకంగా మారడంతో పాటు, కొన్ని సాంకేతిక ఇబ్బందులు కూడా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు సవాలుగా నిలుస్తున్నాయి. నిజామాబాద్ విమానాశ్రయాన్ని జక్రాన్‌పల్లిలో ఏర్పాటుకు నిర్ణయించగా.. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు పునుకుడుచెర్లలో 1,600 ఎకరాలు అవసరమవుతాయని అంచనాకు వచ్చారు. మహబూబ్‌నగర్ విమానాశ్రయాన్ని బెంగళూరు జాతీయ రహదారికి సమీపంలో అడ్డాకుల వద్ద ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. పెద్దపల్లిలో ప్రస్తుతం ఓ ప్రైవేటు సిమెంటు కంపెనీ అధీనంలో ఉన్న విమానాశ్రయాన్ని విస్తరించి.. అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే ఓ మిలిటరీ ఎయిర్‌బేస్ ఉండగా.. దానిని పౌర విమానయాన సేవలకు వీలుగా తీర్చిదిద్దేందుకు రెండు విడతల్లో తొమ్మిది వందలకు పైగా ఎకరాలు అవసరమవుతాయని లెక్కలు వేశారు. ఇదిలా ఉంటే నిజాం కాలంలో ఏర్పాటు చేసిన మామునూరు ఎయిర్ స్ట్రిప్ (వరంగల్)ను డొమెస్టిక్ విమానాశ్రయంగా మార్చడంలో కొన్ని అవరోధాలు ఎదురవుతున్నాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వాయు మార్గంలో 150 కి.మీ పరిధిలో.. కొత్తగా ఎయిర్‌పోర్టులు నిర్మించబోమని ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో గతంలో ఒప్పందం కుదిరింది. ప్రతిపాదిత వరంగల్ విమానాశ్రయం కేవలం 122 కి.మీ పరిధిలోనే ఉంది. గ్రీన్, బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు వీలుగా పర్యావరణ, ఇతర శాఖల అనుమతులు కోరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏఏఐ నివేదిక అందిన తర్వాత.. అందులోని అంశాల ఆధారంగా ప్రతికూలతను పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది.



శుక్రవారం ప్రగతి భవన్‌లో వినోద్‌కుమార్‌కు నియామక పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బి.వినోద్

**కేబినెట్ హోదాతో మూడేళ్లు ఈ పదవిలో కొనసాగనున్న మాజీ ఎంపీ**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. నియామక ఉత్తర్వులను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ప్రగతి భవన్‌లో ఆయనకు అందజేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.. కేబినెట్ మంత్రి హోదాలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా మూడేళ్ల పాటు వినోద్ పదవిలో కొనసాగుతారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యక్షుడిగా సీఎం వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ప్రణాళికా సంఘం అత్యంత కీలకమైనది కావడంతో.. అనుభవజ్ఞుడైన వినోద్‌ను ఉపాధ్యక్ష పదవికి సీఎం ఎంపిక చేశారు. సెప్టెంబర్ చివరి వారంలో 2019–20 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అన్ని శాఖలకు సంబంధించిన వ్యవహారాలను సమీక్షించడంతో పాటు ప్రతిపాదనలు తయారు చేసే కీలక బాధ్యతను కూడా వినోద్ కుమార్‌కు కేసీఆర్ అప్పగించారు. ఈయన కేబినెట్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితుడిగా ఉంటారు. రాజకీయ, పాలనా అంశాల్లో ఉన్న అనుభవంతో పాటు రాష్ట్ర భౌగోళిక, సామాజిక, ఆర్థిక అంశాల పట్ల అవగాహన కలిగిన వినోద్ సేవలు సంపూర్ణంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సీఎం ఈ పదవిలో నియమించారు.

**నేరుగా సేవ చేసే అవకాశం**

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా రాష్ట్రానికి, ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం లభించిందని బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం నూతన ఉపాధ్యక్షుడి హోదాలో రాష్ట్ర పురోభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించే అవకాశం దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. తనను ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడిగా నియమించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినోద్ కృతజ్ఞతలు తెలిపారు.

# కృష్ణాలో తగ్గుతున్న వరద

- బేసిన్ ప్రాజెక్టులన్నింటికీ తగ్గుతున్న ప్రవాహాలు
- కర్ణాటక, మహారాష్ట్రల్లో వర్షాలు తెరిపినివ్వడంతోనే..

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్ వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. కర్ణాటక, మహారాష్ట్రలో వర్షాలు తెరిపినివ్వడంతో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం తగ్గుతోంది. నిన్నమొన్నటి వరకు ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్‌ల నుంచి 7 లక్షల క్యూసెక్కులకుపైగా వరద ప్రవాహాలు నమోదు కాగా, ప్రస్తుతం 4.5 లక్షల క్యూసెక్కుల మేర వరద వస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టులన్నీ నిండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా కిందకు వదిలేస్తున్నారు. భీమా నది నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో జూరాలకు ఇన్‌ఫ్లో తగ్గింది. తుంగభద్ర నుంచి వస్తున్న ప్రవాహాలు, ఎగువ కృష్ణా నుంచి వస్తున్న ప్రవాహాల కారణంగా శ్రీశైలానికి 8 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. సాగర్‌లోకి 6.32 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 7.12 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..(నిల్వ–టీఎంసీల్లో)**

| ప్రాజెక్టు | పూర్తి నీటి నిల్వ | ప్రస్తుత నీటి నిల్వ | ఇన్‌ఫ్లో(క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 103.87 | 4,50,000 | 4,50,000 |
| నారాయణపూర్ | 37.646 | 26.35 | 4,80,000 | 4,62,400 |
| జూరాల | 9.65 | 7.21 | 6,85,000 | 6,67,206 |
| శ్రీశైలం | 215.807 | 196.56 | 8,05,100 | 8,18,797 |
| తుంగభద్ర | 100.86 | 100.32 | 63,893 | 41,640 |
| ఉజ్జయిని | 117.24 | 117.24 | 8,000 | 5,950 |
| నాగార్జునసాగర్ | 312.045 | 299.45 | 6,32,447 | 7,12,586 |
| పులిచింతల | 45.77 | 37.68 | 6,77,652 | 7,52,920 |
| కడెం | 7.6 | 6.86 | 1,127 | 818 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.59 | 0 | 0 |
| ఎస్సారెస్పీ | 90.31 | 17.18 | 0 | 389 |

# మై ఛాయిస్.. మై ఫ్యూచర్!

- విద్యార్థుల ఆత్మహత్యల నిరోధానికి విద్యాశాఖ వినూత్న కార్యక్రమం
- పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు సైకోమెట్రిక్ టెస్ట్
- విద్యార్థుల నైపుణ్యాన్ని, ఆసక్తులను గుర్తించే పరీక్ష
- ఐఐటీ మద్రాసు ప్రతినిధులతో నేడు ఎంవోయూ



సాక్షి, హైదరాబాద్: మార్కులు తక్కువ వచ్చాయనే కారణంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా నిరోధించేందుకు తెలంగాణ విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇటీవల పలువురు ఇంటర్ విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడిన నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటంపై దృష్టి సారించి.. ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆసక్తి ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదో తరగతి, ఇంటర్ చదివేవారికి సైకోమెట్రిక్ టెస్ట్ నిర్వహించాలని నిర్ణయించింది.

**ఏమిటీ సైకోమెట్రిక్ టెస్ట్..?**

విద్యార్థుల ఆసక్తులను పాఠశాల స్థాయిలోనే గుర్తించే వ్యవస్థ విదేశాల్లో అమల్లో ఉంది. సైకోమెట్రిక్ టెస్టుల ద్వారా చదువులోనే కాకుండా నటన, క్రీడలు, సాహిత్యం, సాంస్కృతికం, రాజకీయ తదితర రంగాల్లో వారి ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి ఆ రంగాల్లోనే ప్రోత్సహిస్తారు. అయితే, మనదేశంలో అలాంటి విధానం లేదు. విద్యార్థుల ఆసక్తి ఒకటైతే, తల్లిదండ్రుల ఆసక్తి మరొకటిగా ఉంటోంది. చాలామంది విద్యార్థులు కూడా తాము రాణించగలిగే రంగాలను గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఐఐటీ మద్రాసుకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థుల బృందం దాదాపు మూడేళ్ల పాటు పరిశోధనలు సాగించింది. విద్యార్థులు ఆసక్తి లేని కోర్సులను ఎంచుకొని అందులో రాణించలేక విఫలమై నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని గుర్తించారు. దేశం ఎదుర్కొంటున్న ఈ తీవ్రమైన సమస్యకు పరిష్కారంగా ''మై ఛాయిస్–మై ఫ్యూచర్''(ఎంసీఎంఎఫ్) సైకోమెట్రిక్ టెస్ట్ అభివృద్ధి చేశారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కోసం రూపొందించిన ఈ అసెస్‌మెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న ఆసక్తులను గుర్తించవచ్చు. తద్వారా వారిని ఆ రంగాల్లోనే ప్రోత్సహించవచ్చు. ఈ పరీక్షలో 12 అంశాలకు సంబంధించి 72 సాధారణ ప్రశ్నలుంటాయి. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్ష తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రుల అనుమానాలను కౌన్సిలర్లు నివృత్తి చేస్తారు. అనంతరం విద్యార్థి ఆసక్తి, నైపుణ్యాన్ని బట్టి ఆయా రంగాల్లో అతడిని ప్రోత్సహిస్తారు. నాలుగేళ్ల క్రితం అన్ని ప్రాంతీయ భాషల్లో ఈ పరీక్షను అందుబాటులోకి తెచ్చారు.

**తెలంగాణ మోడల్ స్కూళ్లలో అమలు..**

ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యల తర్వాత ఇలాంటివి పునరావృతం కాకుండా రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు సైకోమెట్రిక్ టెస్ట్ నిర్వహించాలని భావిస్తోంది. ఈ అంశంపై ఎంసీఎంఎఫ్‌ను అభివృద్ధి చేసిన ఐఐటీ మద్రాసుకు చెందిన ప్రతినిధులతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్ రెడ్డి ఇటీవలే చర్చించారు. తొలుత రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఐఐటీ మద్రాసు ప్రతినిధులతో తెలంగాణ విద్యాశాఖ శనివారం ఎంఓయూ కుదుర్చుకోనుంది.

# ఐఐసీటీ, సన్‌ఫార్మా అరుదైన ఒప్పందం

- ఔషధ తయారీలో నూతన అధ్యాయం
- సరికొత్త రసాయన మూలకంపై పరీక్షలకు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఔషధ తయారీలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అనేక వ్యాధులకు మెరుగైన, మరింత చౌకగా మందులు అందించేందుకు ఉపయోగపడే సరికొత్త రసాయన మూలకాన్ని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) గుర్తించింది. ఈ రసాయన మూలకాన్ని పరీక్షించేందుకు గాను దేశంలోనే అతిపెద్ద ఫార్మా కంపెనీ సన్‌ఫార్మాతో ఐఐసీటీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా సన్‌ఫార్మా రానున్న ఐదేళ్లలో రూ.240 కోట్లు ఐఐసీటీకి చెల్లించనుంది. కొత్త రసాయన మూలకంపై ఐఐసీటీ పేటెంట్ హక్కులను సన్‌ఫార్మాకు బదలాయించే ప్రక్రియ మొదలైందని.. అన్నీ సవ్యంగా సాగితే ఇంకో 20 నెలల్లోనే ఈ మందు తొలిదశ క్లినికల్ ట్రయల్స్‌కు సిద్ధమవుతుందని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. తమ ఆధ్వర్యంలో నడుస్తున్న రసాయన మూలకాల బ్యాంక్‌లోని దాదాపు 60 వేల మూలకాల్లో ఇదీ ఒకటని.. కేన్సర్‌తోపాటు కొన్ని ఇతర వ్యాధులపై ప్రభావం చూపగలదని చెప్పారు. ఈ రసాయన మూలకం సహజసిద్ధ పదార్థం నుంచి వేరు చేసినప్పటికీ మందుగా వాడేందుకు కృత్రిమంగా తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకయ్యే ఖర్చు చాలా తక్కువని, మూలకం తాలూకూ నిర్మాణం సరళంగా ఉండటమే దీనికి కారణమని తెలిపారు. జెనరిక్ మందుల తయారీ కేంద్రంగా భారత్‌కున్న ముద్రను చెరిపేసేందుకు ఈ ఆవిష్కరణ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. తాజాగా గుర్తించిన మూలకం కాకుండా మరో 3 కీలకమైన మూలకాలనూ ప్రస్తుతం పరీక్షిస్తున్నామని, నాడీ వ్యవస్థ సంబంధిత వ్యాధులతోపాటు, రొమ్ము కేన్సర్‌పై ఇవి ప్రభావం చూపుతాయని తెలిపారు.

# ఎంబీఏలో 17,011 మందికి సీట్లు

- ఎంసీఏలో 1,765 మందికి సీట్లు కేటాయింపు
- ఐసెట్ సీట్ల కేటాయింపును ప్రకటించిన ప్రవేశాల కమిటీ
- 157 కాలేజీల్లో వంద శాతం సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు సంబంధించిన సీట్ల కేటాయింపును ప్రవేశాల కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఎంబీఏలో 17,011 మందికి సీట్లు లభించగా, ఎంసీఏలో 1,765 మందికి సీట్లు లభించినట్లు కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ఐసెట్‌లో 41,004 మంది అర్హత సాధించగా 20,334 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అందులో 19,972 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. ఇక కాలేజీల్లో 23,940 సీట్లు అందుబాటులో ఉండగా 18,776 సీట్లు భర్తీ అవ్వగా.. 5,164 సీట్లు మిగిలాయి. 157 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 21లోగా ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. చివరి దశ కౌన్సెలింగ్ పూర్తయ్యాకే కాలేజీల్లో రిపోర్టు చేయాలని వెల్లడించారు. రాష్ట్రంలోని 19 ప్రభుత్వ ఎంబీఏ కాలేజీల్లో అందుబాటులో ఉన్న మొత్తం 1,290 సీట్లు భర్తీ అయ్యాయి. ఇక 14 ప్రభుత్వ ఎంసీఏ కాలేజీల్లోని మొత్తం 670 సీట్లు భర్తీ అయ్యాయి.

# ఇటు వానలు.. అటు మూఢాలు

- భారీగా తగ్గిన బస్సు ప్రయాణికుల సంఖ్య
- పడిపోయిన ఆర్టీసీ ఆదాయం
- ప్రస్తుతం సగటున నిత్యం రూ. 2 కోట్ల నష్టం
- సెప్టెంబర్ ఆఖరుదాకా పెద్దగా ప్రయాణాలుండవని అంచనా




సాక్షి, హైదరాబాద్: 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డ' చందంగా ఉంది ఆర్టీసీ పరిస్థితి. అసలే నష్టాలు.. ఆపై ఆదాయంలో భారీగా కోతపడింది. ఈసారి ఆర్టీసీపై నష్టాల 'జల్లుల' కురిశాయి. మూఢాలు కూడా ఆదాయాన్ని దెబ్బతీశాయి. ఒక్క నెల ఆదాయం తగ్గినా ఆర్టీసీది గిలగిలలాడే పరిస్థితి. అలాంటిది వరసగా 3 నెలలపాటు ఆదాయం భారీగా పడిపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. ఓ వైపు వానలు, మరోవైపు మూఢాలు కలిసి రావటంతో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య తగ్గి ఆదాయం బాగా పడిపోయింది. సాధారణ రోజుల్లో ఆర్టీసీకి ప్రతిరోజూ రూ.11 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతుంది. పెళ్లిళ్లు, ఇతర ముఖ్యమైన ఉత్సవాలు, ప్రధాన పండుగల సమయంలో ఆ ఆదాయం మరో కోటి వరకు అదనంగా ఉంటుంది. జూలైతోపాటు ఆగస్టులో వానల ప్రభావంతో ప్రయాణాలు తగ్గి ఆదాయం పడిపోయింది. ప్రస్తుతం ఆర్టీసీ ప్రతిరోజూ సగటున రూ.2 కోట్లమేర నష్టాల్లోకి కూరుకుపోతోంది. ఆదాయం రూ.11 కోట్లు ఉంటే, ఖర్చు దాదాపు రూ.13 కోట్లు అవుతోంది. ఇలాంటి సమయంలో టికెట్ల రూపంలో వచ్చే ఆదాయం మరింత పడిపోతే.. నష్టాలు అంతమేర పెరిగినట్టే. మూడు నెలలపాటు ఈ పరిస్థితి ఉండనుండటంతో అధికారుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.

**వానలతో కుదేలు..**

సాధారణంగా ప్రతి వర్షాకాలంలో ఆర్టీసీకి నష్టాలు పెరుగుతాయి. వానలు ఎక్కువగా ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో ఎక్కువమంది ప్రయాణాలు రద్దు చేసుకుంటారు. వరదలు వచ్చినప్పుడు బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య బాగా తగ్గి ఆక్యుపెన్సీ రేషియో 55 శాతమే నమోదవుతుంది. సాధారణ రోజుల్లో నెల ఆదాయం సగటున రూ.355 కోట్లుగా ఉంటుంది. కానీ, గత జూన్‌లో అది రూ.347 కోట్లుగా నమోదైంది. ఆ నెల మూడు, నాలుగో వారంలో మొదలైన వానలు ప్రయాణాలపై కొంత ప్రభావం చూపాయి. జూలైలో వర్షాలు భారీగా కురవటంతో పరిస్థితి అదుపు తప్పింది. జూలై ఆదాయం కేవలం రూ.329 కోట్లుగా మాత్రమే నమోదైంది. జూన్‌తో పోలిస్తే రూ.18 కోట్లు తక్కువ వచ్చింది. ఆగస్టులో ఇప్పటివరకు ఆదాయం కేవలం రూ.154 కోట్లు సమకూరింది. రాష్ట్రవ్యాప్తంగా భారీవర్షాలు కురిసే సమయం కావటంతో ఆదాయం మరింత తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. శ్రావణమాసం అనగానే ఆర్టీసీలో ఆనందం వ్యక్తమవటం సహజం. ఆ నెలలో శుభకార్యాలు ఎక్కువగా ఉండనుండటంతో ప్రయాణికుల సంఖ్య పెరిగి ఆదాయం ఎక్కువగా నమోదవుతుంది. కానీ, ఈసారి శ్రావణమాసంలో మూఢాలు రావటంతో శుభకార్యాలు నిర్వహించటం లేదు. దీంతో ప్రయాణాలు తగ్గి ఆదాయం పడిపోతోంది. సెప్టెంబర్ చివరి వరకు మంచి రోజులు లేకపోవటంతో వచ్చేనెల కూడా ప్రయాణాలు బాగా తగ్గుముఖం పట్టి ఆదాయంపై ప్రభావం చూపనుంది. మళ్లీ అక్టోబర్ వరకు ఆర్టీసీ ఎదురు చూడకతప్పని పరిస్థితి నెలకొంది.

**గతేడాదితో పోలిస్తే భారీ నష్టాలు**

ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఈసారి నష్టాలు బాగా పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి రూ.109 కోట్ల మేర నష్టాలు నమోదుకాగా ఈ ఆర్థిక సంవత్సరం అవే నెలల్లో రూ.131.64 కోట్లుగా నమోదయ్యాయి. అంటే నష్టాలు రూ.22 కోట్లు పెరిగాయన్నమాట. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో రూ.38.23 కోట్లు, మే నెలలో రూ.37.96 కోట్లు, జూన్‌లో రూ.55.45 కోట్ల మేర నష్టాలు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం మొత్తం నష్టాలు రూ.928 కోట్లు కాగా, ఈసారి అవి రూ.వేయి కోట్లకు చేరే అవకాశముందని ఈ అంకెలు సంకేతాలిస్తున్నాయి.

# జకార్తా జలవిలయం!

- 2050 నాటికి నగరంలో మూడో వంతు సముద్రగర్భంలోకి
- బోర్నియో దీవికి రాజధానిని తరలించాలని నిర్ణయించిన ఇండోనేసియా ప్రభుత్వం

**జకార్తా:** ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో శుక్రవారం కీలక ప్రకటన చేశారు. పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తూ..'దేశ రాజధానిని జకార్తా నుంచి బోర్నియో దీవిలోని కలిమంతన్‌కు తరలించేందుకు పార్లమెంటు అనుమతి కోరుతున్నాను. రాజధాని అంటే కేవలం ఓ జాతికున్న గుర్తింపు మాత్రమే కాదు. అది దేశం సాధించిన ప్రగతికి చిహ్నం కూడా' అని విడోడో తెలిపారు. ఏకంగా అధ్యక్షుడే ఈ తరహా వ్యాఖ్యలు చేయడానికి చాలా ముఖ్యమైన కారణముంది. పర్యావరణ మార్పులు, భూతాపం కారణంగా జకార్తా సముద్రంలో శరవేగంగా మునిగిపోతోంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం పలుచర్యలు తీసుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. ప్రస్తుతమున్న పరిస్థితులే కొనసాగితే, 2050 నాటికి నగరంలోని మూడో వంతు ప్రాంతం సముద్రగర్భంలోకి జారిపోతుందని పర్యావరణవేత్తలు హెచ్చరించిన నేపథ్యంలో రాజధానిని తరలించాలని ఇండోనేసియా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### పాలకుల వైఫల్యమే శాపం..

కోటి మందికిపైగా ప్రజలు నివసిస్తున్న జకార్తా భూకంపాలు అధికంగా సంభవించే జోన్‌లో ఉంది. చిత్తడినేలపై నిర్మితమైన ఈ నగరానికి సమీపంలో 13 నదులు కలుస్తున్నాయి. పాలకులు జకార్తా నిర్మాణం సమయంలో తాగునీటి సరఫరాపై దృష్టి సారించకపోవడం ఈ నగరం పాలిట శాపంగా మారింది. నీటి సరఫరా జరగకపోవడంతో పరిశ్రమలు, ప్రజలు తమ అవసరాల కోసం బోర్లు వేసి భూగర్భ జలాన్ని విచ్చలవిడిగా తోడేశారు. స్థానిక జలాశయాల్లోని నీటిని కోలుకోలేని రీతిలో వాడేశారు. దీంతో చాలాచోట్ల భూగర్భ జలాలు ఇంకిపోయాయి. దీనికితోడు రాజధాని కావడంతో పెద్దఎత్తున ఆకాశ హర్మ్యాల నిర్మాణం జరిగింది. ఈ చర్యల కారణంగా జకార్తాలో భూమి క్రమంగా కుంగడం ప్రారంభమైంది. ప్రస్తుతం జకార్తాలో ఏటా 25 సెం.మీ. మేర భూమి కుంగిపోతోంది. కొన్నిచోట్లయితే నేల సముద్రమట్టానికి 4 మీటర్ల దిగువకు చేరుకుంది. భూతాపం కారణంగా సముద్రమట్టం పెరుగుతోంది.




### ఫలించని ప్రయత్నాలు..

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జకార్తాను కాపాడుకునేందుకు ఇండోనేసియా ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. జవా సముద్రం ఆటుపోట్లను అడ్డుకునేలా ఓ పొడవైన గోడతో పాటు కృత్రిమ దీవులను నిర్మించాలని అధ్యక్షుడు జోకో విడోడో ప్రతిపాదించారు. ఇందుకు రూ.2.84 లక్షల కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులోభాగంగా ఇప్పటివరకూ 32 కిలోమీటర్ల మేర భారీ సముద్రపు గోడను, 17 కృత్రిమ దీవులను నిర్మించారు. అయితే ఇది సమస్యకు అనుకున్న పరిష్కారం చూపలేకపోయింది. ఈ భారీ సముద్రపు గోడ నుంచి చాలాచోట్ల నీరు ఊరటం ప్రారంభమైంది. మరికొన్ని చోట్ల ఈ గోడే నేలలోకి కుంగిపోవడం ప్రారంభించింది. దీంతో రాజధానిని తరలించడం తప్ప మరో ప్రత్యామ్నాయం ప్రస్తుతానికి లేదని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చేసింది. అయితే జకార్తాలోని మూడోవంతు ప్రాంతం మునిగిపోతే లక్షలాది మంది ఇండోనేసియా ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదముంది. వీరందరికీ ఆశ్రయం కల్పించడం ఇండోనేసియా ప్రభుత్వానికి నిజంగానే సవాలుగా మారనుంది.

## జైట్లీ పరిస్థితి విషమం



**న్యూఢిల్లీ:** బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ (66) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ఈ నెల 9 నుంచి ఆయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతుండగా, శుక్రవారం ఉదయం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వైద్యశాలకు వెళ్లి జైట్లీని పరామర్శించారు. మళ్లీ రాత్రి 11 గంటల సమయంలో హోం మంత్రి అమిత్ షా, ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్‌లు కూడా ఆసుపత్రికి వచ్చి జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. శ్వాసతీసుకోవడంలో సమస్య తలెత్తడంతో ఆయన ఆగస్టు 9న ఉదయం ఎయిమ్స్‌లో చేరారు. ఆ రోజు రాత్రి నుంచి ఆయనను వైద్యులు ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచారు. జైట్లీ ఆరోగ్యం నిలకడగానే ఉందని అదే రోజు రాత్రే ఎయిమ్స్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆ తర్వాతి నుంచి ఆయన ఆరోగ్యానికి సంబంధించిన వివరాలేవీ బయటకు రాలేదు.

# కశ్మీర్‌పై ఐరాసలో రహస్య చర్చలు

**ఐక్యరాజ్య సమితి:** జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని భారత్ తొలగించిన అంశంపై ఐక్యరాజ్య సమితి (ఐరాస) భద్రతా మండలి శుక్రవారం రహస్య చర్చలు జరిపింది. పాకిస్తాన్ కోసం దాని మిత్రదేశం చైనా విజ్ఞప్తి మేరకు ఈ రహస్య చర్చలు జరిగాయి. అయితే ఇవి రహస్య చర్చలైనందున లోపల ఏ దేశం ఏం మాట్లాడిందనే విషయం బయటకు రాలేదు. భద్రతా మండలిలోని ఐదు శాశ్వత, పది తాత్కాలిక (మొత్తం 15) సభ్య దేశాలే ఈ చర్చల్లో పాల్గొంటున్నాయి. భారత్, పాక్‌లకు భద్రతా మండలిలో ఎలాంటి సభ్యత్వమూ లేనందున ఈ రెండు దేశాలు ఆ రహస్య చర్చల్లో పాల్గొన లేదు. తమ ప్రతినిధికి కూడా చర్చల్లో పాల్గొనే అవకాశం ఇవ్వాలని పాకిస్తాన్ అభ్యర్థించినా భద్రతా మండలి అందుకు ఒప్పుకోలేదు. భద్రతా మండలి శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌లతోపాటు తాత్కాలిక

**భేటీకి హాజరైన మొత్తం 15 భద్రతామండలి సభ్యదేశాలు**

సభ్యదేశాలైన జర్మనీ, బెల్జియం, కువైట్, దక్షిణాఫ్రికా, ఇండోనేసియా, పోలాండ్, పెరూ, డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెటోరియల్ గినియా, కోట్ డీవవరీలు రహస్య చర్చల్లో పాల్గొన్నాయి. ఆర్టికల్ 370ని రద్దు చేయడం పూర్తిగా తమ అంతర్గత అంశమని భారత్ ఇప్పటికే ప్రపంచ దేశాలకు స్పష్టం చేయగా, పాక్ మాత్రం ఈ అంశాన్ని అంతర్జాతీయ స్థాయిలో లేవనెత్తి వివాదాస్పదం చేస్తోంది.

**శాంతంగా పరిష్కరించుకోవాలి: రష్యా, చైనా**
చర్చల్లో పాల్గొనడానికి ముందు ఐరాసలో రష్యా ఉప శాశ్వత ప్రతినిధి దిమిత్రీ పోల్యాంస్కీ మాట్లాడుతూ కశ్మీర్ అంశం భారత్, పాక్‌ల మధ్య ద్వైపాక్షిక అంశంగానే రష్యా చూస్తోందని అన్నారు. ఇప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకునేందుకే



ప్రస్తుతం ఈ రహస్య చర్చ జరుగుతోందని ఆయన అన్నారు. రహస్య చర్చలు ముగిసిన తర్వాత ఐక్యరాజ్య సమితిలో చైనా రాయబారి ఝాంగ్ జున్ మాట్లాడుతూ భారత్, పాక్‌లు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరారు. ఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే పద్ధతిని మానుకోవాలని సూచించారు. లదాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడంపై ఆయన స్పందిస్తూ, భారత చర్యలు చైనా సార్వభౌమాధికారాన్ని సవాల్ చేసేలా ఉన్నాయనీ, సరిహద్దులపై ద్వైపాక్షిక ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘించడం పట్ల చైనా కూడా ఆందోళనతో ఉందని అన్నారు.

**ఉగ్రవాదం ఆపితేనే చర్చలు: భారత్**

ఉగ్రవాద చర్యలు, కార్యకలాపాలను పాకిస్తాన్ ఆపిన తర్వాతే ఆ దేశంతో చర్చలు జరుపుతామని ఐరాసలో భారత ప్రతినిధి అక్బరుద్దీన్ అన్నారు. రహస్య చర్చలు ముగిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో భారత్ చెప్పినట్లుగానే కశ్మీర్‌లో 370వ అధికరణం రద్దు అంశం భారత అంతర్గత వ్యవహారమన్నారు. ఇతర దేశాలకు దీనితో పనిలేదన్నారు. పాక్‌పై ఆయన పరోక్షంగా వ్యాఖ్యలు చేస్తూ, కశ్మీర్‌లో ఏదో జరిగిపోతోందని భయపెట్టేలా పాక్ ప్రవర్తిస్తోందనీ, ఇది వాస్తవ దూరమని అన్నారు. కశ్మీర్ అంశంపై రెండు దేశాలు (పాక్, చైనా) తమ అభిప్రాయాలను అంతర్జాతీయ సమాజం అభిప్రాయంగా మార్చాలనుకున్నాయనీ, కానీ అది జరగలేదని పేర్కొన్నారు.

## ఎండోస్కోప్‌తో త్రీడీ చిత్రాలు..

**బెర్లిన్:** అతి సూక్ష్మమైన కణాల త్రీడీ చిత్రాలను తీసేందుకు వీలుగా వినూత్నమైన లెన్స్ రహిత ఎండోస్కోప్‌ను పరిశోధకులు అభివృద్ధిపరిచారు. ఎలాంటి లెన్స్, ఆప్టికల్ లేదా మెకానికల్ పరికరం లేకుండానే ఈ ఎండోస్కోప్ 200 మైక్రాన్ల పరిమాణం గల కణజాలాన్ని ఫొటోలు తీయగలదు. దీంతో వైద్య, పరిశోధన రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. సరికొత్త ఎండోస్కోప్ సన్నని సూది మందంలో ఉంటుందని, తద్వారా దీన్ని వాడేటప్పుడు వేరే కణజాలానికి ఎలాంటి నష్టం జరగదని, పైగా శరీరం లోపల ఎటు అంటే అటు వంగుతుందని జర్మనీలోని డ్రెస్‌డెన్ యూనివర్సిటీకి చెందిన జుర్గెన్ డబ్ల్యూ జార్స్కే వివరించారు. 150 మైక్రాన్ల మందం ఉన్న గ్లాస్‌ప్లేట్‌ను ఎండోస్కోప్‌లోని ఆప్టికల్ ఫైబర్ బండిల్ కొనకు కలిపారు. మధ్యలోని ఫైబర్ కోర్ వెలిగితే.. అక్కడి నుంచి కాంతి పరావర్తనం చెంది మిగిలిన ఆప్టికల్ ఫైబర్స్ గుండా వెనక్కి వెళ్తుంది. దీంతో ఎంత కాంతి ప్రయాణించిందనే విషయం తెలుస్తుంది. దీన్నే ఆప్టికల్ ట్రాన్స్‌ఫర్ ఫంక్షన్ అని పిలుస్తారు. మాడ్యులేటర్ అనే చిన్న పరికరం ద్వారా కాంతి వెళ్లే దిశను మార్చుకోవచ్చు.




జైసల్మీర్‌లో జవాన్లనుద్దేశించి ప్రసంగిస్తున్న రాజ్‌నాథ్ సింగ్

# మన అణ్వస్త్ర విధానం మారొచ్చు

- అప్పటి పరిస్థితిని బట్టి ఉంటుంది
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్

**జైపూర్/న్యూఢిల్లీ:** సరిహద్దులో పాక్ కయ్యానికి కాలు దువ్వుతున్నవేళ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మొదటగా అణ్వాయుధాలను ప్రయోగించరాదు'అన్న విధానానికే భారత్ కట్టుబడి ఉందనీ, అయితే భవిష్యత్‌లో ఎదురయ్యే పరిస్థితుల దృష్ట్యా ఇది మారవచ్చని పరోక్షంగా పాక్‌ను హెచ్చరించారు. రాజస్తాన్‌లోని పోఖ్రాన్(1974, 1998 అణుపరీక్షలు నిర్వహించిన ప్రాంతం)ను రాజ్‌నాథ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..'భారత్‌ను అణ్వస్త్ర శక్తిగా మార్చాలన్న అటల్‌బిహారీ వాజ్‌పేయి దృఢసంకల్పానికి ఈ ప్రాంతం ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. అణ్వస్త్రాలను ఇతరులపై మొదటగా ప్రయోగించరాదన్న సిద్ధాంతానికి భారత్ ఇప్పటికీ గట్టిగా కట్టుబడింది. కానీ భవిష్యత్‌లో ఎదురయ్యే పరిస్థితులను బట్టి ఇది మారొచ్చు'అని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా రాజ్‌నాథ్ ఆయనకు నివాళులు అర్పించారు. 'భారత్ బాధ్యతాయుతమైన అణ్వస్త్రశక్తిగా మారడం ప్రజలందరికీ గర్వకారణమే. ఇందుకు భారత్ అటల్‌జీకి రుణపడి ఉంటుంది'అని ట్వీట్ చేశారు. మరోవైపు రాజ్‌నాథ్ వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. అణ్వాయుధాల ప్రయోగంపై కేంద్ర ప్రభుత్వం తమ విధానాలను బయటపెట్టాలనీ, ఈ అస్పష్టతకు తెరదించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం వెనుక దేశమంతా నిలబడుతుందనీ, అయితే ముందుగా మన అణు విధానంపై వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరింది.

# అర్ధగంట చదివినా అర్థంకాలేదు

- 'ఆర్టికల్ 370' పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య
- పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ/శ్రీనగర్:** రాజ్యాంగంలోని 370వ అధికరణం రద్దును వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరిస్తూ, ఆ పిటిషన్లలో అనేక లోపాలు ఉన్నాయనీ, ముందు వాటిని సరిచేసుకోవాలని సూచించింది. ఇంతటి తీవ్రమైన, ప్రధానమైన అంశానికి సంబంధించిన పిటిషన్లలో అనేక తప్పులు, లోపాలు ఉండటంపై సుప్రీంకోర్టు విచారం వ్యక్తం చేసింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం ఈ నెల 5న రద్దు చేయడం తెలిసిందే. ఈ చర్యను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు వేశారు. న్యాయవాది ఎంఎల్ శర్మ మొట్టమొదటగా, ఆగస్టు 6నే వేసిన పిటిషన్‌ను కోర్టు పరిశీలించింది. శర్మ పిటిషన్‌పై జస్టిస్ గొగోయ్ వ్యాఖ్యానిస్తూ 'ఈ పిటిషన్‌ను అర్ధగంటపాటు చదివాను. కానీ ఈ పిటిషన్ ఎందుకు వేశారో అర్థం కాలేదు. పిటిషనర్ ఏం కోరుతున్నారో తెలియలేదు. ఏం అడుగుతున్నారో స్పష్టంగా తెలియడం లేదు. ఏం పిటిషన్ ఇది?' అని అన్నారు.

**మరికొంత సమయం ఇస్తాం..**
జమ్మూ కశ్మీర్‌లో మీడియాపై ఆంక్షలను ఎత్తివేయాలంటూ వచ్చిన పిటిషన్‌ను కూడా ఇదే ధర్మాసనం విచారించింది. ఆంక్షలను క్రమక్రమంగా ఎత్తివేస్తున్నామని కేంద్రం తరపు న్యాయవాది చెప్పడంతో ఈ అంశంలో ఏదైనా ఆదేశం జారీ చేసే ముందు తాము మరికొంత సమయం వేచి



చూడనున్నట్లు సుప్రీంకోర్టు చెప్పింది. కేంద్రం తరపున అటార్నీ జనరల్ వేణుగోపాల్ వాదిస్తూ క్రమక్రమంగా ఆంక్షలను ఎత్తివేస్తున్నామని చెప్పారు. ఇరు పక్షాల వాదనలనూ విన్న అనంతరం ధర్మాసనం స్పందిస్తూ, ' ఆంక్షల ఎత్తివేతపై కేంద్ర ప్రభుత్వానికి మేం మరికొంత సమయం ఇవ్వదలచుకున్నాం' అని తెలిపింది.

## ఎవ్వరూ చనిపోలేదు

**జ**మ్మూ కశ్మీర్‌లో ఆగస్టు 5న ఆంక్షలు విధించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఒక్క ప్రాణం కూడా పోలేదనీ, ఎవరికీ పెద్ద గాయాలు కాలేదని ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం చెప్పారు. కశ్మీర్‌లో ల్యాండ్‌లైన్ ఫోన్ కనెక్షన్లను పునరుద్ధరించే పని శుక్రవారం రాత్రి నుంచే ప్రారంభమవుతుందనీ, శనివారం ఉదయానికే శ్రీనగర్‌లోని అత్యధిక భాగం ఫోన్లు పనిచేస్తుంటాయని ఆయన తెలిపారు. కశ్మీర్‌లో పాఠశాలలను వచ్చే వారంలో పునఃప్రారంభిస్తామనీ, దశల వారీగా ఆంక్షలను ఎత్తివేస్తామన్నారు. కశ్మీర్ లోయలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం బాగా ఎక్కువగానే హాజరు నమోదైందని సుబ్రహ్మణ్యం తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో 22 జిల్లాలు ఉండగా, ప్రస్తుతం 12 జిల్లాల్లో ఫోన్ కనెక్షన్లన్నీ సాధారణంగా పనిచేస్తున్నాయనీ, మరో ఐదు జిల్లాల్లో కేవలం రాత్రి వేళల్లోనే ఆంక్షలు ఉన్నాయని సుబ్రహ్మణ్యం చెప్పారు. కశ్మీర్ లోయలో 11 రోజులు ఉన్న అనంతరం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ శుక్రవారం ఢిల్లీకి తిరిగొచ్చారు. మరోవైపు కశ్మీర్‌లో ఫోన్‌లైన్లు, మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు పనిచేయకపోవడంతో.. బయటి ప్రాంతాల్లోని వ్యక్తులు తమ సందేశాలను టీవీ చానెళ్లకు పంపితే, చానెళ్లు వాటిని టీవీల్లో టిక్కర్ (స్క్రోలింగ్) రూపంలో కశ్మీర్‌లోని వారికి అందిస్తున్నాయి. అయితే కశ్మీర్‌లోని వారంతా ఈ మెసేజ్‌లను టీవీల్లో చూడగలరు తప్ప తిరిగి సమాధానం పంపలేరు.

**థార్ లింక్ ఎక్స్‌ప్రెస్ రద్దు**
థార్ ఎక్స్‌ప్రెస్ ద్వారా కరాచీ వెళ్లేందుకు జీరోపాయింట్ వరకూ నడుపుతున్న లింక్ ఎక్స్‌ప్రెస్‌ను భారత ప్రభుత్వం రద్దు చేసింది. శుక్రవారం ప్రారంభం కావాల్సిన ఈ రైలు ఆగిపోయిందని వాయువ్య రైల్వే అధికారి అభయ్‌శర్మ అన్నారు. అటునుంచి రావాల్సిన రైలు కూడా నిలిచిపోయిందని తెలిపారు.

**ట్రంప్‌కు ఇమ్రాన్‌ఖాన్ ఫోన్**
పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ శుక్రవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కశ్మీర్ సమస్యపై ఫోన్‌లో చర్చించినట్లు పాక్ విదేశాంగ మంత్రి తెలిపారు. కశ్మీర్ విషయంలో ఐరాసలో రహస్య భేటీ జరుగుతున్న సందర్భంగా ట్రంప్–ఇమ్రాన్ మాట్లాడుకున్నారని చెప్పారు.

## రాహుల్ రాఖీ చూడలేదు

**భోపాల్:** కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాఖీ కట్టించుకోవడం ఒక్కసారి కూడా చూడలేదని మధ్యప్రదేశ్ బీజేపీ నేత విశ్వాస్ సరాంగ్ అన్నారు. రాహుల్ గాంధీకి ప్రియాంక రాఖీ కడుతున్నట్లు ఇంత వరకూ ఒక్క ఫొటో కూడా చూడలేదన్నారు. వారు ఇటాలియన్ సంస్కృతిలో పెరిగారని, హిందూ పండుగలు చేసుకుంటారో లేదోనని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు దేవాలయాల చుట్టూ తిరిగే రాహుల్, రాఖీ మాత్రం ఎందుకు జరుపుకోవట్లేదో అని వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. రాహుల్ రాఖీ జరుపుకుంటారో లేదోనని బీజేపీ వారు సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదని బదులిచ్చింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పంకజ్ చతుర్వేది మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పండుగలను కేవలం విశ్వాసానికి సంబంధించిన అంశంగా చూస్తుందని, కానీ బీజేపీ మాత్రం మత రాజకీయాలే లక్ష్యంగా పండుగలు చేస్తుందని విమర్శించారు.



అటల్‌జీకి నివాళులర్పిస్తున్న మోదీ. చిత్రంలో అమిత్, అటల్ కూతురు నమిత కౌల్

# వివాదాస్పద స్థలంలో భారీ ఆలయం!

**'అయోధ్య'పై సుప్రీంకోర్టులో వాదించిన రామ్‌లల్లా విరాజ్‌మాన్ తరపున లాయర్**

**న్యూఢిల్లీ:** అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో బాబ్రీమసీదు నిర్మాణం కన్నా ముందు ఒక భారీ హిందూ దేవాలయం విలసిల్లిందని రామ్‌లల్లా విరాజ్‌మాన్ తరపు న్యాయవాది శుక్రవారం సుప్రీంకోర్టుకు విన్నవించారు. ఆ దేవాలయం క్రీస్తు పూర్వం 2వ శతాబ్దానికి చెందినదన్నారు. అయోధ్యలోని 2.77 ఎకరాల వివాదాస్పద స్థల వివాదంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రతీరోజు విచారిస్తుండటం తెల్సిందే. ప్రస్తుత వివాదాస్పద ప్రాంతాన్ని 1950లో పరిశీలించిన కోర్టు కమిషనర్ నివేదికను, పురాతత్వ శాఖ నిర్ధారించిన అంశాలను తన వాదనకు సమర్థనగా రామ్‌లల్లా తరపు లాయర్ వైద్యనాథన్ కోర్టుకు చూపించారు. మండపంతో కూడిన పెద్ద దేవాలయం ఉందని పురాతత్వ శాఖ నిర్ధారించిందన్నారు. అది రామాలయమే అనేందుకు స్పష్టమైన సాక్ష్యాలేవీ లేవన్నారు. శివుడితో సహా పలువురి దేవుళ్ల చిత్రాలు అక్కడి గరుడ స్తంభాలపై చెక్కి ఉన్నాయని, అలాంటివి మసీదులపై ఉండవని ఆయన వాదించారు. 'బాబ్రీమసీదు నిర్మాణానికి ముందు అక్కడ నిర్మాణం ఉందనే విషయం మాకు ముఖ్యం



కాదు.. అది దేవాలయమా? కాదా? అన్నదే ముఖ్యం' అని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'అక్కడ ఒక సమాధి కూడా ఉంది కదా! దానిపై ఏమంటారు?' అని వైద్యనాథన్‌ను ప్రశ్నించింది. దాంతో, 'ఆ సమాధి దేవాలయ అనంతర కాలానికి సంబంధించినద'ని ఆయన సమాధానమిచ్చారు. తవ్వకాల్లో పై భాగంలో సమాధి ఆనవాళ్లు ఉన్నాయని, అవి తవ్వకాల్లోని లోతైన భాగాల్లో లేవని వివరించారు.

## మోదీ చెప్పినవి సరైనవే



**న్యూఢిల్లీ:** స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ లేవనెత్తిన జనాభా నియంత్రణ, సంపద సృష్టికర్తల పట్ల గౌరవం, ఒకేసారి వాడి పడేసే ప్లాస్టిక్‌పై నిషేధం వంటి విషయాలను స్వీకరించాల్సిందేనని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిదంబరం అన్నారు. చిన్న కుటుంబాన్ని కలిగి ఉండటమే దేశభక్తి అన్న ఆయన మాటలు సరైనవేనన్నారు. ఆర్థిక మంత్రి, ఇతర మంత్రులు ప్రధాని చెప్పిన మాటలను వినే ఉంటారని ఆశిస్తున్నానని అన్నారు. ప్రధాని చెప్పిన వాటిలో ఒకటి, మూడవ అంశాలు ఉద్యమాలుగా మారాలన్నారు. సంపద సృష్టించేవారిని అనుమానంతో చూడకూడదన్నారు. బీజేపీ చెప్పిన జనాభా నియంత్రణ అంశాన్ని తమ పార్టీ ఎప్పటి నుంచో చెబుతోందని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు.

# గ్రీన్‌లాండ్‌ను కొనేద్దామా!

**సలహాదారులతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్చలు**

**వాషింగ్టన్/స్టాక్‌హోమ్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచంలోనే అదిపెద్ద ద్వీపమైన గ్రీన్‌లాండ్‌పై కన్నేశారు. 'డెన్మార్క్‌లో భాగంగా ఉన్న గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయడం వీలవుతుందా?' అని ట్రంప్ తన సలహాదారుల అభిప్రాయాన్ని కోరినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. అపారమైన సహజవనరులతో పాటు వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం కావడంతో గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ దృష్టి సారించారు. డెన్మార్క్‌లో ప్రావిన్స్ అయిన గ్రీన్‌లాండ్‌కు స్వయంప్రతిపత్తి ఉంది. 20 లక్షల చదరపు కి.మీ విస్తీర్ణం గల గ్రీన్‌లాండ్ జనాభా 57వేలు. ఈ ద్వీపంలోని 85 శాతం భూభాగంపై 3 కి.మీ మందంతో మంచు దుప్పటి కప్పుకుంది. ట్రంప్ ప్రతిపాదనపై కొందరు సన్నిహితులు స్పందిస్తూ..'గ్రీన్‌లాండ్‌లోని తూలేలో అమెరికాకు ఇప్పటికే వైమానిక స్థావరం ఉంది. కాబట్టి ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయం వ్యూహాత్మకమే' అని తెలిపారు. అయితే అధికారం నుంచి తప్పుకునేలోపు తనపేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసేందుకే ట్రంప్ ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని మరికొందరు వ్యాఖ్యానించారు. 1946లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ గ్రీన్‌లాండ్‌ను తమకు అమ్మితే రూ.712.47 కోట్లు ఇస్తామని చెప్పగా, ఈ ప్రతిపాదనను డెన్మార్క్ తిరస్కరించింది. గ్రీన్‌లాండ్‌లో విస్తారమైన హైడ్రోకార్బన్ నిక్షేపాలు, అరుదైన ఖనిజాలు, తీర ప్రాంతంపై అమెరికా అమితాసక్తితో ఉన్నట్లు కొన్నేళ్ల క్రితం వికీలీక్స్ బయటపెట్టింది.



**మేం అమ్మకానికి లేం: గ్రీన్‌లాండ్**
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదనను గ్రీన్‌లాండ్ ఖండించింది. ఈ విషయమై గ్రీన్‌లాండ్ విదేశాంగ శాఖ స్పందిస్తూ..'అమెరికాతో వ్యాపారానికి మా తలుపులు తెరిచిఉంటాయి. కానీ గ్రీన్‌లాండ్ అమ్మకానికి మేం సిద్ధంగా లేం. సహజవనరులు, చేపలు, పునరుత్పాదక విద్యుత్, సాహస క్రీడలకు గ్రీన్‌లాండ్ నెలవు' అని స్పష్టం చేసింది. గ్రీన్‌లాండ్ మాజీ ప్రధాని లార్స్ రాముస్సేన్ మాట్లాడుతూ..'ట్రంప్ ఏప్రిల్ ఫూల్ జోక్ చేస్తున్నారనుకుంటా. కానీ ఇది సీజన్ కాదుగా' అని వ్యాఖ్యానించారు.



పశ్చిమ గ్రీన్‌లాండ్

### మూడుదేశాల వలస పాలనలో..

గ్రీన్‌లాండ్‌ను 13వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దంవరకూ నార్వే పాలించింది. 1499లో పోర్చుగీసు వారు ఈ ద్వీపం తమదని ప్రకటించుకున్నారు. 18వ శతాబ్దం ఆరంభంలో గ్రీన్‌లాండ్‌ను ఉమ్మడిగా పరిపాలించాలని డెన్మార్క్–నార్వే నిర్ణయించాయి. 1814లో నార్వే–స్వీడన్ విడిపోవడంతో గ్రీన్‌లాండ్‌పై అధికారాలు డెన్మార్క్‌కు దక్కాయి. గ్రీన్‌లాండ్‌లో మెజారిటీ ఇన్యుట్ జాతి ప్రజలే. వీరంతా గ్రీన్‌లాండిక్ భాష మాట్లాడుతారు. దీంతో ఈ ప్రాంతంపై పట్టు పెంచుకోవడంలో భాగంగా కాలనీగా ఉన్న గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ 1953లో విలీనం చేసుకుంది. డానిష్ భాషను తప్పనిసరి చేసింది. దీంతో ఉన్నతవిద్య కోసం పలువురు గ్రీన్‌లాండ్ ప్రజలు డెన్మార్క్‌కు వెళ్లడం ప్రారంభించారు. ఈ ప్రయోగం విజయవంతమైనా గ్రీన్‌లాండ్ ప్రజల్లో స్వాతంత్య్ర కాంక్ష బయలుదేరింది. దీంతో డెన్మార్క్ 1972లో హోంరూల్ చట్టం తీసుకొచ్చింది. విదేశాంగ వ్యవహారాలు, రక్షణ, సహజవనరులు మినహా అన్ని అధికారాలను స్థానిక ప్రభుత్వానికి అప్పగించింది. 2008లో జరిగిన రెఫరెండంలో మరిన్ని అధికారాలు కావాలని గ్రీన్‌లాండర్లు తీర్పునిచ్చారు. దీంతో పోలీస్, న్యాయ వ్యవస్థలు, సహజవనరులు, విమానయానం, సరిహద్దు చట్టాలు చేసే అధికారం గ్రీన్‌లాండ్‌కు దక్కాయి.

సాక్షి
శనివారం, ఆగస్టు, 17

# ట్రంప్ బెదిరింపు ధోరణి

మన దేశాన్ని, చైనాను అభివృద్ధి చెందిన దేశాలుగా పరిగణించాలంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం డిమాండ్ చేశారు. ఆయన ఇలా అనడం వారం రోజుల వ్యవధిలో రెండోసారి. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నిబంధనలను అడ్డం పెట్టుకుని ఈ రెండు దేశాలూ 'అభివృద్ధి చెందుతున్న దేశాల' ముసుగులో అనేక వెసులుబాట్లు పొందుతూ అమెరికాకు నష్టం కలిగిస్తున్నాయన్నది ఆయన ప్రధాన ఆరోపణ. డబ్ల్యూటీఓ లొసుగులతో ఎవరైనా లబ్ధిపొందాలని చూస్తే ఊరుకోమని ఆయన హెచ్చరిస్తున్నారు. చైనాతో ఆయన వాణిజ్యయుద్ధం మొదలుపెట్టి ఏడాది దాటింది. అది తీవ్ర స్థాయికి చేరుకుని ఈమధ్యే కుదుటపడిన సూచనలు కనిపించినంతలోనే చైనా ఎగుమతులపై సెప్టెంబర్ మొదటివారంలో 30,000 కోట్ల డాలర్ల మేర సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల్ని కొనడం ఆపేయాలని వెనువెంటనే తమ పబ్లిక్ రంగ సంస్థలకు చైనా సూచించింది. చైనా ప్రకటన వెలువడగానే అమెరికా స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పడిపోయాయి. జరిగిన నష్టాన్ని గ్రహించి సుంకాల పెంపు ఇప్పట్లో ఉండదని ట్రంప్ ప్రకటించవలసి వచ్చింది. ఇదిగాక ఆ రెండు దేశాల మధ్యా కరెన్సీ తగువు నడుస్తోంది. ఎగుమతులను పెంచుకోవడం కోసం చైనా తన కరెన్సీ విలువను కృత్రిమంగా తక్కువ స్థాయిలో ఉంచుతున్నదని, ఇది తమకు నష్టం తెస్తున్నదని అమెరికా ఆరోపిస్తోంది. ట్రంప్ కయ్యానికి కాలుదువ్వే ధోరణి అమెరికాతోపాటు ప్రపంచ దేశాల్లో కూడా ఆందోళన కలిగిస్తోంది. ట్రంప్ కేవలం భారత్, చైనాలపై మాత్రమే కాదు... దక్షిణాఫ్రికా, ఇండొనేసియా దేశాలపైనా ఈ మాదిరే మాట్లాడుతున్నారు. ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాల ముసుగులో ప్రత్యేక సదుపాయాలు పొంది అమెరికాకు నష్టం కలిగిస్తున్నాయన్నది ఆయన ఆరోపణ.

అధికారంలోకొచ్చిన నాటినుంచీ ట్రంప్ ఎవరో ఒకరితో తగువు పడుతూనే ఉన్నారు. ఇరాన్‌తో అమెరికాతోసహా అయిదు దేశాలు, యూరప్ యూనియన్(ఈయూ) కుదుర్చుకున్న అణు ఒప్పందానికి ఆయన స్వస్తి చెప్పారు. కొత్త ఒప్పందానికి సిద్ధపడాలని ఒత్తిడి తెస్తూ ఇరాన్‌పై కొత్త ఆంక్షలు విధించారు. తమ దేశంలో ఉత్పత్తయ్యే హార్లీ–డేవిడ్‌సన్ బైక్‌లపై విధించిన సుంకాలు తగ్గించాలని ఆయన భారత్‌ను డిమాండ్ చేయడం మొదలెట్టారు. తగ్గించినా అదింకా చాల్లేదని పేచీకి దిగారు. ఆ విషయంలో తన మాట విననందుకు ప్రతీకారంగా నిరుడు మన ఉక్కుపై 25శాతం, అల్యూమినియం ఉత్పత్తులపై 10శాతం అదనపు టారిఫ్‌లు విధించారు. మన దేశానికి అయిదు దశాబ్దాలుగా సాధారణ ప్రాధాన్యతల వ్యవస్థ(జీఎస్‌పీ) కింద కల్పిస్తున్న వెసులుబాట్లు రద్దు చేయాలని కూడా అక్కడి ప్రతినిధుల సభకు ఆయన లేఖ రాశారు. మన దేశం ఇది సరికాదని పలుమార్లు చెప్పి చివరకు అమెరికా నుంచి మన దేశానికొచ్చే 29 వ్యవసాయ ఉత్పత్తులపై అదనపు సుంకాలు విధించింది. డబ్ల్యూటీఓ తీరుతెన్నులపై ట్రంప్ మొదటినుంచీ అసంతృప్తిగా ఉన్నారు. ఆ సంస్థలో అమెరికా సభ్య దేశంగా ఉండటం వల్ల తన 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నానని, దేశ ఆర్థిక వ్యవస్థను తాను అనుకున్న రీతిలో పటిష్టంగా తీర్చిదిద్దలేకపోతున్నానని ట్రంప్ భావిస్తున్నారు. అందుకే గత నెలలో డబ్ల్యూటీఓపై ఆయన ధ్వజమెత్తారు. దేన్నయినా అభివృద్ధి చెందుతున్న దేశంగా పరిగణించడానికి ఇప్పుడనుసరిస్తున్న విధానాలను మార్చవలసిన అవసరం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఆర్థికంగా మెరుగ్గా ఉన్న దేశమేదైనా ఈ నిబంధనల కింద లబ్ధి పొందుతుంటే కఠిన చర్యలు తీసుకోవాలంటూ వెనువెంటనే లేఖ రాయాలని అమెరికా ప్రతినిధులను ఆదేశించారు.

డబ్ల్యూటీఓపై ధ్వజమెత్తడం... భారత్, చైనాలను అభివృద్ధి చెందిన దేశాలుగా పరిగణించాలని కోరడం వెనక ట్రంప్‌కు పెద్ద ప్రణాళికే ఉంది. వచ్చే ఏడాది నవంబర్‌లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థుల్ని నిర్ణయించే ప్రక్రియ మొదలైంది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం రెండోసారి కూడా దక్కించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ట్రంప్ తాజాగా ఈ వివాదం రేకెత్తించారు. మరోపక్క దిగుమతులపై విధించే అదనపు సుంకాలతో అమెరికన్ కంపెనీల ఉత్పత్తులకు రక్షణ కల్పించి, దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగైన స్థితిలో ఉన్నట్టు చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఇందువల్ల దేశంలో తనకు అనుకూల వాతావరణం పెరిగి రిపబ్లికన్ పార్టీలో తిరుగు ఉండదని ఆయన భావిస్తున్నారు. కానీ ఇలాంటి వివాదాల పర్యవసానంగా అమెరికా వాణిజ్యం దేశ సరిహద్దులు దాటి విస్తరించడం అసాధ్యమవుతుందన్న సంగతిని ఆయన విస్మరిస్తున్నారు. ట్రంప్ పేచీ వెనక మరో ఉద్దేశం కూడా ఉంది. వచ్చే నెలలో మన దేశంతోపాటు చైనాతో కూడా వాణిజ్య అంశాలపై అమెరికా చర్చించాల్సి ఉంది. 2024నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవాలని మన దేశం ఆశిస్తోంది. అది సాధించాలంటే అమెరికాతో వాణిజ్యం సవ్యంగా ఉండాలని మోదీ ప్రభుత్వానికి తెలుసు. తన ఆర్థిక పురోగతి యధావిధిగా సాగాలంటే అమెరికాతో వాణిజ్యానికి అవరోధాలుండకూడదని చైనాకు కూడా తెలుసు. మొన్న జూన్‌లో జరిగిన జీ–20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ట్రంప్‌తో రెండు దేశాల అధినేతలూ చర్చించారు. వచ్చే నెలలో ఇరు దేశాలతో జరగబోయే చర్చలు దానికి కొనసాగింపే. ఈలోగా వాణిజ్య విభేదాల విషయంలో తాను పట్టుదలగా ఉన్నట్టు నిరూపించుకోవడం ట్రంప్‌కు అవసరం. అప్పుడు మాత్రమే ఈ రెండు దేశాలనూ దారికి తెచ్చుకోవడం సులభమవుతుందని ఆయననుకుంటున్నారు. ట్రంప్ తీరు వల్ల ఏర్పడిన అనిశ్చితి కారణంగా అమెరికా తయారీ రంగంలో 4శాతం, ప్రైవేటు మదుపు 1.2 శాతం క్షీణించిందని తాజా సర్వే చెబుతోంది. కనుక దౌత్యంలోనైనా, వాణిజ్యంలోనైనా బెదిరింపు ధోరణి సత్ఫలితాన్నివ్వబోదని, తమకూ నష్టం వాటిల్లుతుందని ట్రంప్ గ్రహించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి బ.విదియ రా.8.10 వరకు, తదుపరి తదియ, నక్షత్రం శతభిషం ప.12.44 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం రా.7.51 నుంచి 9.36 వరకు దుర్ముహూర్తం ఉ.5.45 నుంచి 7.24 వరకు అమృతఘడియలు... లేవు.

**సూర్యోదయం :** 5.46
**సూర్యాస్తమయం:** 6.22
**రాహుకాలం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుంచి 3.00 వరకు

# కశ్మీర్ భవితే ఇప్పుడు కీలకం!



శేఖర్ గుప్తా

**మోదీని మీరు ఇష్టపడండి లేక తిరస్కరించండి. కానీ సిమ్లా ఒప్పందం అనంతర యథాతథ స్థితిని ఆయన ఇప్పుడు చెరిపివేశారు. కశ్మీర్‌లో పాక్ ఉప–సైనిక విన్యాసాలకు ఇక తావులేదు. ఆర్టికల్ 370 రద్దు గురించి ఏ రాజకీయ పార్టీ కూడా ప్రశ్నించడం లేదు. దాని పద్ధతినే అవి వ్యతిరేకిస్తున్నాయి. కశ్మీర్‌లో ప్రస్తుతం సరికొత్త యథాస్థితి ఏర్పడింది. కానీ కశ్మీర్ సమస్య ప్రజాగ్రహం, పరాయీకరణ, హింస, మానవ హక్కుల ఉల్లంఘన వంటి అంశాలతో ముడిపడి ఉంది. వీటిని తప్పక పరిష్కరించాలి. ఇరుదేశాల మధ్య సరిహద్దులు ఇక శాశ్వతం అన్న వాస్తవాన్ని అంగీకరించాలి. రక్తం పారించి కశ్మీర్ రీజియన్‌లో మ్యాప్‌లను తిరగరాయలేమని సలహా చెప్పడానికి మనం ఇప్పుడు బిల్ క్లింటన్‌ను మళ్లీ రప్పించాల్సిన అవసరం లేదు. ఒకసారి ఈ వాస్తవాన్ని ఆమోదించిన తర్వాత మీరు భవిష్యత్తు గురించి చర్చించవచ్చు.**

కశ్మీర్‌లో సిమ్లా ఒప్పందం అనంతర యథాతథ స్థితిని ప్రధాని మోదీ చెరిపివేశారు. కశ్మీర్ తన సంక్లిష్టమైన, సమస్యాత్మకమైన గతం నుంచి బయటపడి కొత్త వాస్తవికతను అంగీకరించవలసి ఉంది. కశ్మీర్ సమస్యకు పరిష్కారం వెదికేముందుగా మనం ఆ సమస్యను సరిగా అవగాహన చేసుకోవలసి ఉంది. వాస్తవికతను అర్థం చేసుకోకుండా పరిష్కారాలతో ముందుకు దుమికితే చిక్కులు తప్పవు. నకిలీ వైద్యులు (లేదా భూతవైద్యులు కావచ్చు) మాత్రమే సరైన రోగ నిర్ధారణ చేయకుండానే దీర్ఘకాలిక వ్యాధులకు ఔషధాలను సూచించగలరు. ఇలాంటి మూడురకాలకు చెందిన భూతవైద్యుల నుంచి నేడు కశ్మీర్ సమస్యకు మూడు రకాల పరిష్కారాలను మనం చూడవచ్చు.

వీటిలో మొదటిది భారత పాలకవర్గ దృక్పథానికి సంబంధించింది. కశ్మీర్‌లో అసలు సమస్య పాకిస్తానే అని, రైఫిళ్లతో, రాకెట్ లాంఛర్లతో, ఆర్డీఎక్స్‌తో ఆ దేశం ఎగుమతి చేస్తున్న రాడికల్ ఇస్లాం మాత్రమే భారత్ అసలు సమస్య అని భారత పాలక వ్యవస్థ ప్రదర్శిస్తున్న దృక్పథానికి విస్తృత ప్రజానీకం మద్దతు లభిస్తోంది. పాకిస్తానీయుల బెడద లేకుండా చేసుకున్నట్లయితే, మీరు దాల్ సరస్సులో 'కశ్మీర్ కీ కలి'సీక్వెల్‌కి షూటింగ్ చేయవచ్చు.

ఇక రెండో కేటగిరీ పాకిస్తాన్ పాలనా వ్యవస్థ భ్రమలకు చెందింది. భారతీయులను కెలకడం, గిల్లడం, రక్తాలు కారేలా చేయడం ద్వారా వారిని పారదోలుదాం. మనం అఫ్గానిస్తాన్‌లో సోవియట్లను, అమెరికన్లనే ఓడించాం. భారత్ మనకో లెక్కా? భారత్‌ను అలా పారదోలిన తర్వాత కశ్మీర్‌ని మొత్తంగా పాకిస్తాన్‌కి చెందిన ఆరో ప్రాదేశిక ప్రాంతంగా కలిపేసుకుందాం.

ఇక మూడో కేటగిరీ ఏమిటంటే మనం ఇవ్వాళ చేస్తున్న విశ్లేషణే. ఇది చిన్నదే అయినప్పటికీ భారతీయ ఉదారవాదులకు సంబంధించింది. భారత్‌లో కశ్మీర్ విలీనం అంతిమం కాదు, కశ్మీరీల మనోబలం అపారమైనది, అది ఇంకా ప్రదర్శితం కాలేదు. అంతవరకు ప్రజాభిప్రాయ సేకరణ, స్వయంప్రతిపత్తి, చివరకు స్వాతంత్ర్యం వంటి వారి మౌలిక డిమాండ్లు చట్టబద్ధమైనవిగానే ఉంటాయి. రాజ్యవ్యవస్థను, సైనిక శక్తిని ఉపయోగించి వారిని భారత్‌లో కొనసాగేలా చేయలేరు.

తాత్వికంగా చూస్తే ఈ వైఖరితో వాదించడం కష్టం. భారతదేశం పలు రాష్ట్రాల స్వచ్ఛంద సమాఖ్యగా ఉంటోంది. ప్రజలు మీతో కలిసి ఉండాలని కోరుకోనప్పుడు మాతోనే కొనసాగాలంటూ మీరు వారిని ఎలా ఒత్తిడికి గురిచేయగలరు? ఉదారవాదుల అభిప్రాయంతో వాదించడం ద్వారా కలిగే చిక్కులను నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే ఈ వైఖరి వారిని అత్యున్నత నైతిక శిఖరంపై ఉంచుతోంది. కానీ మనం ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్నాం.

ప్రస్తుతం మనదేశంలోని ఉదారవాదుల స్థాయిని అయిదు ప్రాథమిక భాగాలుగా వేరు చేసి పరిశీలిద్దాం.

***1. భారతదేశం 1947–48లలో ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో, కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు కట్టుబడతానని హామీ ఇచ్చింది. కానీ ఆ హామీని అది ఎందుకు ఉల్లంఘించినట్లు?***

వాస్తవమేమిటంటే, భారత్, పాకిస్తాన్ రెండూ కశ్మీర్‌లో ప్లెబిసైట్‌కి

**జాతిహితం**



హామీ పడ్డాయి. కానీ రెండు దేశాలు దాన్ని ఉల్లంఘించాయి. ఆనాటి ఐరాస తీర్మాన పాఠంలోని మూడు దశల్లో మొదటి అంశం ఏదంటే, పాకిస్తాన్ తన బలగాలన్నింటినీ కశ్మీర్ నుంచి ఉపసంహరించుకోవాలి, ఇతరులు కూడా (వీరిని జిహాదీలు అంటున్నాం) కశ్మీర్‌కు దూరం జరగాలి. కానీ ఇది ఎన్నడూ జరగలేదు. ఇక రెండో అంశం.. కశ్మీర్‌లో కనీస స్థాయిలో మాత్రమే సైనికబలగాలను భారత్ ఉంచాలి. తర్వాత అఖిలపక్ష ప్రభుత్వాన్ని ఏర్పర్చాలి. తర్వాత ఐక్యరాజ్యసమితి నియమించే గవర్నర్ నేతృత్వంలో ప్లెబిసైట్ నిర్వహించాలి. ఈ మూడింట్లో మొదటి దాన్ని పాకిస్తాన్ చేపట్టలేదు. దీంతో భారత్ మిగిలిన రెండు అంశాలను గౌరవించలేదు.

***2. కశ్మీరీలలో చాలామంది భారత్, పాకిస్తాన్ రెండింటినీ కోరుకోవడం లేదు. వారు స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నాను. అలాంటప్పుడు వారికి దాన్ని ఇవ్వకుండా ఎలా తిరస్కరించగలరు?***

మరోసారి కశ్మీర్‌పై ఐరాస తీర్మానాలు చూడండి. కశ్మీర్ స్వాతంత్ర్యాన్ని లేక అజాదీని ఒక ఐచ్ఛికంగా ఇవి పేర్కొనలేదు. భారత్ లేక పాక్ రెండు దేశాల్లో ఏదో ఒకదాన్ని ఎన్నుకోమని ఆ తీర్మానాలు చెబుతున్నాయి. ఇకపోతే కశ్మీర్ అజాదీ (స్వాతంత్ర్యం)కి పాక్ ఇస్తున్నట్లు చెప్పుకుంటున్న మద్దతు వంచనాత్మకమైనది. అయితే పాకిస్తానీయులు కశ్మీరీల స్వాతంత్ర్యం కోసం మద్దతు పలుకుతున్నారన్న కృత్రిమ ప్రచారంతో పాక్ మద్దతు ఒకమేరకు గ్లోబెల్ తరహా విజయాన్ని పొంది ఉంది. తన ఆక్రమణలో ఉన్న పీఓకేని అజాద్ కశ్మీర్ అని పిలవడం ద్వారా పాకిస్తాన్ గత 70 ఏళ్లుగా ఈ అభిప్రాయాన్ని విజయవంతంగా నిర్మిస్తూవచ్చింది. అయితే అజాద్ కశ్మీర్ కాల్పనిక భ్రమను పాకిస్తాన్ పీవోకేలో పెంచి పోషించగలదేమో కానీ తతిమ్మా భారత్‌లో దాని పప్పులుడకవు.

***3. సైనిక శక్తితో ఒక భూభాగాన్ని, ప్రజలను నిలిపి ఉంచగలరా?***

తిరుగు ప్రశ్నే ఈ ప్రశ్నకు సమాధానమవుతుంది. సైనిక శక్తిద్వారా మీరు మరొక దేశం నుంచి ఒక భూభాగాన్ని, ప్రజలను స్వాధీనం చేసుకోగలరా? పాకిస్తాన్ దీనికే సుదీర్ఘకాలం ప్రయత్నించింది. 1947–48లో 1965లో ప్రత్యక్ష సైనిక దాడి ద్వారా రెండు సార్లు, 1989 నుంచి పరోక్ష యుద్ధం ద్వారా దీనికోసం పాక్ ప్రయత్నించింది. మధ్యలో కార్గిల్ వంటి ఉన్మాద చర్యలు కూడా ఉన్నాయి.

ఇవి నిజాలు. అందుకే 1953 మధ్య కాలంలో ఐరాస తీర్మానాలనుంచి నెహ్రూ వైదొలగడాన్ని మీరు అర్థం చేసుకోవాలి. ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రస్థాయికి చేరుకోవడం, భౌగోళికంగా కశ్మీర్ వ్యూహాత్మక ప్రాధాన్యత పెరిగిపోవడం వంటి పరిణామాలతో భవిష్యత్తులో ఎదురవనున్న చిక్కులను ముందుగానే పసిగట్టి షేక్ అబ్దుల్లాను అరెస్టు చేయడం ద్వారా నెహ్రూ 1953లో కశ్మీర్‌ని భారత్‌లో కలిపేసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఆ తర్వాతి దశాబ్దమంతా అమెరికా మద్దతుతో పాక్ సైనిక సమతుల్యతా పరంగా ముందజ వేసింది. అందుకే నెహ్రూ తీసుకున్న ముందు జాగ్రత్త చర్యే కశ్మీర్‌ని సైనిక ఆక్రమణ నుంచి కాపాడిందన్నది వాస్తవం. సైనికపరంగా ముందంజ వేశామని, 1962 చైనాతో యుద్ధంలో భారత్ సైనికంగా పతనమైందని, నెహ్రూ మృతి, ఆహార ధాన్యాల కొరతతో భారత్ వెనుకపట్టు పట్టిందని గ్రహించి కశ్మీర్ ఆక్రమణకు అమెరికా ఆయుధాలు, శిక్షణ దన్నుతో పాక్ తీవ్రంగా ప్రయత్నించింది కానీ ఆ ప్రయత్నంలో అది ఓడిపోయింది.

***4. సిమ్లా ఒప్పందం ప్రకారం కశ్మీర్ సమస్యను మోదీ ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదు?***

సిమ్లా ఒప్పందాన్ని మరోసారి చదువుకోండి. భారత్–పాక్ సమస్యలన్నీ ఇప్పుడు ద్వైపాక్షిక సమస్యలుగా మారాయి. అంటే ఐరాస తీర్మానాలు పనిచేయవన్నమాట. అంటే ఈ రెండు దేశాల్లో ఏ ఒక్కటీ ఏ భూభాగాన్నీ బలప్రయోగంతో ఆక్రమించలేవు. అందుకే కాల్పుల విరమణ రేఖను ఆధీన రేఖగా పేరు మార్చుకున్నారు. ఇదే ఇరుదేశాల మధ్య సరిహద్దుగా తమతమ ప్రజలు ఆమోదించడంపై ప్రయత్నాలు ప్రారంభించాయి. కానీ 1971 యుద్ధంలో పట్టుబడిన పాక్ సైనికులను భారత్ విడుదల చేశాక ఈ కొత్త ఒడంబడిక స్ఫూర్తికి భంగం కలిగింది. జుల్ఫికర్ ఆలీ భుట్టో తన దేశాన్ని ఇస్లామీకరించడం ప్రారంభించారు. ఇస్లామిక్ బాంబు తయారీ కోసం నిధుల సేకరణకు కూడా ఒడిగట్టారు. అలా పాకిస్తాన్ అణుబాంబు ప్రయోగాలు ఫలించిన తర్వాత సిమ్లా ఒప్పందానికి తూట్లు పడింది. కానీ ప్రత్యక్ష యుద్ధానికి తలపడితే ఓటమి తప్పదని పాక్ గ్రహించింది. ఆ విధంగా సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించింది పాక్ మాత్రమే.

***5. కశ్మీరీలు మీతో కలిసి ఉండాలనుకోలేదు.. మీరేం చేయగలరు?***

దీనికి కూడా తిరుగు ప్రశ్నే సమాధానం. కశ్మీరీలు ఎవరు? పది జిల్లాలతో కూడిన కశ్మీర్ లోయ మొత్తం రాష్ట్రం తరపున మాట్లాడలేదని చెప్పడం ద్వారా మితవాద జాతీయవాదులు సూక్ష్మార్థాన్ని గ్రహించడం లేదు. ఎందుకంటే రాష్ట్రంలోని మెజారిటీ జనాభాకు ఈ పది జిల్లాలే ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇక ఉదారవాద వాదన మరింత లోపభూయిష్టంగా ఉంది. లోయలోని ముస్లిం మెజారిటీ అభిప్రాయం రాష్ట్రంలోని మైనారిటీ అభిప్రాయాన్ని కలుపుకోనట్లయితే, భారత్ లోని మిగతా 99.5 శాతం మంది అభిప్రాయాన్ని మనం ఎలా చూడాలి? ఒక చోట మెజారిటీ అభిప్రాయాన్ని లెక్కించడం, మరొక చోట లెక్కించకపోవడంలో తర్కం ఏమైనా ఉందా?

వ్యాసకర్త ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**




## సోషల్ మీడియా

### మార్పు



"కశ్మీర్‌లో రెండు వారాలపాటు పర్యటించా. ఆర్టికల్ 370 రద్దు అనేది ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశం. భవిష్యత్‌లో దాని ప్రభావం ఎలా ఉంటుందో తెలియన అయోమయంలో వారున్నారు. రద్దు వల్ల కశ్మీరీల రోజువారీ జీవితంపై ఎటువంటి ప్రభావం ఉండదని శ్రీనగర్‌లోని ఒక వృద్ధుడు వ్యాఖ్యానించాడు. చాలామంది ఇలాగే అంటున్నారు. కానీ, వారందరిలో ఆగ్రహం మాత్రం ఉంది. పరిస్థితులు ప్రభుత్వం చెప్పుకుంటున్నంత ప్రశాంతంగా లేవు"

– అభిషేక్ భల్లా, జర్నలిస్ట్

### డ్రామా



"ఈసారి మా వివాహ వార్షికోత్సవం గతంలో ఎన్నడూ లేనంత గొప్ప జ్ఞాపకంగా మిగులుతుంది. మా అబ్బాయి ఎక్కడ శిక్షణ పొంది, తన భుజాలపై అనేక స్టార్లను సంపాదించుకున్నాడో అక్కడ ఎక్కువ సమయం గడపగలగడం మా అదృష్టం. ఈ మధ్య చాలామంది రాజకీయ నేతలు, సినిమా నటులు దేశంలో తమకు రక్షణ లేదనీ, ఎప్పుడైనా హత్యకు గురికావచ్చని అంటున్నారు. వెంటనే వాళ్లంతా ఆ నటనలను చాలించాలని కోరుతున్నా. భారత్ దేశంలో వాళ్లంతా సురక్షితమే. ఎందుకంటే ఇక్కడ ఎంతోమంది యువ సైనికులు బుల్లెట్లకు, బాంబులకు ఎదురు నిలుస్తున్నారు. భారత సైనిక అకాడమీ దగ్గర చాలా ఉద్వేగంగా గడిచింది"

– మేఘనా గిరీష్, మేజర్ అక్షయ్ తల్లి

### సంబంధాలు



"డబ్బు, కార్లు, ఐశ్వర్యం ద్వారా సంతోషం రాదని ఒక హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. ఉన్నతమైన మానవ సంబంధాల్లోనే సంతోషం దాగి ఉందని ఆ అధ్యయనం తేల్చింది. హాస్యం కాకపోతే, ఈ విషయం మనందరికీ తెలిసిందే. అందరి గుండె లోతుల్లో ఉన్నదే కదా. అయితే, మనలో ఎంత మంది మంచి సంబంధాలకు నిజంగా ప్రాధాన్యతనిస్తున్నారు?"

– హర్ష గోయెంకా, వ్యాపారవేత్త

### వ్యతిరేకి



"డియర్ కశ్మీర్, నీ అదృష్టాన్ని నిర్ణయించడానికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశం ఏర్పాటు చేయాలని చైనా కోరవచ్చు. కానీ, చైనా కచ్చితంగా నీకు స్నేహితుడు కాదు. చైనాకు నీపై ఏమీ ఆసక్తి లేదు. భారత్ ప్రభావం విస్తరించకుండా అడ్డుకోవడమే దాని లక్ష్యం. చైనా ఇస్లాంకు, ఆసియాకు, ప్రజాస్వామ్యానికి శత్రువు"

– సీజే వెర్లెమాన్, కాలమిస్ట్

### గౌరవం



"గూగుల్ ఫ్లెక్స్‌లో గూగుల్ ఏర్పాటు చేసిన ప్రత్యేక విందుకు హాజరుకావడం గౌరవంగా భావిస్తున్నా. వారి కార్యాలయం అంతా చూపించారు. మన భవిష్యత్ కోసం పని చేస్తున్న కొంతమంది మేధావులతో మాట్లాడా"

– వివేక్ ఒబెరాయ్, నటుడు

### డౌన్



"సర్వీసింగ్ కోసం కారును హోండా సెంటర్‌కు తీసుకు వెళ్లా. అమ్మకాలు పడిపోయాయనీ, గతంలో నెలకు 150 కార్లు విక్రయిస్తే, ఇప్పుడు 50 కార్లే అమ్ముతున్నామని అక్కడి సేల్స్ మేనేజర్ చెప్పాడు. ఇంతకు ముందు 1500కార్లు సర్వీస్‌కు వస్తే ఇప్పుడు 900 కార్లు మాత్రమే నెలకి వస్తున్నాయిట"

– వినోద్ కె.జోస్, జర్నలిస్ట్

# ఏవి బాబూ మొన్న కురిసిన అగ్గి చినుకులు!



శ్రీరమణ

ఇంకా పట్టుమని పది వారాలు కాలేదు. ఇంతకు ముందు ఎలుకలు, పందికొక్కులు తవ్విపోసిన బొరియల లోతులు, గోతుల అంచనాలు సరిగ్గా అంతుపట్టడం లేదు. అప్పుడే తెలుగుదేశం పార్టీ వైఎస్సార్‌సీపీ పాలనమీద నోటికి వచ్చినట్టు విమర్శిస్తూ ఆనందిస్తోంది. టీడీపీ ధోరణి చూస్తుంటే రెండు మూడు వారాల్లో పాలనా పగ్గాలు చంద్రబాబు చేతికి రానున్నాయన్నట్టుగా ఉంది.

ఇంతవరకు జగన్ తీసుకున్న నిర్ణయాలు సంస్కారవంతులైన వారికి ఆమోదయోగ్యంగానే ఉన్నాయ్. టీడీపీ ఏ ఒక్క నిర్ణయాన్ని హర్షించలేక పోతోంది. పంచతంత్రంలో దుఃఖ భాజనుల జాబితాని స్పష్టంగా ఇచ్చాడు. సరిగ్గా ఆ లిస్టుకి టీడీపీ నేతలు సరిపోలతారు. మనకి బద్ధ శత్రువైనా ఒక మంచి పని నిర్వర్తించినప్పుడు, ఓ ఘన కార్యం సాధించినప్పుడు, ఓ గెలుపుని సొంతం చేసుకున్నప్పుడు మనసారా అభినందించడం సంస్కారవంతుల లక్షణమని రుషులు ఏనాడో చెప్పారు. నిజానికి చంద్రబాబుకి ఇప్పుడున్న బలానికి ఇప్పుడు వస్తున్నంత ప్రచారం మీడియాలో రానక్కర లేదు. సొంత మీడియా కావ డంవల్ల సభలో కాకపోయినా, బయట కుర్చీల్లో కూర్చుని రూలింగ్ పార్టీని విమర్శించినా దాన్ని వినిపిస్తున్నారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పలుకుల్ని ఎవరు వినిపిస్తున్నారు. త్వరలో టీడీపీ ఇంకా బలహీనపడి తీరం చేరే అవకాశం ఉందని వాతావరణ వేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఆధునిక రాజకీయాలు కూడా భోగభాగ్యాల్లాంటివే! వచ్చేటప్పుడు కొబ్బరికాయలోకి నీళ్లొచ్చినట్టు నిశ్శబ్దంగా చేరిపోతాయి. వెళ్లిపోయేటప్పుడు వెలగపండు బుగిలి, డొల్ల తేలినట్టు, పైపంచెలు దులుపుకు వెళ్లి పోతాయి. కడకు బాబు మాత్రమే తెలుగుదేశాన్ని వీడలేరు. లోకేశ్ బాబుకి సైతం పార్టీని వీడటానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ఇదే మరి డెమోక్రసీ చక్కదనం! బస్తీ బాబులకంటే గ్రామీణులకు జ్ఞాపకశక్తి ఎక్కువ. మరీ ముఖ్యంగా నాయకుల ప్రసంగాన్ని బాగా గుర్తు పెట్టుకుంటారు. అటు మొన్న ఎన్నికలప్పుడు చంద్రబాబు నానా రకాలుగా విజృంభించాడు కదా, ఇప్పుడు అయిపోయిన భూచక్రంలా చతికిలపడ్డాడని రచ్చబండ చుట్టూ వినిపిస్తోంది. నదులన్నీ కళకళలాడుతున్నాయ్. అన్ని జలాశయాలు గేట్లు ఎత్తుకు మరీ విలాసంగా నవ్వుతున్నాయ్. రైతులు పొలంపనుల్లో తలమునకలవుతు న్నారు. ఇదొక శుభసూచికం.

చంద్రబాబు ఇవేవీ గమనించినట్టు లేదు. నిన్నటిదాకా తెలుగు రాష్ట్రాల వారంతా ఒకే గడ్డమీద పుట్టి పెరిగాం. ఇప్పుడు విడిపోయినంత మాత్రాన శత్రువులుగా మారిపోనక్కర్లేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా కొన్నాళ్లు రెండు రాష్ట్రాలను పాలించారు. అట్లాంటిది ఇప్పుడు ఇంతలో 'నా ఏపీ, నా ప్రజలు' వారి హితమే నా జీవిత లక్ష్యమని గాండ్రిస్తున్నారు. జనం ఉభయ రాష్ట్రాల వారు గమనిస్తున్నారు. కేసీఆర్‌తో కుమ్మక్కై రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడితే సహించేది లేదని చంద్రబాబు ఆందోళనా స్వరంతో అరుస్తున్నారు. ప్రజలు ఇవ్వని బాధ్యతల్ని నెత్తిన వేసుకోవడమంటే ఇదే. కృష్ణా, గోదావరి నీళ్లని వారిష్టానుసారం పంచుకోవడం అనైతికం, అప్రజాస్వామికం అంటూ ఆరో

**అక్షర తూణీరం**



పిస్తున్నారు. నీతి నియమాలు, విధి విధానాలు తగినన్ని ఉన్నాయ్. అనేక మంచి పనులకే ఏదో వంకన అడ్డుపడే ప్రబుద్ధులున్న మన దేశంలో నదుల్ని ఇష్టం వచ్చినట్టు పంచుకుంటే ఊరుకుంటారా? చంద్రబాబుని ఘోరాతి ఘోరంగా ఓడించింది, నరేంద్ర మోదీని హోరెత్తే మెజార్టీతో గెలిపించిందీ గ్రామీణ ప్రజలే. ఆ బలం చూసుకుని తన సత్తా చూపి ధైర్య సాహసాలతో ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు మోదీ. మోదీ శక్తి సామర్థ్యాలను బాబు బొత్తిగా అంచనా వెయ్యలేకపోయారు.

దానివల్ల రాష్ట్రానికి జరగాల్సిన అరిష్టం జరిగిపోయింది. 'ఏరి బాబు వాళ్లంతా? ఏరి? ఇరవైమందికి పైగా నేతలు.. అందరూ దండలు దండలుగా చేతులు కలిపి ముక్తకంఠంతో 'మోదీ డౌన్ డౌన్' అంటూ'' నినదించారు. మమతాజీ ప్రధాని కావాలని చంద్రబాబు, కాదు అందుకు చంద్రబాబే సరి అని మరికొందరు పోట్లాడుకున్నారు. ఇంతమంది మహా నేతలు కలిసి కూడా మోదీ ఘన విజయాన్ని అస్సలు పసికట్టలేకపోయారు. చంద్రబాబు కేంద్రంలో చక్రం తిప్పవచ్చని కలలు కంటూ, విమానంలో విరామం లేకుండా ఊరేగారు. ఏది, ఆ తర్వాత మళ్లీ ఏ ఇద్దరూ కలిసినట్టు లేదు. ఇక బాబు ఢిల్లీలో ఏ చక్రం తిప్పాలి? చంద్రబాబు ఆఖరికి గెలుపు కోసం కాంగ్రెస్ హస్తాన్ని కూడా కలిపి నడిచారు. వేదికలు పంచుకున్నారు. అందుకే మా రచ్చబండమీద, వ్రతం చెడ్డా పాపం ఫలం దక్కలేదని ఊరోళ్లు నవ్వుకుంటూ ఉంటారు.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# అప్పుడు వైఎస్సార్.. ఇప్పుడు వైఎస్ జగన్

సరిగ్గా.. పుష్కరకాలం వెనక్కి వెళ్లాల్సిన విషయం. మే 6, 2007న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారిక కార్యక్రమం కోసం అమెరికాలో అడుగుపెట్టారు. ప్రపంచ వ్యవసాయ సదస్సుకు ముఖ్య అతిథిగా రైతు బంధువు వైఎస్సార్‌ను ఆహ్వానించింది అమెరికా ప్రభుత్వం. మే 8న మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం ఎలా వెన్నెముకగా నిలవాలన్న విషయాన్ని చర్చించారు.

ఆ తర్వాత షికాగో వేదికగా ఎన్నారైలను ఉద్దేశించి వైఎస్సార్ చేసిన ప్రసంగం.. ఇప్పటికీ చాలామంది ఎన్నారైల మదిలోనే ఉంది. అమెరికా వెళ్లిన వైఎస్సార్ ఆహార్యంలో ఎలాంటి మార్పు లేదు. తెలుగుదనం ఉట్టిపడేలా రాజసమైన పంచెకట్టులో ఎన్నారైలపై చెరగని ముద్ర వేశారు రాజశేఖరరెడ్డి. సూటు, బూటు వేసుకోవాలంటూ కొందరు సన్నిహితులు పట్టుబట్టి వేయించినా.. కాసేపట్లోనే మళ్లీ పంచెకట్టులోకి వచ్చేశారు. షికాగోలో చక్కటి తెలుగులో ప్రవాసాంధ్రులతో మాట్లాడిన వైఎస్సార్.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ పిలుపునిచ్చారు. తన చిరకాల మిత్రుడు ప్రైమ్ హాస్పిటల్స్ అధినేత ప్రేమ్‌సాగర్ రెడ్డితో కలిసి వివిధ వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించారు. భారీగా ఉన్న పెద్ద పెద్ద కమతాల్లో అక్కడి రైతులు అనుసరిస్తున్న ఆధునిక విధానాలను, అత్యాధునిక సాంకేతిక యంత్రాలను చూశారు.



### అమెరికాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఇప్పుడు ఆయన తనయుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్ అమెరికాలో తొలిసారి పర్యటిస్తున్నారు. అమెరికాలో ఉన్న ఏపీకి చెందిన అనేకమంది ప్రముఖులు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలతో సహా సిద్ధంగా ఉన్నారు. సొంతగడ్డకు ఎలాంటి సహకారం అందించేందుకైనా సిద్ధమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల విషయంలో ప్రచార ఆర్భాటం తప్ప పారిశ్రామిక వేత్తలకు సహకారం లభించలేదన్నది వీరి ఆవేదన.

### 75 రోజుల పాలన

సీఎంగా వైఎస్ జగన్ పాలన ప్రారంభించి 75 రోజులకు పైగా అవుతోంది. ఈ స్వల్ప కాలంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రానికి భరోసా ఇచ్చేలా ఉన్నాయి. పారదర్శక పాలనను అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ కమిషన్, పూర్తి అవినీతి రహితంగా నడుచుకుంటామన్న ముఖ్యమంత్రి లక్ష్యం ప్రవాసాంధ్రులను ఆకర్షిస్తోంది. ఇన్నాళ్లు రాష్ట్రానికి దూరంగా ఉన్న తమకు స్థానికులకు ఉపాధి కల్పించాలన్నదే అంతిమ లక్ష్యమని, ఇప్పుడు 75% ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్న సీఎం ఆలోచన తమకు ఎంతో నచ్చిందంటున్నారు.

### ఎన్నారై విభాగంలో కొత్త ఉత్సాహం

సీఎం వైఎస్ జగన్ అమెరికా పర్యటనతో పార్టీ ఎన్నారై విభాగంలో కొత్త ఉత్సాహం వచ్చింది. వైఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రేమ్ సాగర్ రెడ్డి నేతృత్వంలో భారీగా ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 17 మధ్యాహ్నం డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రవాసాంధ్రులు భారీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రవాసాంధ్రులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తారు. ఈ భేటీలో పెద్ద సంఖ్యలో ఎన్నారైలు పాల్గొంటారని తెలుగు కమ్యూనిటీ ఆఫ్ నార్త్ అమెరికా (టీసీఎన్ఏ) తెలిపింది. గతంలో స్వర్గీయ డాక్టర్ వైఎస్సార్ కూడా డల్లాస్ వచ్చారని, ఇప్పుడు అదే డల్లాస్‌కి ఆయన వారసుడు వస్తుండటం తమకి ఎంతో సంతోషంగా ఉందని డల్లాస్ ఎన్నారైలు తెలిపారు.

శ్రీనాథ్ గొల్లపల్లి
సీనియర్ ఔట్‌పుట్ ఎడిటర్, సాక్షి టీవీ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
17-8-2019




# న్యాయం చూడాలి

**నా**లుగైదేళ్ల కిందట అనుకుంటా.. హైదరాబాద్‌లోని 'లామకాన్'లో ఎల్‌జీబీటీక్యూ ఫెస్టివల్ ఏదో జరుగుతోంది. లోపలికి వెళ్లే ముందు ఆ ఇంటి ప్రహరీ గేట్‌కు.. ''ప్లీజ్ లీవ్ యువర్ ప్రిజుడీస్ హియర్'' అని రాసున్న బోర్డ్ ఉంది. అంటే భ్రమలు, భ్రాంతులు తొలగించుకొమ్మని అర్థం. ఇప్పుడు బాలీవుడ్ అదే చేస్తోంది. నాలుగు ఫైట్లు, ఆరు డ్యుయెట్లు, ఐటమ్ సాంగ్, ఒక హీరో, ఒక హీరోయిన్, ఒక విలన్, ఒక వ్యాంప్ వంటి స్టీరియో టైప్ ఫార్ములాను కత్తిరించింది. సమకాలీన సమస్యల మీద ఫోకస్ చేసింది. హీరోయిన్ అయినా.. హీరో అయినా.. ఆఖరకు విలన్ అయినా కథే! కథావసరంగా పాత్రలు పుట్టుకు రావాలి కాని పాత్రల కోసం కథ అల్లట్లేదు. సమకాలీన ఆలోచనా ధోరణులు, అనుబంధాలు, సామాజిక అంశాలనే థీమ్‌గా తీసుకుంటోంది. అలా తెరకెక్కి కమర్షియల్ హిట్లయినవి ఉన్నాయి. క్రిటిక్స్ ప్రశంసలు పొందినవి ఉన్నాయి. విదేశీ ఫిల్మోత్సవ్‌లలో సందడి చేసి భారతీయ సినిమా పట్ల గౌరవాన్ని పెంపొందించనవీ ఉన్నాయి. థియేటర్ల నుంచి సైలెంట్‌గా ప్రేక్షకుల మెదళ్లకెక్కి చెరగని ముద్ర వేసినవీ ఉన్నాయి. అలాంటి సినిమాల గురించి ప్రస్తావించుకోకపోతే మార్పును స్వాగతించనట్టే!

పైగా వాటి గురించి చెప్పుకోవాల్సిన సందర్భం కూడా. కిందటి నెలలోనే 'ఆర్టికల్ 15' సినిమా విడుదలై టాక్ ఆఫ్ ది కంట్రీ అయింది. సెప్టెంబర్ 13న ''సెక్షన్ 375'' చిత్రం రిలీజ్‌కానుంది. ట్రయిలర్స్‌తో అందరి దృష్టినీ ఆకట్టుకుంటోంది.

**సెక్షన్ 375..**

ఇండియన్ పీనల్ కోడ్‌లోని 'సెక్షన్ 375' రేప్ గురించి తెలియజేస్తుంది. స్త్రీ ఇష్టం లేకుండా, ఆమె అనుమతి లేకుండా ఆమె పట్ల ఎలాంటి సెక్సువల్ యాక్ట్ జరిగినా దాన్ని రేప్ కిందే పరిగణిస్తుందీ సెక్షన్. దీనికి సంబంధించి ఆరు రకాల వివరాలనూ ఇందులో పొందుపర్చారు. ఆమెకు ఇష్టం లేకుండా, ఆమె అనుమతి లేకుండా, ఆమెను బెదిరించి, భయాందోళనలకు గురి చేసి ఆమె అనుమతి తీసుకున్నా, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, పెళ్లికి ముందే ఆమెతో లైంగిక కార్యకలాపాల్లో పాల్గొన్నా, ఆమె మానసిక స్థితి బాగా లేనప్పుడు ఆమె నుంచి అనుమతి తీసుకున్నా, దాని పర్యవసానాలు తెలియక ఆమె అనుమతి ఇచ్చినా, పద్దెనిమిదేళ్ల లోపున్న అమ్మాయి ఇష్టపడి, అనుమతి ఇచ్చినా.. జరిగిన సెక్సువల్ యాక్ట్ రేప్ కిందకే వస్తుందని ఈ సెక్షన్‌లో ఉంది. అలాగే ఎలాంటి సెక్సువల్ యాక్ట్‌ను రేప్‌గా పరిగణిస్తారో కూడా వివరిస్తోందీ సెక్షన్. నిజ జీవితంలోని రేప్ సంఘటనలను ఆధారంగా చేసుకొని ఈ ఐపీసీ 375ను చర్చించే కోర్ట్ రూమ్ మూవీయే 'సెక్షన్ 375'. ట్రైలర్‌ను బట్టి ఒక దళిత కాస్ట్ అసిస్టెంట్‌ను సినిమా డైరెక్టర్ రేప్ చేసిన కేసును డిఫెన్స్, ప్రాసిక్యూట్ అడ్వకేట్స్ వాదిస్తూంటారు. డిఫెన్స్ లాయర్‌గా అక్షయ్ ఖన్నా, ప్రాసిక్యూటర్‌గా రిచా చద్దా నటించారు. ఈ దేశంలో ప్రతి 20 నిమిషాలకు ఎక్కడో ఒక చోట ఎవరో ఒక మహిళ లైంగిక దాడిని ఎదర్కోవాల్సి వస్తోందని, ప్రతి లక్షమంది మహిళల్లో 1.8 మంది మహిళలు రేప్ జరిగే పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, రేప్ చేసిన వాళ్లలో కేవలం 25 శాతం మంది నేరస్తులకు మాత్రమే శిక్ష పడ్తోందని, దాదాపు 75 శాతం కేసుల్లో నిందితులు శిక్ష పడకుండా తప్పించుకుంటున్నారని ఈ సినిమాకు సంబంధించిన ఒక ట్రైలర్ లెక్క చెప్తోంది. ''సెక్షన్ 375''కు అజయ్ బహెల్ దర్శకత్వం వహిస్తున్నారు.

**ఆర్టికల్ 15..**

కుల మత జాతి ప్రాంత లింగ వివక్ష లేకుండా దేశంలోని పౌరులంతా సమానమే. అన్నిచోట్లా అందరికీ ప్రవేశం ఉంటుంది. అలాగని స్త్రీలు, పిల్లలు, వెనకబడిన వర్గాల వాళ్ల కోసం ప్రభుత్వాలు ప్రత్యేక సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలనుకున్నప్పుడు ఈ ఆర్టికల్ 15 వర్తించదు. వెనకబడిన వర్గాలను మిగిలిన పౌరులతో సమానంగా చేయడానికి ఈ ఆర్టికల్ సహకరిస్తుంది. 2014, ఉత్తరప్రదేశ్‌లోని బదాన్‌లో ఇద్దరు దళిత అమ్మాయిలను రేప్ చేసి, చంపి అదే ఊళ్లో చెట్టుకు ఉరేసిన సంఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. స్వతంత్రం వచ్చి 73 ఏళ్లు అవుతున్నా ఇంకా కుల వ్యవస్థ గురించి, అది చేసే దారుణాల గురించి మాట్లాడుకునే స్థితిలో ఉండడమే విషాదం. తమ కూలి మూడు రూపాయలు పెంచమని అడిగిన పాపానికి ఇద్దరు దళిత అమ్మాయిలను రేప్ చేసి, చంపి.. వాళ్ల ఔఖాద్ అంటే వాళ్ల స్థానం ఏంటో చూపించామని విర్రవీగిన ఆ ఊరి కామందుతో తలపడిన ఒక యంగ్ ఐపీఎస్ ఆఫీసర్ పోరాటమే 'ఆర్టికల్ 15'. పాతుకుపోయిన నాలుగంచెల కుల వ్యవస్థ, ఓట్ల కోసం దాన్ని కాపాడుకుంటున్న రాజకీయ వ్యవస్థ.. అధికారం కోసం అట్టడుగు వర్గాలను చీలుస్తున్న పాలనా వ్యవస్థను సినిమాటిక్‌గా షో చేయకుండా వాస్తవానికి దగ్గరగా చూపించిన సినిమా. లండన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్క్రీన్ అయి ఆడియెన్స్ అవార్డ్‌నూ అందుకుంది. ఆయుష్మాన్ ఖురానా, ఈషా తల్వార్, సయానీ గుప్తా ముఖ్యపాత్రలు పోషించిన ఈ సినిమాకు అనుభవ్ సిన్హా దర్శకుడు. ఈ నెల 24 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కానున్నట్టు అంచనా.




**అలీగఢ్..**

అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీలోని ఒక ప్రొఫెసర్ నిజ జీవిత కథే 'అలీగఢ్' మూవీ. స్వలింగ సంపర్కం నేరమని.. తర్వాత జరిగిన ఎన్నో ఉద్యమాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాల ఫలితంతో నేరం కాదని చెప్పిన ఆర్టికల్ 377ను ఇండికేట్ చేసిన సినిమా ఇది. కథేంటంటే.. ప్రొఫెసర్ శ్రీనివాస్ రాంచంద్ర్ సిరాస్ హోమోసెక్సువల్ రిలేషన్‌షిప్స్‌ను వీడియో తీసి బయటపెడ్తారు కొందరు. దాంతో సిరాస్‌ను కాలేజ్ నుంచి సస్పెండ్ చేస్తారు. కుటుంబ సభ్యులూ అతణ్ణి ఇంట్లోంచి వెళ్లగొడ్తారు. హ్యూమన్ ఇంటరెస్ట్ స్టోరీ ఇది. ఎల్‌జీబీటీ హక్కుల గురించి డిస్కస్ చేసిన చలన చిత్రం. ''ఎవరి వ్యక్తిగత జీవితంలోకైనా జొరబడే హక్కు ఎవరికీ లేదు.. ఆ మనిషి సమాజానికి హాని తలపెడితే తప్ప. అలాగే స్వలింగ సంపర్కం అనేది ఒక ధోరణి కాదని, నేచురల్ సెక్స్ లాగే అదీ బయాలాజికల్ ఇన్‌స్టింక్ట్'' అని అర్థం చేయించే సినిమా. హన్సల్ మెహతా దర్శకత్వం వహించారు. ప్రొఫెసర్ పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ నటించారు. ఇరోస్ నౌ, అమేజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఆర్టికల్ 377 సడలింపు తర్వాత ఎల్‌జీబీటీ రైట్స్ మీద వచ్చిన మరో సినిమా ''377''. ఇది జీ5లో స్ట్రీమ్ అవుతోంది.

**పింక్...**

అమ్మాయి కట్టూబొట్టూ తీరు, వెళ్లే పార్టీలు, కలుసుకునే మనుషులను బట్టి ఆ అమ్మాయి మీద ఫలానా అని లేబుల్ వేసి.. చొరవ తీసుకొని ఒంటి మీద చేయి వేసే మగవాళ్లకు లెంప కాయ 'పింక్'. అమ్మాయి ''నో'' అంటే ''నో'' అనే .. దానికి ఇంకా ఏ అర్థాలు ఉండవనీ.. వెదకొద్దని హెచ్చరించిన సినిమా. స్త్రీల లైంగిక హక్కులు, ఇష్టాయిష్టాల స్వేచ్ఛ గురించి మొదటి సారి స్క్రీన్ మీద చర్చించిన చిత్రం. ఆధునిక దుస్తుల్లో, అంతే ఆధునిక జీవనశైలితో ఉన్న అమ్మాయిలు మగవాళ్లతో చనువుగా మాట్లాడినంత మాత్రాన వాళ్లు పడగ్గదికి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు కాదని.. తీర్పునిస్తుంది. మురికి తలపులతో ఉన్న మనసులను శుభ్రంగా కడిగేస్తుంది పింక్. నెట్‌ఫ్లిక్స్‌లో చూడొచ్చు.

**పాడ్‌మన్...**

బహిష్టు.. అనే మాటను గట్టిగా అనడానికి ఆడవాళ్లే సాహసించని సమాజంలో ఓ భర్త.. ఆ క్రమం చుట్టూ ఉన్న అనారోగ్య వాతావరణాన్ని గూర్చి మథనపడి.. ఒక ఆరోగ్యకరమైన పరిష్కారం కనిపెడ్తాడు. అదే 'పాడ్‌మన్' సినిమా. నిజ జీవిత గాథ. రుతుక్రమం పట్ల ఉన్న అపోహలు, అంధవిశ్వాసాలకు చెక్ పెట్టి.. సైలెన్స్‌ను బ్రేక్ చేసింది. ఇదీ సినిమాకు కథాంశమే అని నిరూపించింది. నెట్‌ఫ్లిక్స్, జీ5ల్లో ఉంది.

**టాయ్‌లెట్..**

సేమ్ అండ్ షేమ్.. స్వాతంత్ర్యం వచ్చి 73 ఏళ్లు అవుతున్నా.. గ్రామీణ భారతం.. ఆ మాటకొస్తే నగరాల్లోని స్లమ్స్‌లో కూడా మరుగుదొడ్లు లేని పరిస్థితి. రియల్‌లైఫ్‌లోని ప్రియాంక అనే నవ వధువే ఈ సినిమాకు ప్రేరణ. ఓ ఇంటి కోడలు అత్తింట్లో మరుగుదొడ్డి కట్టించుకోవడమే కథ.. అదే హీరోయిన్.. హీరో అన్నీ! ఇదీ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది.

**న్యూ బిగినింగ్..**

ఇలా దాదాపు 2000 సంవత్సరం నుంచీ బాలీవుడ్ కొత్త స్క్రీన్‌ను షేర్ చేస్తోంది. మనుషులనే పాత్రలుగా మలిచి జీవితాలను ఆవిష్కరిస్తోంది. కళ్ల ముందు కనిపిస్తున్నా మెదడుకు ఎక్కించుకోని విషయాలెన్నిటినో కథలుగా రాసుకుంటోంది. అందరికీ తెలియాల్సిన రాజ్యాంగ అధికరణల నుంచి అందరికి కావాల్సిన మరుగుదొడ్ల వరకు ఏ చిన్న డిటైల్‌నూ మిస్ చేయట్లేదు. ఇలాంటి సినిమాలతో బాలీవుడ్ న్యూ బిగినింగ్‌ను స్టార్ట్ చేసిందని చెప్పొచ్చు. అక్షరం లేని, రాని చోట దృశ్యమే ఆయుధం అవుతుంది. సమస్యల అవగాహనకు సినిమాను మించిన మాధ్యమం ఏముంటుంది? అందుకే వీటిని మల్టీప్లెక్స్‌లకే కాకుండా గ్రామాల్లోని టాకీసులకూ పంపాలి. అందరూ చూసేలా చేయాలి.

**ఔర్ కుఛ్..**

'ఉరి' తీసిన కెమెరాతోనే ఇస్లామాఫోబియా ఇతివృత్తంగా 'ముల్క్'ను, 'హమీద్', 'నో ఫాదర్స్ ఇన్ కశ్మీర్'అంటూ కశ్మీరీల పోరాటాన్నీ చూపించింది బాలీవుడ్. కశ్మీరియత్ ఉనికి అవసరాన్ని చెప్పింది. 'నిల్ బట్టి సన్నాటా'తో స్త్రీ చదువును ప్రోత్సహిస్తూనే 'లిప్‌స్టిక్ అండర్ మై బుర్ఖా', 'వీరే దీ వెడ్డింగ్'లతో మహిళా సాధికారత మరో కోణాన్నీ పరిచయం చేసింది. 'ఆలిఫ్', 'సూపర్ థర్టి'తో అందరికీ చదువుకునే రైట్ ఉందని డాల్బీ డిజిటల్ సౌండ్‌తో నినదించింది. వీటన్నిటినీ నెట్‌ఫ్లిక్స్, అమేజాన్ ప్రైమ్, హాట్‌స్టార్, జీ5, ఇరోస్ నౌల్లో వీక్షించొచ్చు. ఇలాంటి కొత్త ట్రెండ్‌తో సెట్స్ మీద ఇంకెన్ని సినిమాలున్నాయో! వేచి చూద్దాం.. ఈ చేంజ్‌కు వెల్‌కమ్ చెప్దాం!

– సరస్వతి రమ

## వార్తల్లో వనితలు

### అడిగానని శిక్షించరు కదా!


● ఇల్తిజా

**జ**మ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా.. కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాకు ఒక లేఖ రాశారు. తననెందుకు గృహనిర్బంధంలో ఉంచారో వివరించాలని ఆమె ఆ లేఖలో కోరారు. ''దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంది. కశ్మీరీలు మాత్రం కనీస మానవ హక్కులు కూడా లేకుండా బోనులోని జంతువుల్లా ఉండిపోయారు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. ''నా ప్రాథమిక హక్కుల గురించి ఇలా ప్రశ్నల్ని లేవనెత్తినందుకు నన్ను శిక్షించవద్దనీ, నాపై నేరం మోపవద్దని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను'' అని ఆ లేఖను ముగించారు ఇల్తిజా. కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి ముందు రోజు అక్కడి కొన్ని ప్రధాన రాజకీయ కుటుంబాల వారిని ఇల్లు కదలకుండా చేసింది ప్రభుత్వం. వారిలో మెహబూబా ముఫ్తీ కూడా ఒకరు. మెహబూబాకు ఇద్దరు కూతుళ్లు. అమిత్‌షాకు ఇప్పుడీ ఉత్తరం రాసిన ఇల్తిజా ఒకరు. ఇర్తికా ఇంకొకరు.

### నా కొడుకైతే మాత్రం?!


● రూపా గంగూలి

**కూ**డబెట్టుకున్న సంపదను కరిగించేసినట్లే, కష్టపడి సంపాదించుకున్న పేరు ప్రతిష్టల్ని కూడా హరించేస్తుంటారు కొందరు పుత్రరత్నాలు. బీజేపీ ఎంపీ రూపా గంగూలి కుమారుడు ఆకాశ్ ముఖోపాధ్యాయ్ (20) కారు నడుపుతూ ఇంటి పక్కనే ఉన్న ఓ గోడను ఢీకొట్టాడు. ఆ ధాటికి గోడకు అవతల ఉన్న కొన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోయేవే గానీ ఏ దేవుడో చెయ్యి అడ్డు పెట్టి తృటిలో తప్పించేశాడు. గోడ మాత్రం కూలిపోయింది. కారు నడుపుతున్నప్పుడు అతడు తప్ప తాగి ఉండడాన్ని తాము చూశామని ఘటనాస్థలంలో ఉన్న వాళ్లు చెప్పడంతో పోలీసులు ఆకాశ్‌ని అరెస్ట్ చేశారు. ఎంపీ గారి తనయుడు కనుక శిక్ష లేకుండా బయటికి వచ్చేస్తాడని మనం అనుకోవచ్చు. కానీ రూపా గంగూలి 'నో పాలిటిక్స్ ప్లీజ్' అంటున్నారు. 'దయచేసి ఈ ఘటనను రాజకీయం చేయకండి. నా కొడుకంటే నాకు ఇష్టమే. కానీ చట్టం తన పని చేసుకుపోతుంది'' అని కొడుకు అరెస్ట్‌పై ఆమె ఒక ట్వీట్ పెట్టారు. కోల్‌కతాలోని గోల్ఫ్ గార్డెన్ ప్రాంతంలో గురువారం ఈ ఘటన జరిగింది. ఆకాశ్ కారు గుద్దిన గోడ ఒక క్లబ్బుది.

### ప్రతీకారం తీర్చుకుంటా..!


● కవితా కౌశల్

**అ**న్నలు ఉన్నవాళ్లు రాఖీలు కట్టారు. అన్నలు లేని వాళ్లు 'అన్న' అనుకున్న వాళ్లకు రాఖీలు కట్టారు. అన్న ఉండీ, లేకుండా పోయిన దుఃఖంలో కవితా కౌశల్ అనే చెల్లి తన అన్నకు గుర్తుగా మిగిలి ఉన్న రైఫిల్‌కు రాఖీ కట్టింది! కవిత అన్న రాకేశ్ అసిస్టెంట్ కానిస్టేబుల్. ఛత్తీస్‌గఢ్‌లోని అరణ్‌పూర్‌లో గత ఏడాది మావోయిస్టులు దొంగ దెబ్బ తీసినప్పుడు రాకేశ్ ప్రాణాలు కోల్పోయాడు. ఆ ఘటనలో రాకేశ్‌తోపాటు మరో ఇద్దరు పోలీసు సిబ్బంది, దూరదర్శన్ కెమెరామన్ దుర్మరణం చెందారు. ''మా అన్నను చంపినవారిపై ప్రతీకారం తీర్చుకోవడమే నా ధ్యేయం'' అంది కవిత, అన్న రైఫిల్‌కు రాఖీ కట్టాక. కవిత ఇప్పుడు దంతేవాడలో పోలీస్ కానిస్టేబుల్. అన్న ఉద్యోగాన్ని ఆమెకు ఇచ్చారు.

### తీర్పులిచ్చే పనేముంది?!


● మల్లికా శెరావత్

**మ**ల్లికా శెరావత్ తన సినిమాలతోనే కాదు, మాటలతోనూ దుమారం లేపుతుంటారు. 'మర్డర్', 'ది మిత్' 'హిస్', 'టైమ్ రైడర్స్' చిత్రాలతో పాపులర్ అయిన మల్లిక ఇటీవల ఒక ఇంటర్వ్యూలో బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ''ఫ్రంటల్ న్యూడ్ సీన్‌లలో నటించడానికి ఇప్పటి హీరోయిన్‌లు వెనకాడడం లేదు. ఆడియన్స్ కూడా చక్కగా రిసీవ్ చేసుకుంటున్నారు. నటించేవాళ్లకూ, చూసేవాళ్లకూ ఇబ్బంది లేనప్పుడు ఇక తీర్పులిచ్చే అవసరం ఏముంటుంది?!'' అని ఆమె చక్కగా నవ్వేశారు. తను నటించిన 'మర్డర్' చిత్రం కాలానికి అతీతమైనది చెబుతూ.. అప్పట్లో 'ముద్దు' పెద్ద విషయం, ఇప్పుడైతే వెరీ కామన్ అని కూడా మల్లిక అన్నారు.

## నివాళి

# రజనీగంధ ఫూల్ తుమ్హారే...


విద్యా సిన్హా


అమోల్ పాలేకర్‌తో...



**మ**న 'ప్రేమ్‌నగర్' హిందీలో విడుదలైన 1974లోనే 'రజనీగంధ' కూడా విడుదలైంది. ప్రేమ్‌నగర్ భారీ చిత్రం. రాజేష్‌ఖన్నా హీరో. హేమమాలిని హీరోయిన్. కథ ప్రకారం హీరో కుబేరుడు. హీరోయిన్ ప్రతి సీన్‌లోనూ నాటకీయత ప్రదర్శించగల ఆత్మాభిమాన స్వభావి. 'నా దేవి లేని ఈ కోవెల తునా తునకలై పోనీ' అని హిందీలో రాజేష్ ఖన్నా మందు గ్లాసు పట్టుకొని పాడుతూ ఉంటే హీరోయిన్ దుఃఖంతో పెదవి కొరుక్కుంటుంది. సినిమా అంటే అదే అని జనం హర్షధ్వానాలు చేశారు. కాని సినిమా అంటే ఇది కూడా అని 'రజనీగంధ' వల్ల వాళ్లకు మెల్లగా తెలిసి వచ్చింది.

రజనీగంధలో పైవన్నీ లేవు. కాని ఉన్నది జనానికి నచ్చింది. అదేమిటి?

1970లలో అందరూ చూసే అందరికీ కనపడే టటువంటి అమ్మాయి అబ్బాయి ఈ సినిమాలో నాయకనాయికలు. అమోల్ పాలేకర్ ఒక సాదా సీదా గుమాస్తా. విద్యా సిన్హా డిగ్రీ పూర్తి చేసి ఆ రోజుల్లో ఆడవాళ్లు కూడా ఉద్యోగం చేస్తే బాగుండు అనుకునే ఆర్థిక పరిస్థితి ఉన్న కుటుంబపు అమ్మాయి. వీళ్లద్దరికీ స్నేహం. అమోల్ పాలేకర్ సరదా కుర్రవాడు. చిటుక్కుమని వేరుశనగకాయను పగులగొట్టి గింజను పంటికింద వేయడంలో కూడా ఆనందం వెతుక్కోగలవాడు. తాను ఇష్టపడే అమ్మాయికి మోకాలి మీద వొంగి కూచుని డైమండ్ రింగ్ ఇవ్వక్కర్లేదు... కలిసిన ప్రతిసారి గుప్పిళ్ల నిండా కాసిని రజనీగంధ పూలు బహూకరిస్తే చాలు అనుకుంటాడు. ఢిల్లీ వీధుల్లో సాయంత్రపు గాలి పీల్చడం, ఎప్పుడైనా సినిమాకెళ్లడం, పక్కవాడి పోటీ బరువు నెత్తిన పడకుండా తేలిగ్గా గడపటం... ముఖ్యంగా హాయిగా నవ్వడం తెలిసినవాడు.

విద్యాసిన్హా ఇతణ్ణి ప్రేమిస్తుంది. ఆ కాలంలో ఒక పక్కింటి అమ్మాయి... పెంకుటింట్లో ఉండే అమ్మాయిలాంటి అమ్మాయి... బట్టల షాపులో అందరూ కొనుక్కునేటటువంటి వృత్తాలు వృత్తాల కనకాంబరపు రంగు చీరలు, బాబీ బ్లూ కలర్ చీరలు కట్టుకుని, పూలు తురుముకున్న ఒంటిపేట జడతో, మడిచిన రుమాలు అరచేతిలో ఉండేంత స్థోమతకు ఎదిగిన అమ్మాయి అమోల్ పాలేకర్‌ని ఇష్టపడటం చాలా సహజం. కాని ఆ అమ్మాయి ఉద్యోగం వెతుక్కుంటూ బొంబాయి వెళ్లినప్పుడు అక్కడ పరిచయమైన ఒక యువకుడు ఈ ప్రేమను మరిపిస్తాడు. జీవితం పట్ల గాంభీర్యం, కెరీర్ పట్ల ఆలోచన, భవిష్యత్తు పట్ల ప్రణాళిక, నగర నాగరికతకు అనువుగా మార్చుకున్న వ్యవహార శైలి... ఢిల్లీలో చూసిన అల్లరి చిల్లరి కుర్రవాడి స్థానే ఈ సంస్కారవంతుడైన పురుషుడు విద్యాసిన్హా మనసు నిండా నిండిపోతాడు.

ఆమె ఒకనాడు ఢిల్లీకి తిరిగివచ్చి, అమోల్ పాలేకర్‌తో నీకూ నీ ప్రేమకూ రామ్‌రామ్ చెప్పాలనుకుని, ఆ బొంబాయి పురుషుణ్ణి చేసుకోవడానికి నిశ్చయించుకున్నాక ఇదేమీ తెలియని అమోల్ పాలేకర్ స్నేహితురాలు వచ్చింది కదా అని ఎప్పటి లాగే వస్తాడు. చేతుల్లో సువాసనలు యీనే, స్వచ్ఛంగా పరిమళించే, సహజంగా వికసించే, తేట మనసులకు స్పందించే రజనీగంధ పూలను తెచ్చి నవ్వుతూ అతడు ఎదురుగా నిలబడినప్పుడు ఆ 'సాధారణం'లోని 'అలవిగాని ప్రత్యేకం' కృత్రిమమైన అదుపాజ్ఞల బొంబాయి పురుషుడిలో ఏమాత్రం లేవు అని విద్యా సిన్హాకు హటాత్తుగా అనిపిస్తుంది. అవును. ఇతని సమక్షంలోనే హాయి ఉంది. అసలుతనం ఉంది. ఉబికే ప్రేమ ఉంది. గుండెలు కోరే సాంత్వనం ఉంది. పరిగెత్తుకుని వెళ్లి ఆమె అమోల్ పాలేకర్‌ను కావలించుకుంటుంది. 'ఇక నన్ను ఎక్కడికీ పంపకు' అని అంటుకుపోతుంది. అమోల్ చేతుల్లోని పూలు వారిద్దరితో పాటు తామూ ఆలింగనంలో భాగమవుతాయి.

ఈ సినిమా చూసినవారు ఇప్పటికీ మరోసారి ఇంకోసారి చూస్తూనే ఉంటారు. వారెవరూ విద్యా సిన్హాను మర్చిపోలేదు. పోరు కూడా. డెబ్బయిల నాటి స్త్రీల సహజ ప్రాతినిధ్యం కె.బాలచందర్ వల్ల దక్షిణాదిలో కనిపిస్తే బాసూ చటర్జీ వల్ల ఉత్తరాదిన కనిపించింది. 'రజనీగంధ'లో మధ్యతరగతి అమ్మాయిల టిపికల్ ప్రెజెన్స్‌ని వెండితెర మీద విద్యా సిన్హా అనువాదం చేయగలిగింది. ఆమె మీద చిత్రీకరించిన 'రజనీగంధ ఫూల్ తుమ్హారే'... పాట అతి సుందరమైన హిందీ పాటలలో ఒకటి. బొంబాయి రోడ్లలో ఆమె మీదా ఆమెతో పాటు ఉండే దినేష్ ఠాకూర్ మీద చిత్రీకరించిన 'కహీ బార్ యూ భి దేఖా హై' పాటకు ముఖేష్‌కు జాతీయ అవార్డు వచ్చింది.

రజనీగంధలోనే కాదు ఆ తర్వాత వచ్చిన 'ఛోటీసి బాత్'లో కూడా విద్యా సిన్హా ఆనాటి మధ్యతరగతి ఆడపిల్లల స్వభావ స్వరూపాలను అందంగా చూపించగలిగింది. 'ఛోటీసి బాత్'లో ఆత్మవిశ్వాసం లేని అమోల్ పాలేకర్ విద్యా సిన్హా వంటి అందమైన ఆడపిల్ల ఎక్కడ చేజారిపోతుందోనని ఆమెతో కలయిక జరిగిపోతే ఇక చచ్చినట్టు పెళ్లి చేసుకుంటుందని అందుకు పథకం వేస్తాడు. అది విఫలం అవుతుంది. ఆ పథకం గురించి తెలుసుకున్న విద్యా సిన్హా 'ఇంత చిన్న విషయానికి ఇంత పెద్ద పథకం ఎందుకు?' అని అతణ్ణి దగ్గరకు తీసుకుంటుంది. అంటే మనస్ఫూర్తిగా ప్రేమించిన అమ్మాయికి అబ్బాయి మనసులోని ప్రేమ ఎలాగూ తెలిసిపోతుంది అనీ... ఇరువురూ మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాక ఈ 'కలయిక'లు చాలా చిన్న విషయాలు అని. విద్యా సిన్హా అదృష్టమో ఏమో ఈ సినిమాలో కూడా ఆమె పై చిత్రించిన 'నా జానే క్యా హోతా హై ఏ జిందగీకే సాథ్' పాట అపురూపమైనది.

కొందరి రూపాలు కృత్రిమ అద్దకాలకు పనికి రావు. విద్యా సిన్హా రూపం విగ్గులూ వానపాటలూ డిస్కో దరువులకు అనువైనది కాదు. అవి విజృంభించిన ఎనభైల కాలంలో ఆమెకు తగిన పాత్రలు రాలేదు. మొదటి భర్త 1996లో మరణించాడు. దత్తత తీసుకున్న అమ్మాయి పెంపకం ఆమెను సినిమాలకు దూరం అయ్యేలా చేసింది. రెండోసారి పెళ్లి కూడా వేదన మిగిల్చింది.

సాధారణంగా ఇలాంటివి కొంతమంది అందరికీ చెప్పుకుంటారు. విద్యా సిన్హా ఏనాడూ నోరు మెదపలేదు. పరిమళించి రాలిపోవాలి అన్నట్టు రాలిపోయింది.

మొన్న ఆగస్టు 15న ఆమె మరణవార్త విని డెబ్బయిల్లో హిప్పీలు పెంచిన చాలామంది కుర్రవాళ్లు బాల్కనీలోకి వెళ్లి గట్టిగా ఒక దమ్ములాగి ఆకాశం వైపు చూసి ఉంటారు. కొద్దిపాటి ద్రావకాన్ని గొంతున జార విడిచి 'రజనీగంధ ఫూల్ తుమ్హారే'... అని హమ్ చేసి ఉంటారు.

సినీ అభిమానుల లలితమైన జ్ఞాపకం విద్యా సిన్హా.

- ఖదీర్

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**నేడు భువనచంద్ర బర్త్‌డే**

**పల్లవి :**
జీవితం ఓ ప్రయాణం తోడుగా సాగనీ
గుండెలో ప్రేమగీతం నిండుగా మ్రోగనీ
దారిలో మమతలే పూవులై కురియనీ
ఇలానే... ఇలానే...
॥జీవితం॥

**చరణం : 1**
జలతారు మేఘం పరదాలు దాటి
నీలాల నింగి నే చేరుకోనా
ఆ తారలన్నీ తళుకాడు వేళ
ఎన్నెన్నో కలలు కదలాడవా
ఆ కాంతినై ఇలా... ఇలా... నేనుండిపోనా
॥జీవితం॥

**చరణం : 2**
దరిచేరు వేళ వేళ చిరు... వేళ
దరిచేరు వేళ చిరుసిగ్గులో
మనసైన వాని కనుచూపులో
సరికొత్త అందం చిగురించితే
ఓ గర్వరేఖ కనుగిటితే
ఆ రేఖనై ఇలా... ఇలా... నే ఒదిగిపోనా
॥జీవితం॥

**చిత్రం : సుమంగళి (1988)**
**రచన : భువనచంద్ర**
**సంగీతం : సాలూరి వాసూరావు**
**గానం : పి.సుశీల, ఎస్.పి.బాలు**

కట్‌చేయ్‌...దాచేయ్‌...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | | | 2 | 5 | 7 | 9 | 4 | |
| 7 | 9 | | 3 | | 6 | 2 | | 5 |
| 2 | | 5 | | | | | | 8 |
| | 1 | 6 | | | | 4 | | |
| | | | 1 | | 8 | | | |
| | | 2 | | | | 8 | 5 | |
| 1 | | | | | | 3 | | 2 |
| 9 | | 3 | 8 | | | | 7 | 4 |
| | 5 | 7 | 9 | 3 | 2 | | | 6 |

**నిబంధనలు:** ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 1 | 8 | 2 | 6 | 3 | 5 | 9 | 7 |
| 6 | 7 | 9 | 4 | 5 | 1 | 8 | 3 | 2 |
| 2 | 5 | 3 | 7 | 9 | 8 | 4 | 1 | 6 |
| 3 | 8 | 2 | 6 | 1 | 4 | 7 | 5 | 9 |
| 1 | 9 | 6 | 5 | 2 | 7 | 3 | 8 | 4 |
| 5 | 4 | 7 | 8 | 3 | 9 | 6 | 2 | 1 |
| 8 | 6 | 1 | 3 | 4 | 2 | 9 | 7 | 5 |
| 9 | 3 | 5 | 1 | 7 | 6 | 2 | 4 | 8 |
| 7 | 2 | 4 | 9 | 8 | 5 | 1 | 6 | 3 |



# బుట్టెడు వంటలు

**కంకి... కండె... బుట్ట...**
**మొక్కజొన్నకు బుట్టెడు పేర్లు.**
**మరి ఈ మక్కబుట్టతో**
**బుట్టెడు వంటలు చేయకపోతే ఎలా?**
**బజారులో బాగా చవకగా దొరుకుతున్నాయి!**
**ఇంట్లో రుచిగా చేసుకోండి!!!**



## కార్న్ కబాబ్స్

**కావలసినవి: ఉడికించిన కార్న్** – ఒక కండె; **ఉడికించిన బంగాళ దుంపలు** – 2; **పసుపు** – పావు టీ స్పూను; **మిరప కారం** – అర టీ స్పూను; **మిరియాల పొడి** – పావు టీ స్పూను; **తరిగిన పచ్చి మిర్చి** – 3; **ఉల్లి తరుగు** – పావు కప్పు; **క్యాప్సికమ్ తరుగు** – పావు కప్పు; **నిమ్మ రసం** – ఒక టేబుల్ స్పూను; **కొత్తిమీర** – ఒక టేబుల్ స్పూను; **బ్రెడ్ స్లైసులు** – 2; **సెనగ పిండి** – ఒక టేబుల్ స్పూను; **బియ్యప్పిండి** – ఒక టేబుల్ స్పూను.

**తయారీ:** ● మొక్కజొన్న గింజలను మిక్సీలో వేసి మెత్తగా చేసి, ఒక పాత్రలోకి తీసుకోవాలి ● ఉడికించిన బంగాళ దుంప ముద్ద, మిరప కారం, పసుపు, మిరియాల పొడి, పచ్చి మిర్చి తరుగు, ఉల్లి తరుగు, క్యాప్సికమ్ తరుగు, నిమ్మరసం, కొత్తిమీర, బ్రెడ్ స్లైసులు (బాగా తుంపేయాలి), సెనగ పిండి, బియ్యప్పిండి వేసి బాగా కలపాలి (నీళ్లు కలపనవసరం లేదు) చేతిలో కొద్దిగా బియ్యప్పిండి వేసుకుని, తయారుచేసి ఉంచుకున్న మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని పనస గింజ ఆకారంలో తయారు చేసి, మధ్యలోకి టూత్ పిక్‌ను గుచ్చాలి ● ఈ విధంగా అన్నీ తయారుచేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక ఒక్కో కబాబ్‌ను నూనెలో వేసి బాగా రంగు మారేవరకు రెండువైపులా తిప్పుతూ వేయించాలి ● మంచి గోధుమరంగులోకి వచ్చాక, కిచెన్ టవల్ మీదకు తీసుకోవాలి ● కొద్దిగా కొత్తిమీరతో గార్నిష్ చేయాలి ● టొమాటో సాస్‌తో తింటే రుచిగా ఉంటాయి.

నిర్వహణ:
**డా. వైజయంతి పురాణపండ**



## దమ్ మక్కై మసాలా

**కావలసినవి:**
**నూనె** – ఒక టేబుల్ స్పూను; **నెయ్యి** – ఒక టేబుల్ స్పూను; **ఉల్లి తరుగు** – ఒక కప్పు; **అల్లం వెల్లుల్లి ముద్ద** – ఒక టీ స్పూను; **టొమాటో తరుగు** – ఒక కప్పు; **బొగ్గు ముక్క** – 1; **ఎండు మిర్చి పేస్ట్** – ఒక టేబుల్ స్పూను; **పసుపు** – పావు టీ స్పూను; **ధనియాల పొడి** – ఒక టేబుల్ స్పూను; **జీలకర్ర పొడి** – అర టీ స్పూను; **ఉప్పు** – తగినంత; **పంజాబీ గరం మసాలా** – ఒక టీ స్పూను; **కసూరీ మేథీ** – ఒక టేబుల్ స్పూను; **ఉడికించిన స్వీట్ కార్న్ గింజలు** – 2 కప్పులు; **జీడిపప్పు పలుకులు** – ఒక టేబుల్ స్పూను (నీళ్లలో నానబెట్టి, మిక్సీలో వేసి మెత్తగా చేయాలి); **పనీర్ తురుము** – 2 టేబుల్ స్పూన్లు; **పచ్చి కోవా** – 3 టేబుల్ స్పూన్లు; **పంచదార** – అర టీ స్పూను; **క్యాబేజీ ఆకులు** – రెండు; **చీజ్ తురుము** – ఒక టేబుల్ స్పూను; **కొత్తిమీర** – 3 టేబుల్ స్పూన్లు.

**తయారీ:** ● స్టౌ మీద బాణలిలో ఒక టేబుల్ స్పూను నూనె వేసి కాగాక, ఒక టేబుల్ స్పూను నెయ్యి వేయాలి ● ఉల్లి తరుగు జత చేసి దోరగా వేయించాలి ● బంగారు రంగులోకి మారాక అల్లం వెల్లుల్లి ముద్ద జత చేసి మరోమారు వేయించాలి ● గోధుమ రంగులోకి మారాక టొమాటో తరుగు జత చేసి బాగా కలియబెట్టి కొద్దిసేపు ఉడికించాలి ● మరో స్టౌ మీద బొగ్గును ఉంచి కాల్చాలి ● ఉడుకుతున్న టొమాటోలో ఎండు మిర్చి ముద్ద, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి ● ఉప్పు జత చేసి మరోమారు కలపాలి ● పంజాబీ గరం మసాలా, కసూరీ మేథీ జత చేసి మరోమారు కలపాలి ● ఉడికించిన మొక్కజొన్న గింజలు జత చేసి కలియబెట్టాలి ● ఒక కప్పుడు నీళ్లు జత చేయాలి ● మెత్తగా చేసిన జీడిపప్పు మిశ్రమం వేసి బాగా కలిపి ఉడికించాలి ● కొద్దిగా పొంగులు వచ్చేవరకు మూత ఉంచి ఉడికించాలి ● పనీర్ తురుము జత చేయాలి ● పచ్చి కోవా జత చేసి బాగా కలపాలి ● పంచదార వేసి మరోమారు కలపాలి ● క్యాబేజీ ఆకు తీసుకుని ఉడుకుతున్న మిశ్రమం మీద ఉంచాలి ● పైన బొగ్గు ఉంచి, దాని మీద కొద్దిగా నెయ్యి వేసి వెంటనే మూత ఉంచి రెండు నిమిషాలుఉడికించాలి ● మూత తీసి బొగ్గును, క్యాబేజీ ఆకును తీసేసి, మరోమారు మూత పెట్టి ఉడికించాలి ● చీజ్ తురుము జత చేయాలి ● కొత్తిమీర వేసి ఒకసారి కలిపి దింపేయాలి.

## స్వీట్ కార్న్ ఢోక్లా

**కావలసినవి: కార్న్ ఫ్లోర్** – ఒక కప్పు; **సెనగ పిండి** – 2 టేబుల్ స్పూన్లు; **బొంబాయి రవ్వ** – ఒక టేబుల్ స్పూను; **స్వీట్ కార్న్** – ఒక టీ స్పూను; **స్వీట్‌కార్న్ పేస్ట్** – అర కప్పు; **ఉప్పు** – తగినంత; **ఇంగువ** – కొద్దిగా; **పసుపు** – పావు టీ స్పూను; **పచ్చి మిర్చి ముద్ద** – అర టీ స్పూను; **మజ్జిగ** – అర కప్పు; **ఫ్రూట్ సాల్ట్** – ఒక టీ స్పూను; **నూనె** – 2 టేబుల్ స్పూన్లు; **ఆవాలు** – అర టీ స్పూను; **తరిగిన పచ్చి మిర్చి** – 2; **కరివేపాకు** – రెండు రెమ్మలు; **పంచదార** – ఒక టీ స్పూను; **నిమ్మ రసం** – ఒక టీ స్పూను; **కొత్తిమీర** – ఒక టేబుల్ స్పూను.

**తయారీ:** ● ఒక పాత్రలో కార్న్ ఫ్లోర్, సెనగ పిండి, బొంబాయి రవ్వ, స్వీట్ కార్న్, స్వీట్ కార్న్ ముద్ద, ఉప్పు, ఇంగువ, పసుపు, పచ్చిమిర్చి ముద్ద వేసి, కొద్దికొద్దిగా మజ్జిగ, నీళ్లు జత చేస్తూ ఉండలు లేకుండా చక్కగా కలుపుకోవాలి ● ఫ్రూట్‌సాల్ట్ జత చేసి మరోమారు కలపాలి ● ఒక ట్రేకి నూనె పూసి, ఆ ట్రేలోకి ఈ మిశ్రమాన్ని పోసి, సమానంగా పరచాలి ● కుకర్‌లో కొద్దిగా నీళ్లు పోసి, ఆ పైన ఈ ట్రే ఉంచి మూత పెట్టి స్టౌ మీద ఉంచాలి (విజిల్ పెట్టకూడదు) ● సుమారు పావు గంట సేపు ఉడికించి దింపేయాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక ఆవాలు, పచ్చి మిర్చి తరుగు, ఇంగువ, కరివేపాకు, పంచదార, ఉప్పు, నిమ్మరసం, కొద్దిగా నీళ్లు వేసి మరిగించాలి ● చివరగా కొత్తిమీర వేసి దింపేయాలి ● ఢోక్లాను ఒక ప్లేట్‌లోకి తిరగదీసి, దాని మీద పోపు మిశ్రమం వేసి కట్ చేసి, అందించాలి.



## మసాలా కార్న్ ఫ్రైస్

**కావలసినవి: స్వీట్‌కార్న్ కండెలు** – 2; **మిరప కారం** – ఒక టేబుల్ స్పూను; **ఉప్పు** – తగినంత; **కార్న్‌ఫ్లోర్** – ఒక టేబుల్ స్పూను; **బియ్యప్పిండి** – రెండు టేబుల్ స్పూన్లు; **నూనె** – డీప్ ఫ్రైకి సరిపడా

**పైన చల్లడానికి: నిమ్మరసం** – 1 టేబుల్ స్పూను; **చాట్ మసాలా** – ఒక టీ స్పూను; **జీలకర్ర పొడి** – ఒక టీ స్పూను; **ఆమ్ చూర్ పొడి** – ఒక టీ స్పూను; **మిరియాల పొడి** – అర టీ స్పూను; **వెల్లుల్లి పొడి** – అర టీ స్పూను; **ఉప్పు** – తగినంత.

**తయారీ:** ● మొక్కజొన్న కండె పైనున్న ఆకుపచ్చని తొక్కలు వేరు చేయాలి ● స్వీట్‌కార్న్‌ను టూత్‌పిక్‌తో కొలుచుకోవాలి ● అక్కడ వరకు కట్ చేయాలి ● ఒక వరుస గింజలను నిలువుగా తీసి వేరుచేయాలి ● గింజలలోకి ఒక్కో పుల్లను గుచ్చాలి ● జాగ్రత్తగా కండె నుంచి వేరు చేసి పక్కన ఉంచాలి ● స్టౌ మీద గిన్నె ఉంచి నీళ్లు పోసి మరిగించాలి ● పుల్లకు గుచ్చుకున్న స్వీట్‌కార్న్‌ను నీళ్లలో వేయాలి ● మూడు నిమిషాలయ్యాక వాటిని ఒక బౌల్‌లోకి తీసుకోవాలి ● మిరప కారం, ఉప్పు, బియ్యప్పిండి, స్వీట్‌కార్న్ ఒకదాని తరవాత ఒకటి వేసి జాగ్రత్తగా కలపాలి ● కొద్దిగా నీళ్లు జతచేసి మరోమారు కలిపి బౌల్‌ని డీప్ ఫ్రీజర్‌లో పావు గంట సేపు ఉంచి తీసేయాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక స్వీట్ కార్న్ గుచ్చిన ఒక్కో పుల్లను జాగ్రత్తగా వేసి దోరగా వేయించి ప్లేట్‌లోకి తీసుకోవాలి ● ఒక పాత్రలో మిరప కారం, ఆమ్‌చూర్ పొడి, వెల్లుల్లి పొడి, జీలకర్ర పొడి, చాట్ మసాలా, మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి ● ప్లేట్‌లో ఉన్న స్వీట్ కార్న్ పుల్లల మీద మిరపకారం మిశ్రమం చల్లాలి ● చివరగా నిమ్మ రసం చల్లి వెంటనే అందించాలి.



## రాశి ఫలాలు (సౌరమానం)



**జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (ఆగస్ట్ 17 నుండి 23 వరకు) మీ రాశి ఫలితాలు**

**డా॥ మైలవరపు శ్రీనివాసరావు**
**జ్యోతిష్య పండితులు**

### మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)




కొంత పనిని చేసి– తర్వాత చూద్దాంలే!– అనుకున్న పక్షంలో పని ఏమాత్రమూ పూర్తి కాదనేది నిర్వివాదాంశం. పని పూర్తయ్యేవరకూ పట్టుదలతో ఉండి తీరాల్సిందే. మీకు సాధ్యం కాని పక్షంలో ఓ రూపాయి ఎక్కువైనా సరే పనిని సకాలంలో పూర్తి చేసుకోవడం అత్యవసరం. కాలం దాటితే ఆ పనిని ముగించేందుకు అవకాశం అనుమతీ లభించకపోవచ్చు. పట్టుదల ఉంటే విజయం తథ్యం. లోకంలో కొందరు నిష్కారణంగా మన ఉన్నతికి బాధపడుతూ మనకేదైనా ఇబ్బందీ విఘ్నం నష్టం వంటివి కలిగితే బాగుండునని ఎదురు చూస్తూ ఉండచ్చు. మీరు 'నా గతి ఇంతే అనో, నష్టం విఘ్నం కష్టం వస్తుందేమో' అనే తీరు వ్యతిరేక భావాలతో ఉండకండి. తప్పక విజయం లభిస్తుంది. అయితే విజయ సాధన పట్ల గుంభన అవసరం. విజయ రహస్యాన్నీ పొంగిపోతూ నలుగురికీ చాటింపు వేసుకోవడం మరింత అనవసరమని గ్రహించండి. ప్రభుత్వపరంగా మీకు రావలసిన సహాయం ఈ వారంలో రాకపోవచ్చునసే దృఢ నిర్ణయంతో ఉండండి. అలాగే మీకు మీ అవసర కాలంలో రుణాన్నిచ్చినవాళ్లు ఒత్తిడి చేస్తారేమోననే భయంతో ఉండకండి. ఇంతకుముందు కూడా ఇలాగే వచ్చిన సంఘటనలెన్నో ఉన్నాయి– ఒడ్డుకి చేరుకున్న సంఘటనలూ ఉన్నాయి. ధైర్యంగా ఉండండి. ఆర్థికంగానైతే పొంగి పొర్లిపోయేంత ధనమూ ఉండదు– అలాగని బీద అరుపులు అరుచుకోవాల్సిన స్థితీ ఉండదు. ఆర్థిక స్థితి మిశ్రమంగా ఉంటుంది. అయితే కుటుంబ వాతావరణం ఆత్మీయులతో సంబంధ బాంధవ్యాలూ చక్కని తీరులో ఉండే కారణంగా ధన బలహీనత అనేది మీకు ఒక లోపంగా అనిపించనే అనిపించదు. అనుకోని అవాంతరం తప్పదు. ఆ వెంటనే అది పరిష్కరింపబడటం కూడా తప్పదు. దుఃఖపడే అవసరం తప్పదు.
**లౌకిక పరిహారం:** పట్టుదల విడవకండి. గుంభనని పాటించండి.
**అలౌకిక పరిహారం:** శ్రావణ మంగళవారం నాడు గౌరీపూజని శ్రద్ధగా చేసుకోండి.

### మిథునం (మే 21 - జూన్ 20)




కుటుంబంలో ఐకమత్యం బాగా ఉండే కారణంగా మానసికంగా ఉత్సాహంగా ఉండగలుగుతారు. అయితే ఆర్థికపరమైన అంశాలకి సంబంధించి సరైన నిర్ణయాలు తీసుకోలేక కొన్ని ఇబ్బందులకి లోనవుతారు. ప్రశాంతంగా ఉండే ధోరణిలో ఉండే ఈ రాశివారు ఒక సందర్భంలో ఆవేశానికి లోనవుతారు. ఆ కారణంగా తమ మనసులోని ఆలోచన కాస్తా బయటికి వచ్చేసే అవకాశముంది. జాగ్రత్తగా ఉండడం మంచిది. ఉద్యోగరీత్యా దూరంగా ఉన్న భార్య/భర్త వద్దకి వెళ్లే అవకాశముంది. అయితే ప్రయాణాల్లో వస్తు జాగ్రత్తలు అత్యవసరం. దంపతులు బాగా ఆలోచించుకుని ఓ నిర్ణయానికి వచ్చే కారణంగా మంచి భూమినో పొలాన్నో ఇంటినో కొనే ఆలోచన తప్పనిసరి ఔతుంది. సరైన తీరులో పత్రాలని దానికి సంబంధించిన వారికి చూపించుకుని కొనుక్కోవడం మంచిది. ఈ రాశివారు ఓ సాహసోపేత నిర్ణయాన్ని చేసి లోగడ నుండి మనోవ్యధని కలిగిస్తున్న ఆ సమస్యకి పరిష్కారాన్ని పొందుతారు. మీరు చేస్తున్న వృత్తి ఉద్యోగ వ్యాపారాల గురించి మరింతగా ఆలోచనలని చేస్తూ కొద్దిగా మానసిక శ్రమకి తాత్కాలికంగా గురి ఔతారు. మీ ఆలోచనలని ఆచరణలో పెట్టేందుకు మీ బంధువులు తోడ్పడతారు కూడా. స్థానచలనం గురించిన ఆలోచనని అస్సలు చేయద్దు. ఉన్న చోటనే విజయం లభించే అవకాశం ఉన్న కారణంగా ఉద్యోగంలో మరింతగా మీ చురుకుదనాన్ని చూపించండి. కొత్త మెళకువలని తెలుసుకోండి. ఏ విధమైన వ్యతిరేకతా కనిపించడం లేదు కాబట్టి అనవసరమైన ఆందోళన పడకండి. ఉద్యోగపు మార్పుని గురించిన ఊహతో అస్సలుండకండి. ప్రయాణమేదైనా చేయాల్సి వస్తే 'దానివల్ల నాకు కలిసొచ్చేది ఎంత' అని నిర్భయంగా ఆలోచించుకుని మాత్రమే ప్రయాణించండి తప్ప వ్యర్థ ప్రయాణాలని చేసి శారీరక శ్రమకీ అనారోగ్యానికీ గురి కాకండి.
**లౌకిక పరిహారం:** భూమి, గృహం, పొలం.. వంటివి కొనే ఆలోచన సరైనదే.
**అలౌకిక పరిహారం:** శ్రావణ మంగళవారం నాడు ఓ ముత్తైదువుకి చీరతోపాటు వాయనాన్నిచ్చుకోండి.

### సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)




అప్పటికి ఆ పనైపోతే చాలు అనే పూర్వ ధోరణిని పూర్తిగా విడిచిపెట్టండి. అప్పటికప్పుడు... అనే ఆలోచన ఉంటే చేసే పని తప్పక అనాలోచితమే ఔతుంది. ముందుచూపుతో, రేపటి రోజున ఎలా ఉండబోతోందనే గట్టి ఊహతో పని చేస్తే నష్టం ఎక్కువ శాతంలో ఉండదు. దశ బాగుండలేదు కనుక సరైన ఆలోచన తట్టని పక్షంలో ఆ పనిని తలెత్తుకోకండి. ఏది తోస్తే అది చేసేయకండి. ఒకప్పుడు మీరు మంచి కష్టకాలంలో ప్రయాణిస్తున్న సందర్భంలో మీకు సహాయపడిన ఎవరో ఒకరు ఓ విషయంలో కొద్దిగా మొగమాట పెట్టచ్చు. సాధ్యం కాదని స్పష్టంగా కృతజ్ఞతాపూర్వకంగా వినయంగా చెప్పండి. ఎందుకు సాధ్యపడదో కూడా చెప్పండి. 'అలాగే' అని చెప్పి ఆయన మీ మీద ఆశపెట్టుకుని ఉన్నాక చివర్లో మీరు వ్యతిరేక ధోరణిని క్రియాత్మకంగా ప్రదర్శించడం కృతఘ్నత అవుతుంది. అది సరికాదు. మీకు లోకానుభవం గట్టిగా ఉంటుంది. దానికి తోడు గత అనుభవజ్ఞానం కూడా బాగా ఉంది. ఆ కారణంగా నిజానికి మీకెవరూ ప్రత్యేకించి సలహా ఇయ్యవలసిన అవసరం లేదు. అలాగని మీకు మీరే నిర్ణయం చేసుకుని పనిలోకి దూకిపోకండి. బాగా విశ్వసనీయ వ్యక్తితో సంప్రదించి చేయడం మంచిదని గ్రహించుకోండి. దాదాపు చాలామందికి... ఏదో ఒక పనిని రహస్యంగా చేసేసి దాని వల్ల వచ్చిన ఫలితాన్ని భర్త/ భార్యకి చూపించి అతని/ఆమె ఆనందాన్ని పొందాలనే మనస్తత్వం సాధారణంగా ఉంటుంది. ప్రస్తుతం దశ అంత అనుకూలంగా లేని కారణంగా గుంభన మంచిది కాదు. కుటుంబ సభ్యులతో చెప్పి ముందువెనుకలు చూసుకుని పనిలోకి దిగండి. సాహసం చేయకండి. ఎదుటివానికి హాని కలగనప్పుడు అసత్యం పలకటం నేరం కాదు. కాబట్టి మధ్యవర్తిత్వం, బరువైన కార్యాన్ని చేసిపెడతానని వాగ్దానం చేయద్దు.
**లౌకిక పరిష్కారం:** కుటుంబ సభ్యులతో గుంభన వద్దు. పెద్దలతో సంప్రదించాలి.
**అలౌకిక పరిష్కారం:** ముత్తయిదువు పాదాలకు పసుపు పూసి ఆశీస్సులు పొందండి.

### వృషభం (ఏప్రిల్ 20 - మే 20)




ఏ మాటని మాట్లాడబోతున్నా– ఏమైనా అపార్థం ఎదుటివాళ్లకి స్ఫురిస్తుందా?– అని ఆలోచించుకుని మాట్లాడటం అవసరం. వాద వివాదాలొచ్చే అవకాశముందని అనిపిస్తే ఆ ప్రదేశాన్ని వీడి వెళ్లిపోవడం గాని, వాదించుకోబోతున్న అంశాన్ని మార్చేయడం గాని సర్వదా శుభప్రదం. కుజుడు మారబోతున్న కారణంగా మానసికమైన ఆందోళన కలగచ్చు. అయితే పని ముగిసింతర్వాత 'ఎందుకాందోళన పడ్డాననే తీరు ఆలోచనకి వస్తారు. ఉన్న సొమ్ముతో భూమి కొనుగోలు ప్రయత్నాలు చేసే అవకాశముంది. అయితే ఉన్న ఆస్తిని అమ్మేసి కొనడం మాత్రం సరికాదు. ఇరుగు పొరుగులతో మాటా మాటా బంధువులనుండి అపనిందలూ, ఉద్యోగంలో పై అధికారుల ఒత్తిడులూ, తోటి ఉద్యోగుల అసహకారం వంటి వాటిలో ఏదో ఒకటి మిమ్మల్ని బాధ పెట్టవచ్చు. అయితే అది హానికరం కానే కాదు. సహజమైన కిట్టనితనం కారణంగానే ఈ ఒత్తిడి కాబట్టి తట్టుకోండి. వివాహాది శుభకార్య ప్రయత్నాలు మీ ద్వారానే సాగే అవకాశముంది కాబట్టి ఇంటికి స్నేహితులు, బంధువులు, ఆప్తులు ఎరిగున్నవారు వచ్చే అవకాశముంది. ఆర్థికంగా జాగ్రత్త తీసుకోని పక్షంలో వ్యయం పెరగచ్చు. ఇంటికి నలుగురొచ్చారు కదా! అని అనవసరమైన (గృహ విషయాల్లో) సందేహాలని వాళ్ల మధ్య పెట్టకండి. తగినంత ఓపిక గాని లేవనిపించిన పక్షంలో రా వీలుపడదనే మాటని చెప్పండి తప్ప మాట దాటేసి నిందపడకండి. అయిన వారితో కంటె ఇటీవల పరిచయమయ్యే వ్యక్తుల నడవడికను గమనించి ప్రవర్తించుకోవడం ఉత్తమం. వ్యవసాయ దారులకీ వాహనాలని అద్దెకి తిప్పే వారికీ షేర్ల వ్యాపారం చేసే వారికీ మధ్యమ ఫలితాలుండవచ్చు. నడుమూ పాదాలూ ఆరోగ్యపరంగా బాగుండకపోవచ్చు. తగినంత ఆరోగ్యవృద్ధిని పాటించండి.
**లౌకిక పరిహారం:** అపార్థం రాకుండా అవసరమైనంతే మాట్లాడుతూ ఉండండి.
**అలౌకిక పరిహారం:** శ్రావణ మంగళవారం నాడు గౌరీ అష్టోత్తరాన్ని పఠించండి.

### కర్కాటకం (జూన్ 21 - జూలై 22)




ముద్దొచ్చినప్పుడే చంకకెక్కాలనేది సామెత. ప్రస్తుతం మీకు గ్రహదశంతా అనుకూలంగా ఉంది కాబట్టి మీ జీవిత గమనంలో వేగాన్ని పెంచుకుని పనుల వాయిదా వేయకండి. పని పూర్తయ్యేవరకూ విశ్రమించకండి. మీరు చేసే పని మీకూ ఒక తీరుగా సంఘానికీ కూడా ప్రయోజనాన్ని కల్గించేదిగా ఔతుంది కాబట్టి పనిని ఆపుకోకండి– ఎవరి సూచన మీదటో పనిని ఆపనీయకండి. విదేశాల నుండి ఆహ్వానం లభించినా కూడా దాన్ని తిరస్కరిస్తూ మీ ఆలోచనలకనుగుణంగా ఏదో ఒక కొత్త సంస్థని స్థాపించాలనే గట్టి నిర్ణయానికొస్తారు. స్వదేశంలో ఉంటే మీకు మీరు ఎదుగుతారు. అదే మరి విదేశాలకెళ్తే వాళ్ల ఎదుగుదలకి మీకు సహకరించిన వారు ఔతారు. ఈ ఆలోచనతోనే విదేశగమనానికి ఇష్టాన్ని చూపించరు. ఇంట్లో వాళ్లెవరైనా మీరు పెట్టబోయే వ్యాపారంలో సహకరిస్తామని గాని అంటే– తిరస్కరించవద్దు. 'నీకేం తెలుసు?' నని ఆ తీరుగా అవమానించద్దువ. ఎంతటి సాధు గోమాతకైనా నీకేం తెలియదన్న మాటని పదిమందితో అంటే ఓ చిన్న అభిమానం పొడుచుకొచ్చి ఇక విరోధ బుద్ధితోనే ఉండాలనే నిశ్చయానికి వచ్చేస్తారు. ముఖ్యంగా స్త్రీ సంతానమైతే వాళ్లతో మరింత జాగ్రత్త అవసరం. కొత్త చదువుల్ని చదివే అవసరం రావచ్చు. మళ్లీ చదువా? అనుకోకండి. ఉద్యోగంలో పదవీ ఉన్నతీ ఆర్థిక ఉన్నతీ కూడా కలిగే అవకాశముంది. పైగా చదవడానికి మొదలెడితే మీ దశ ప్రస్తుతం బాగున్న కారణంగా ఆ చదవబోతున్న చదువుకి సంబంధించిన వ్యక్తి మీకు పరిచితుడో చుట్టమో అయ్యే అవకాశముంది కూడా. ఏటిలో ఒక కెరటం తర్వాత మరొక కెరటం వచ్చేట్టుగా మీక్కూడా చేయాల్సిన పనుల పరంపర అలా వచ్చేస్తూ ఎంతగా విశ్రాంతిని తీసుకోవాలని ప్రయత్నిస్తే అంతగా పనిభారం పెరిగిపోతూ ఉండచ్చు ఈవారంలో. పనిలోనే ఆనందాన్ని పొందండి. తప్పదు.
**లౌకిక పరిహారం:** పనీ కొత్త చదువూ తప్పనిసరి కావచ్చు. శ్రమించండి.
**అలౌకిక పరిహారం:** శ్రావణ మంగళవారం నాడు అమ్మ అష్టోత్తరాన్ని గుళ్లో చదువుకుని రండి.

### కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)




అనవసర భయాలతో ఆందోళనలతో ఉద్యోగాన్నీ, వృత్తినీ మారిస్తే ఎలా ఉంటుందనే కొత్త నిర్ణయంతో సతమతమౌతున్న మీకు ఆ అవసరం లేదనే యథార్థం దృఢంగా తెలిసి మంచి ఆనందాన్ని పొందుతారు. ఉద్యోగస్థులు పదవీ ఉన్నతితో పాటు ఆర్థికలాభాన్ని కూడా పొందే అవకాశముంది. ఏ సమస్య పరిష్కారం గురించి ఎక్కువగా మథనపడుతున్నారో ఆ విషయాన్ని... మీకు సంబంధించిన ఆప్తులూ, రహస్యాన్ని ఎవరికీ చెప్పనే చెప్పరనే నమ్మకం మీకు కలిగించినవాళ్లు అయిన ఓ ఇద్దరితో మాత్రమే చర్చించి పరిష్కారం కోసం ప్రయత్నించండి. సమష్టిగా చేయబోయే నిర్ణయం సత్ఫలితాలను ఇస్తుంది. మీ గుండెలో బాధని అలా తరిమికొడుతుంది. ఏదో ఓ శుభవార్త వినే అవకాశముంది. సోదరుల్లో ఎవరికో వివాహమో గృహప్రవేశమో వంటి వార్త కావచ్చు లేదా మీకు సంబంధించిన శుభవార్త కావచ్చు. కొద్దిగా మనసు బాధగా ఉన్నకాలంలో మనకి లేదా మన సంబంధికులెవరికైనా శుభం జరుగుతోందనే వార్త వింటే మనసు తేలికపడుతుంది కదా? ఖర్చులు తప్పనిసరిగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. కాబట్టి కొంత ఆర్థిక క్రమశిక్షణ అవసరం. అలాగని ఎవరికో ఋణాన్ని ఈయదమైతే సరికాని పని. దానికి కారణం మీకు తిరిగి వసూలు చేసుకోగల కరకుదనం లేకపోవడం, తెగించి అడుగుదామనుకున్నా అది ఎందుకో సాధ్యపడకపోవడం. ధనాన్ని ఋణంగా ఇచ్చి తిరగడం కంటె ఇవ్వవలేననడం మంచిది కదా. ఒకవేళ మైత్రి తెగిపోయినా సరే అనుకుంటూ ఈ ఋణ తిరస్కరణ చేయండి. మీరు చేస్తున్న వ్యాపారానికి మంచి గుర్తింపు లభించే కారణంగా వ్యాపారాభివృద్ధి ఉంది.
**లౌకిక పరిష్కారం:** ఆప్తులతో చర్చించి నిర్ణయం తీసుకోండి. ఆర్థిక క్రమశిక్షణ అవసరం.
**అలౌకిక పరిష్కారం:** శ్రావణ మంగళవారం నాడు ముత్తయిదువ పాదాలకు నమస్కరించి అక్షతలను వేయించుకోండి.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 17-8-2019



## మేథీ కార్న్ మలై

**కావలసినవి:** మెంతి ఆకులు – పావు కేజీ; **ఉప్పు** – తగినంత; **నీళ్లు** – అర లీటరు; **జీడిపప్పులు** – 100 గ్రా.; **నీళ్లు** – 300 మి.లీ.; **బటర్** – 2 టేబుల్ స్పూన్లు; **ఉల్లి తరుగు** – పావు కప్పు; **ఏలకుల పొడి** – ఒక టీ స్పూను; **టొమాటో ప్యూరీ** – రెండు కప్పులు; **ఉప్పు** – తగినంత; **మిరప కారం** – ఒక టీ స్పూను; **పసుపు** – ఒక టీ స్పూను; **గరం మసాలా** – ఒక టీ స్పూను; **తాజా క్రీమ్** – 50 గ్రా.; **స్వీట్ కార్న్** – 200 గ్రా.; **పాలు** – 300 మి.లీ.; **పంచదార పొడి** – ఒక టేబుల్ స్పూను; **తాజా క్రీమ్** – గార్నిషింగ్ కోసం.

**తయారీ:** ● మెంతి ఆకును సన్నగా తరగాలి ● ఒక పాత్రలో మెంతి ఆకు, ఉప్పు వేసి కలిపి పావు గంటసేపు పక్కన ఉంచాలి ● అర లీటరు నీళ్లు జత చేసి బాగా కలిపి వడగట్టి, ఆ నీళ్లను పక్కన ఉంచాలి ● ఒక పాత్రలో జీడి పప్పులు, నీళ్లు పోసి అరగంట సేపు నానబెట్టాక, నీళ్లు తీసేసి, జీడిపప్పును మిక్సీలో వేసి మెత్తగా ముద్దలా చేయాలి ● స్టౌ మీద బాణలిలో రెండు టేబుల్ స్పూన్ల బటర్ వేసి వేడయ్యాక, ఉల్లి తరుగు వేసి గోధుమ రంగులోకి మారేవరకు వేయించాలి ● ఏలకుల పొడి జత చేయాలి ● కసూరీ మేథీ, టొమాటో ప్యూరీ జత చేసి బాగా కలియబెట్టాలి ● ఉప్పు, మిరపకారం, పసుపు, గరం మసాలా జత చేసి మరోమారు కలిపి, మీడియం మంట మీద సుమారు ఐదు నిమిషాలు ఉడికించాలి ● జీడిపప్పు ముద్ద జత చేసి బాగా కలిపి మరి కొద్దిసేపు ఉడికించాలి ● తాజా క్రీమ్, స్వీట్‌కార్న్ జత చేసి కలపాలి ● పాలు, పంచదార పొడి జత చేయాలి ● సన్నటి మంట మీద కొద్దిసేపు ఉడికించి దింపేయాలి ● తాజా క్రీమ్‌తో గార్నిష్ చేసి అందించాలి.



## స్వీట్ కార్న్ పొంగడాలు

**కావలసినవి:** మొక్కజొన్న గింజలు – ఒక కప్పు; **జీలకర్ర** – అర టేబుల్ స్పూను; **బొంబాయి రవ్వ** – అర కప్పు; **ఉప్పు** – తగినంత; **ఉల్లి తరుగు** – పావు కప్పు; **టొమాటో తరుగు** – పావు కప్పు; **తరిగిన పచ్చి మిర్చి** – 4; **కరివేపాకు** – 2 రెమ్మలు; **తినే సోడా** – చిటికెడు; **నూనె** – తగినంత.

**తయారీ:** ● మిక్సీలో మొక్కజొన్న గింజలు వేసి మెత్తగా చేసి ఒక బౌల్‌లోకి తీసుకోవాలి ● అర టేబుల్ స్పూను జీలకర్ర, అర కప్పు బొంబాయి రవ్వ జత చేసి బాగా కలపాలి ● ఉప్పు జత చేసి మరోమారు కలపాలి ● ఉల్లి తరుగు, టొమాటో తరుగు, పచ్చి మిర్చి తరుగు, కరివేపాకు జత చేయాలి ● కొద్దిగా తినేసోడా జత చేసి కలపాలి ● పొంగడాల స్టాండ్‌ని స్టౌ మీద ఉంచి వేడయ్యాక అన్ని గుంటలలో కొద్ది కొద్దిగా నూనె లేదా నెయ్యి వేయాలి ● కలిపి ఉంచుకున్న పిండిని పెద్ద స్పూనుతో తీసుకుని అన్ని గుంటలలో వేయాలి ● కొద్దిసేపయ్యాక వెనుకవైపుకి తిరగేయాలి ● రెండో వైపు కూడా బంగారు రంగులోకి వచ్చేవరకు ఉంచి పేపర్ న్యాప్‌కిన్ మీదకు తీసుకోవాలి ● టొమాటో సాస్‌తో కలిపి తింటే రుచిగా ఉంటాయి.

ఫుడ్ ప్రింట్స్

**ఢిల్లీ జామా మసీదు ప్రాంతంలో వంటకాల రుచులు...**
**మొఘులు చక్రవర్తులకు రుచికరమైన వంటలు వండారు కరీమ్...**
**బహదూర్ షా జఫర్ తరువాత జీవనం కోసం పోరాడారు...**
**కరీమ్ మొఘలాయి వంటకాలతో వ్యాపారం ప్రారంభించారు...**
**అతి కొద్దికాలంలోనే అందరినీ ఆకర్షించారు...**
**నాలుగో తరం వారు నేటికీ ఈ వంటలను రుచికరంగా అందిస్తున్నారు...**
**ఒకటిన్నర శతాబ్దాలుగా అవే మొఘలాయి ఘుమఘుమలు...**
**కరీమ్ జీవన ప్రయాణమే ఈ వారం ఫుడ్ ప్రింట్స్...**

# ఢిల్లీ కరీమ్స్



● కరీమ్స్ హోటల్

మొఘల్ చక్రవర్తి బహదూర్‌షా జఫర్ ఆస్థానంలో మహమ్మద్ అజీజ్ అనే చెఫ్ ఉండేవాడు. ఆయన వారసులు 150 సంవత్సరాల తరవాత కూడా మొఘలాయి వంటకాల సామ్రాజ్యానికి డాన్ అవుతారని ఆయన అస్సలు ఊహించి ఉండడు. 1857 సిపాయిల తిరుగుబాటు తరవాత అజీజ్ ఢిల్లీ వెళ్లి, ఘజియాబాద్‌లో స్థిరపడిపోయాడు. రకరకాల ఉద్యోగాలు చేశాడు. ఏవీ ఉపయోగపడలేదు. తన కుమారుడు హాజీ కరీముద్దీన్‌కు మొఘల్ క్విజీన్ కిటుకులు వివరించాడు. తండ్రి చెప్పిన మాటలను అర్థం చేసుకున్నాడు. ఆయన చెప్పిన మాటలతో తన బాట ఏర్పరచుకున్నాడు. నేటికీ అదే బాటలో నడుస్తున్నారు.

### ఢిల్లీ వచ్చి...

1911లో కరీముద్దీన్ ఢిల్లీ వచ్చి, ఒక ఫుడ్ స్టాల్ ప్రారంభించాడు. రెండేళ్లు తిరగకుండా, సొంత రెస్టారెంటు ప్రారంభించాడు. జామా మసీదు గేట్ నెంబరు ఒకటి దగ్గర అదే రెస్టారెంటును కరీమ్స్ పేరుతో ఇప్పటికీ నడుపుతున్నారు. ఈ రెస్టారెంటుకి నాలుగు తరాల చరిత్ర ఉంది. వంటకానికి రుచిని తీసుకువచ్చే మసాలా స్వయంగా తయారుచేసుకుంటున్నారు. ఈ మసాలా రుచి నేటికీ సీక్రెట్‌గానే ఉండిపోయింది. కరీమ్స్‌లో మటన్, చికెన్ వంటకాలతో పాటు కబాబ్‌లు, రోల్స్ తయారుచేస్తున్నారు. పెద్ద పెద్ద రాగిపాత్రలలో తయారవుతున్న వంటకాల ఘుమఘుమలు ఫుడ్‌లవర్స్‌ని పట్టి లాగేస్తాయి.

### మొఘలుల ఆస్థానంలో...

హాజీ కరీముద్దీన్ తండ్రి ముహమ్మద్ అజీజ్ లాల్ కిలాలో మొఘలుల ఆస్థానంలో పనిచేసేవాడు. 1857 తిరుగుబాటు అనంతరం మొఘలుల చిట్టచివరి చక్రవర్తిని బ్రిటిషువారు బంధించడంతో, కరీముద్దీన్ తండ్రి ఘజియాబాద్‌కి తరలి వచ్చాడు. జీవనం కోసం ఎంతో కష్టపడ్డాడు. కాని ఆర్థికంగా బాగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మొఘలాయి వంటకాలను తయారు చేసే విధానం నేర్చుకోవడం వల్ల భవిష్యత్తు బాగుంటుందని తన పిల్లలకు ఎంతో దార్శనికతతో చెప్పాడు హాజీ. 'ఇది మా ప్రత్యేక విధానం' అంటారు జోహారుద్దీన్.

### దర్బారు నిర్మాణం...

'ఆ రోజుల్లో బయటి తిండి తినడమంటే చాలా నామోషీగా భావించేవారని మా తాతయ్య చెప్పేవారు' అంటారు జైనుద్దీన్. కరీమ్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కరీముద్దీన్‌కి ఈయన మునిమనవడు. ''మీ ఇంట్లో అమ్మ, అక్క ఎవరూ లేరా? మీ ఇంట్లో వంట చేయరా, బయట తింటున్నారా?' అని ప్రశ్నించేవారని ఆయన చెప్పారు. ఆ రోజుల్లో దర్బారు నిర్మాణం కోసం చాలా కుటుంబాలను దూరప్రాంతాల నుంచి ఢిల్లీకి తీసుకువచ్చారు. ఇందులో చాలామంది విదేశీయులు. వారికి వంట చేసుకునే అవకాశం ఉండేది కాదు. అందువలన కరీమ్‌కి మంచి వ్యాపారం దొరికింది. అలా ఫాస్ట్,



● కరీమ్స్‌లో వంట తయారీ

దాల్ తయారుచేసి అమ్మడం ప్రారంభించాడు. చాలా త్వరగా ఆ ప్రాంతంలో సొంతంగా ఒక రెస్టారెంట్‌ను ప్రారంభించే స్థాయికి ఎదిగాడు. జామా మసీదుకి కొద్దిదూరంలో ప్రారంభమైన కరీమ్స్, అనతి కాలంలోనే జామా మసీదు దగ్గరకు మారింది.

### మటన్‌తో రుచిగా...



● ఖీర్

ప్రారంభించిన తొలినాళ్లలో మధ్యాహ్నం నుంచి రాత్రి పది గంటల వరకు రెస్టారెంట్ తెరిచి ఉండేది. కస్టమర్లు ఎక్కువగా ఉంటే, రాత్రి మరింత ఎక్కువ సేపు ఉండేవాడు. పండుగల సందర్భంలో తెల్లవార్లు తెరిచి ఉంచేవాడు. ఉదయం వేళలో షాపింగ్ చేసేవాడు. మటన్ ముక్కలను స్వయంగా దగ్గరుండి కొట్టించుకుని, తెచ్చుకునేవాడు. అందులోకి కావలసిన వస్తువులను కూడా స్వయంగా ఎంచుకుని తెచ్చేవాడు. అల్పాహారం కూడా ప్రారంభిస్తే, మంచి లాభాలు వస్తాయని భావించి, ఉదయం ఎనిమిది గంటల నుంచి బ్రేక్‌ఫాస్ట్ సప్లయి మొదలుపెట్టాడు. కూలివారు, ఉద్యోగస్థులు, వారి వారి పనుల్లోకి వెళ్లడానికి ముందు ఇక్కడ అల్పాహారం చేసేవారు. పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఒకరు నెలవారీ కార్డు కట్టేవారు. మెనూలో రోటీ, సబ్జీ, బిర్యానీ, ఘోష్ తప్పనిసరిగా ఉండేవి. అన్ని పదార్థాలను మటన్‌తో మాత్రమే చేసేవారు. బీఫ్‌తో వండేవారు కాదు. ఆయన దగ్గరకు వచ్చే వారిలో ఎక్కువమంది హిందువులు కావడమే ఇందుకు కారణం.

### నాటి రాష్ట్రపతి చేతుల మీదుగా...

మసాలా నూరడం దగ్గర నుంచి కరీమ్ అవలంబించిన పద్ధతినే నేటికీ అనుసరిస్తున్నారు. ఆ కుటుంబ సభ్యులకు మాత్రమే వారి వ్యాపారానికి సంబంధించిన రహస్యాలు తెలుసు. నిజాముద్దీన్‌లో 1960లో కరీమ్ మొట్టమొదటి బ్రాంచ్ ఓపెన్ చేశారు. నాటి భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఈ స్టాల్‌ను ప్రారంభించారు. ఆయనకు ఈ వంటకాలంటే చాలా ఇష్టం. రాష్ట్రపతి భవన్‌కు సంబంధించి అప్పుడప్పుడు వీరికి ఆర్డర్లు ఇచ్చేవారు. ఎమర్జెన్సీ కాలంలో ఈ బ్రాంచి ఉన్న ప్రాంతాన్ని సీజ్ చేశారు. ఎమర్జెన్సీ ఎత్తివేశాక మళ్లీ అక్కడకు వచ్చారు. వారి వారసులు మాత్రమే కరీమ్స్‌ను నడుపుతున్నారు. కుమార్తెలకు వంటకాల రహస్యాలను నేర్పలేదు. అత్తవారింటికి వెళ్లాక , ఈ రహస్యాలు బయటకు వెళ్లిపోతాయన్నది వీరి ఉద్దేశం. ఈ విషయంలో సంగీత విద్వాంసుల పద్ధతిని అనుసరించారు కరీమ్. నేటికీ జామా మసీదు దగ్గర ఒక వరుసలో నిలబడి ఆహారాన్ని తీసుకోవడం కన్నులపండుగలా అనిపిస్తుంది. సెలబ్రిటీలు కూడా వరుసలోనే నిలబడాలి కనుక, వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది.

### రుచికి ప్రాధాన్యత...

కరీముద్దీన్ కుమారుడు నూరుద్దీన్... నిహారీ, పాయా, గుర్దా కలేజీ, భేజాలను జత చేశాడు. ఇప్పుడు వీటిని 'క్విజీన్ ఆఫ్ ఓల్డ్ దిల్లీ' అంటున్నారు. బుర్ర కబాబ్ ఇప్పటికీ అందరినీ ఆకర్షిస్తోంది. నూరుద్దీన్ స్కూల్‌లో చదువుకున్నాక, కొంత కాలం కాలేజీ విద్య అభ్యసించారు. తండ్రి చిన్నతనం నుంచే రుచిగా వండటం నేర్పించారు. వంటకం రుచిగా లేకపోతే కస్టమర్లు రావడం తగ్గిపోతారని చాలాసార్లు చెప్పాడు. కరీముద్దీన్ నమ్మిన మొట్టమొదటి సూత్రం ఇదే. అందుకే నేటికీ ఇక్కడకు వచ్చేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఢిల్లీలో వీరికి మరో రెండు బ్రాంచీలు ప్రారంభమయ్యాయి. 1948 జనవరి 26న, కరీమ్ వెయ్యి రూపాయలు సంపాదించాడు. మనవలందరికీ తలో రూపాయి బహుమతిగా ఇచ్చారు.

సినిమా

# అదృష్టం వచ్చేలోపే ఆపద



● మోనల్, రమాకాంత్, సిమర్

రమాకాంత్ హీరోగా మోనల్, సిమర్ హీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 'సముద్రుడు'. కీర్తన ప్రొడక్షన్స్ పతాకంపై బాదావత్ కిషన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు నగేష్ నారదాశి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీరామోజీ జ్ఞానేశ్వర్, పి. రామారావు, సోములు సహ–నిర్మాతలు. ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. దర్శకుడు రమేష్ వర్మ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు సముద్ర గౌరవ దర్శకత్వం వహించగా నిర్మాత ముత్యాల రామదాసు కెమెరా స్విచ్చాన్ చేశారు. మల్టీడైమెన్షన్ వాసు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు నగేష్ మాట్లాడుతూ– ''ప్రాణాలతో నిత్యం చెలగాటాలాడుతూ కష్టాలు అనుభవిస్తున్న జాలర్లకు అదృష్టం రాబోయే సమయంలో ఓ ఆపద వస్తుంది. ఆ తర్వాత జరిగే పరిణామాలతో సినిమా సాగుతుంది'' అని అన్నారు. ''అన్ని రకాల ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమా చేస్తున్నాం. స్క్రిప్ట్ కోసం నగేష్ ఆరునెలలు కష్టపడ్డారు'' అన్నారు రమాకాంత్. ''ఇదివరకు నగేష్‌తో 'శ్రీసత్యన్నారాయణ వ్రతం' అనే సినిమా చేశాను. ఈ సినిమాలో పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నా'' అన్నారు సుమన్. ''ఎన్‌ఆర్‌ఐ పాత్ర చేస్తున్నా'' అన్నారు మోనల్. ''టీచర్ రోల్‌లో కనిపిస్తా'' అన్నారు సిమర్.



● విజయ్



● 'బిగిల్' ఉంగరం

# కే'రింగ్'

విజయ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'బిగిల్' (విజిల్ అని అర్థం). ఫీమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్స్ కథాంశంతో అట్లీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడీ చిత్రబృందం విజయ్ అన్నకు విజిల్ కొట్టు అంటున్నారు. విజిల్ కొట్టే పని ఏం చేశారు? అంటే.. ఈ సినిమా పూర్తి కావస్తున్న సందర్భంగా పని చేసిన చిత్రబృందానికి గోల్డ్ రింగ్స్‌ను బహుమతిగా అందించారట. ప్రతి సినిమా పూర్తయ్యే సందర్భంలో తన టీమ్‌లో అందరికీ బహుమతులు అందించడం విజయ్ అలవాటు. అలా ఈసారి బిగిల్ టీమ్ అందరికీ 'బిగిల్' అని రాసి ఉన్న ఉంగరాలను అందించారు విజయ్. కొందరికి ఆటోగ్రాఫ్ చేసిన ఫుట్‌బాల్‌ను కూడా బహూకరించారు. తమ హీరో తమ పట్ల చూపించిన కే–రింగ్ చూసి విజయ్‌ని 'గోల్డెన్ స్టార్' అంటున్నారు 'బిగిల్' యూనిట్.

## తుల
**(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)**

LIBRA

గ్రహాలన్నీ ఒకచోట చేరి మీకు ఏ తీరు శుభాన్ని కలిగించాలా? అని చర్చించుకుంటూన్నట్లుగా గోచార స్థితి ఉన్న కారణంగానూ ఒక్క శుక్రుడు మాత్రమే సందేహాస్పద దృష్టితో ఉన్న కారణంగానూ వ్యవసాయదారులైన వారికి పరిస్థితి మరింత ఆశాజనకంగా ఉండి లోగడ లాభం అంతంత మాత్రమనుకున్న పరిస్థితి పోయి ఆశాజనకంగా ఉంటుంది. చక్కటి దిగుబడి వస్తుంది. సాహిత్య పండితులకీ, విజ్ఞాన రంగం వారికీ, ముఖ్యంగా సంగీత శాస్త్రజ్ఞులకీ మంచి గుర్తింపూ గౌరవమూ ఉండచ్చు. వైద్య న్యాయశాస్త్ర కోవిదులకి ఆదాయం మరింతగా ఉండదేమోగాని బాగానే ఉంటుంది. విశేషించి తమ తమ వృత్తుల పట్ల ఆదరణ బాగా ఉంటుంది. కొందరైతే తాము చేసే వృత్తి పట్ల నిరాదర భావంతో ఉంటారు గాని ఈ రాశివారికి మంచి ప్రోత్సాహకరంగా ఉంటుంది వృత్తి. ఎంత జాగ్రత్తల్ని తీసుకున్నా అనారోగ్యం మాత్రం తప్పక పోవచ్చును. కాబట్టి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తని పాటిస్తున్నా ఔషధ సేవని అవసరమైనంత వరకూ చేయడమే మంచిది. రోజుకోచోట వైద్యం కానిపక్షంలో సత్ఫలితాలు లభించవచ్చు. ముఖ్యంగా కోపం, దుడుకు ప్రవర్తనం... అనే వీటిని అదుపు చేసుకోగలిగితే శరీరంలో రజస్తమోగుణాల అదుపు కారణంగా రక్త ప్రసరణలో మార్పు కలిగి ఆరోగ్యం బాగుంటుందంటుంది శాస్త్రం. మీ కుటుంబ విషయాలని కావాలని అడిగి తెలుసుకుని ఎన్నెన్నో సూచనలు, సలహాలు, తీర్పులు, న్యాయాన్యాయాలు గురించి చర్చించాలని ఎవరైనా ఉత్సాహపడుతుంటే వాళ్లకి విషం అర్థమయ్యీ కాకుండా ఉండేలా చెప్పి వాళ్లకి వాళ్లు విరమించుకునేలా లౌక్యంగా వ్యవహరించడం ఉత్తమం తప్ప పూర్తి వివరాల్ని అవగాహనమయ్యేలా చెప్పడం సరికాదు. వాళ్లు కార్యసాధనకి తోడ్పడేవాళ్లు కాదు. కేవలం శ్రోతలు మాత్రమే.
**లౌకిక పరిహారం:** ఆరోగ్య రక్షణ కోసం ఆవేశం వద్దు. తేలికపాటి ఔషధ సేవ మంచిది.
**అలౌకిక పరిహారం:** శ్రావణ మంగళవారం నాడు కుంకుమ భరిణని ముత్తైదువుకి బహూకరించండి.

## ధనుస్సు
**(నవంబర్ 22 - డిసెంబర్ 21)**

SAGITTARIUS

'నేను ఉన్నదున్నట్లుగా మాట్లాడతాను. అది నాకు నా చిన్నప్పటి నుండీ వచ్చిన అలవాటు' అనుకుంటూ ఆ మాటనే వల్లించుకుంటూ ఉండకండి. కలియుగంలో ఏ మాటని మాట్లాడినా సూటిగా గుచ్చుకునేదిగా ఉన్నట్లయితే – అది ధర్మమే కావచ్చు. కచ్చితంగా ఒక్కొక్కరు చొప్పున శత్రువుల సంఖ్యని మీరు పెంచుకుంటూ వెళ్తున్నట్లే. మాట మెత్తగా వినయంగా ఉండాలి. ఎదుటివారికి గట్టిగా అర్థం కావాలి. ఆ తీరుని అభ్యాసం చేయండి. కొనదలిచిన భూ గృహ స్థలాల వంటివి ఒకవేళ వాయిదాపడినా చిన్న చిన్న పేచీలకి గురి అయినా కంగారుపడకండి. ఒకవైపు ఎండపడుతూంటే ఆ ఎండలో నడుస్తున్నప్పుడు ఒక చెంప వేడిగా ఉన్నట్టూ మరో చెంప మామూలుగా ఉన్నట్టూ ఎలా ఉంటుందో ఆ తీరుగా అలాంటి గొప్ప ఆస్తి సమీకరణమనేది ఆనందాన్నీ – ఇటువంటి ఇబ్బందులు మనోవ్యథనీ కల్గిస్తాయి తాత్కాలికంగా. దిగులు పడకండి. ఆ వస్తువు మీదే అవుతుంది. తల్లిదండ్రులు పెద్దవాళ్లై వీలునామా గాని రాసే అవకాశముంది. అందరూ సమావేశమైన వేళ అందరి అభిప్రాయాలనీ విన్నాక మీ అభిప్రాయాన్ని – ధర్మబద్ధంగా మాత్రమే వెల్లడించండి తప్ప మీకు మీరుగా దూసుకుపోతూ కుండపగులగొట్టినట్టు మాట్లాడేసి ఇబ్బందిని తెచ్చుకోకండి. తోబుట్టువులందరి దృష్టిలో మీవల్ల ఈ పని అడ్డం తిరిగిందనే నిందకి పాల్పడకండి. ఎప్పటినుండో మీకు మాత్రమే ఇవ్వాలని దాచిన ఓ పిత్రార్జితం మీకు లభించవచ్చు. సంతోషకారణం కావచ్చు. రావలిసిన ద్రవ్యం విషయంలో బద్ధకించకండి. అన్యాయంగా రావచ్చుననిపించే దానికి ప్రయత్నమే చేయకండి. శని నడుస్తున్న కాలంలో ఎంత ధర్మబద్ధంగా మీరుంటే అంతటి శాంతీ మీకు సొంతం. అంతటా ఆనందమూ మీకు కరతలామలకం.
**లౌకికపరిహారం:** అధర్మార్జనవైపుకి వెళ్లకండి. వ్యాపారం కూడ ధర్మబద్ధంగానే చేయండి.
**అలౌకిక పరిహారం:** శ్రావణమంగళవారంనాడు దధ్యోదనాన్ని ముత్తైదువుకి వాయనంగా సమర్పించండి.

## కుంభం
**(జనవరి 20 - ఫిబ్రవరి 18)**

AQUARIUS

'ఆరోగ్యమే మహాభాగ్య'మని బాగా తెలుసుకున్న మీరు శారీరక ఆరోగ్యం పట్ల అనేక విధాల జాగ్రతలని పాటిస్తూ, ఆ ఆరోగ్య కారణంగా బుద్ధిపరమైన నిర్ణయాలని చక్కగా చేయగలుగుతారు. మానసికంగా దృఢంగా ఉంటారు కూడ. ఏదైనా సమస్య వచ్చినా – అవలీలగా విజయాన్ని సాధించుకుంటారు. కుజ బుధుల అనుకూలత కారణంగా కొత్త వ్యాపారాన్ని ప్రారంభించే అవకాశం కలగచ్చు. అంతే కాక ఆ వ్యాపార ప్రారంభానికి సరిపడిన సహాయసహకారాలు కూడ లభించవచ్చు. మేఘం నుండి పడుతుందో పడదో తెలియని వర్షాన్ని నమ్ముకోవడం కంటె పక్కింటి నుండి నూతినీటిని తెచ్చుకోవడం సరైన పని అన్నట్టుగా వ్యాపారాన్ని సంబంధించిన సాధ్యాసాధ్యాలని ఎప్పుడో కాకుండా ఇప్పటి నుండీ తెలుసుకుంటూ ఉండడం అసవరం మంచిది కూడ. వ్యాపారాన్ని ప్రారంభించాక తెలుసుకోవడం అనేది మరో దృక్పథం, అవశ్యకర్తవ్యమున్నూ. విదేశాల్లో ఉండాలనీ అక్కడికే కుటుంబాన్ని పూర్తిగా తరలించేయడం ఉత్తమమనీ సంతానం బాగా పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక్కడ మీరు సర్వతంత్ర స్వతంత్రులు. అక్కడ అలాటి స్థాయి మీకు ఉండకపోవచ్చు. ఎంతవరకూ విదేశ నివాసం మంచిదో ఆ విషయాన్ని గురించి బాగా ఆలోచించుకోండి. ఒక చోట కూర్చుని భార్య/ భర్తతో లోతుగా సంప్రదిస్తూ జ్యోతిశ్శాస్త్రపరంగానైతే ఆ నిర్ణయం అంత సముచితం కాదు మరి. పారిశ్రామిక రంగాల వారు వాహనాలు యంత్రపరికరాలూ ముఖ్యంగా విద్యుత్ వినియోగ వస్తువుల విషయంలో తగిన భద్రతా నియమాలని పాటించడం, ప్రయాణాల్లో వస్తు జాగ్రతని తీసుకోవడం అవసరం కూడ.
**లౌకిక పరిహారం:** విదేశనివాసం గురించి కూలంకషంగా ఆలోచించండి.
**అలౌకిక పరిహారం:** శ్రావణ మంగళవారం నాడు ముత్తైదువుకి పాయసాన్ని ఇచ్చి ఆశీస్సులు అందుకోండి.

## వృశ్చికం
**(అక్టోబర్ 23 - నవంబర్ 21)**

SCORPIO

వివాహానికి ఏర్పాట్లన్నీ దాదాపుగా సిద్ధం అయిన వేళ లేదా ఎప్పటినుంచో ఎదురుచూసిన భూమి కొనుగోలుకి అంతా సమకూరిన వేళ లేదా గృహ ప్రవేశం.. ఇలా శుభకార్యానికి అంతా సవ్యంగా ఉందనుకున్నవేళ ఆ శుభకార్యక్రమం ఏదో కారణంగా వాయిదా పడే సూచన కనిపిస్తోంది కాబట్టి దానికి సంబంధించిన ముందు వెనకల్ని స్థిరమైన అవగాహనతోనూ స్పష్టమైన నిర్ణయాలతోనూ దృఢం చేసుకోండి. ఏ ఇబ్బందీ రాదు. దాదాపు 6 సంవత్సరాలుగా మానసికంగా బలహీనతతోనే ఉంటున్న కారణంగా తీర్థయాత్రలకీ పుణ్యస్నానాలకీ దైవదర్శనాలకీ వెళ్లాలని అనిపించవచ్చు. అయితే పదిమందితో గాని వెళ్లినట్లయితే ఆ తీర్థయాత్ర వినోద విహార యాత్రగా మారే అవకాశముంది కాబట్టి వీలైతే ఏకాంతంగానూ లేదా ఆస్తిక భావనలతో ఉండే వారితో కలిసి వెళ్లడం వల్ల దైవదర్శన యాత్ర సఫలమవుతుంది. జపం ధ్యానం చేసుకుంటూ పుణ్యాన్ని సాధించుకోగలుగుతారు. ఉద్యోగరీత్యా భార్య/ భర్త దూరంగా ఉన్నప్పటికీ ప్రతికూల బుద్ధితో దూరంగా ఉన్నప్పటికీ – లోపలున్న సౌహార్ధం కారణంగా శ్రావణంలో ఏదో ఒక వస్త్ర– స్వర్ణ బహుమానాలని ఈయాలనే ఆలోచన ఉంటుంది. అవకాశం చేసుకుని పంపండి. పరిస్థితిలో మార్పు కనిపిస్తుంది. న్యాయస్థాన అభియోగాలు గాని ఉంటే ప్రస్తుత కాలంలో అనుకూలమైన తీర్పు లభించకపోవచ్చు. అయితే దాని ప్రభావం వల్ల ఇబ్బందులుండకపోవచ్చు గాని కొంత మానసిక నిరుత్సాహం కలగచ్చు. సంతానాన్ని చూసే అవకాశం లభించకపోవచ్చు ఎదుటివారి పట్టుదల కారణంగా. లేదా ఏదో కొంతసేపు గడిపే అవకాశం మాత్రమే కలగచ్చు. అలా దర్శించడం తాకట్టులో ఉన్న బంగారాన్ని చూసినట్లే అనిపించవచ్చు.
**లౌకిక పరిహారం:** శత్రువులో పట్టు ఏమాత్రమూ సడలదు. జాగ్రత్త అవసరం.
**అలౌకిక పరిహారం:** శ్రావణ మంగళవారం నాడు ముత్తైదువుకి కొబ్బరి బొండాన్నిచ్చి ఆశీస్సులందుకోండి.

## మకరం
**(డిసెంబర్ 22 - జనవరి 19)**

CAPRICORN

చేస్తున్న ఉద్యోగాన్ని యథాలాపంగానూ ఇష్టారాజ్యంగానూ కాకుండా నిబద్ధతతో చేయని పక్షంలో ఉద్యోగపరమైన ఇబ్బందుల్ని తోటి ఉద్యోగులు కల్గించవచ్చు. మీ మీద నేరాలని పై అధికారిదృష్టికి రాతపూర్వకంగా కూడ చేర్చవచ్చు. ఉద్యోగాన్ని క్రమశిక్షణతో నిర్వహించుకోవడం మంచిది! కుజుడు 8వ ఇంట ఉండే కారణంగా తేలికగా కన్పించిన అనారోగ్యం – సూదితో వస్త్రాలదొంతర మీద గుచ్చుతుంటే తెలియకుండా అది లోలోతుగా వెళ్లిపోతున్నట్లు – క్రమంగా పెరుగుతూ వెళ్లచ్చు కాబట్టి అనారోగ్యం అన్పించగానే అశ్రద్ధ చేయకండి. నివారణకి అవకాశముంది. ఔషధసేవ లేకుండా బయటపడిపోతారు. ఇతరుల మీద విమర్శలనీ చాడీలని వారి పరోక్షంగా వారి పట్ల మీకున్న అభిప్రాయాలనీ.. ఇలా ఏమీ వెల్లడించకండి. బుధ శుక్రులు అననుకూలురుగా ఉన్న కారణంగా తేలికగానూ పరిహాసాస్పదంగానూ వేళాకోళం కోసం మనం మాట్లాడిన మాటలు రకరకాలుగా మారి చేరరాని వాళ్ల వద్దకి వెళ్లే అవకాశముంది కాబట్టి సంయమనంతో ఉండండి. ముఖ్యంగా ఇతరుల గురించి మాటల విషయంలో. వంటకి అన్నీ సిద్ధం చేసుకుని నలభీమపాకాన్ని సిద్ధం చేయదలిచి ఉన్న వేళ పొయ్యిలో ఇంధనం గాని లేని పక్షంలో ఎలా ఉత్సాహమంతా ఆవిరైపోతుందో అలా పిల్లలకి సత్ఫలితాలు లభించినా ప్రవేశాలు మరింత ఆలస్యమౌతూ తాత్కాలిక నిరుత్సాహానికి మిమ్మల్ని గురి చేయచ్చు. కళాశాలా ప్రవేశమంటూ నిశ్చయమైతే ఎక్కడుండాలి? కుటుంబాన్ని ఎక్కడికి మార్చాలి? వంటివన్నీ నిర్ణయించుకోవచ్చు కదా! ఆ నిర్ణయం ఆలస్యం కావచ్చు. మానసికంగా దృఢంగా ఉండండి. ఇబ్బంది రాదు,
**లౌకిక పరిహారం:** ఉద్యోగాన్ని శ్రద్ధగా చేయండి. దేనికీ నిరుత్సాహపడకండి.
**అలౌకిక పరిహారం:** శ్రావణమంగళవారం నాడు ముత్తైదువుకి పుష్పమాలని బహుకరించి పాదాభివందనం చేయండి.

## మీనం
**(ఫిబ్రవరి 19 - మార్చి 20)**

PISCES

గురుగ్రహం శుభదృష్టి కారణంగా అనుకున్న తీరుగా వివాహాది శుభకార్యాలు అవాంతరాల్లేకుండా జరిగిపోతాయి. దీని కారణంగా మీ మీద దృష్టి దోషం (నరఘోష) ఉండచ్చు. మీకు జరిగిన, జరుగుతున్న విజయాలనీ శుభాలనీ అలా చెప్పేసుకుంటూ ఎదుటివారికి అసూయని పెరిగేలా చేసుకోకండి. గృహాలకి మరమ్మతులు చేపట్టే అవకాశముంది. ఆర్థికంగా ఓ ప్రణాళికని వేసుకుని దానికి మించకుండా వెళ్లడం వల్ల ఇబ్బంది రాదు. రుణాన్ని తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురు కాదు. వ్యవహారాల్లో కచ్చితంగా ఉండడం మంచిది తప్ప చూసీ చూడనట్లూ, ఎలాగైనా పరవాలేదన్నట్లూ ఉండద్దు. వృత్తీ వ్యాపారాల ఆదాయం నష్టాలు లేకుండా, ఆశించినంత లాభం లేకుండా ఉంటుంది. ఉన్న వ్యాపారపు సరుకుని వదిలించుకునే ప్రయత్నం మంచిది తప్ప ధర పెరగచ్చు గదా! అనే ఆలోచనతో నిలవ చేయడమనేది సరైన పని కాదు. సంతానం ఇంకా విద్యార్థి దశలో గాని ఉంటే వాళ్ల దృష్టి పూర్తి ఆధ్యాత్మికం వైపుకి గాని ప్రధాన విద్యకంటె వేరైన క్రీడలూ సంగీతం వాద్యపరికరాలూ చిత్రలేఖనం వంటివాటి మీదికి గాని వెళ్లే అవకాశముంది కాబట్టి, విద్యార్థులు మీ వద్దే ఉంటే గమనించుకోండి. పొరుగు ప్రాంతంలో ఉంటే హఠాత్తుగా వెళ్లి విషయాన్ని అర్థం చేసుకోండి. ఈ రాశి వారిలో వ్యాపారదృష్టి ఉండే అవకాశమున్న కారణంగా వ్యాపారదృష్టి ప్రస్తుతానికి సరికాదనే విషయాన్ని బాగా అర్థమయ్యేలా చెప్పి ఒప్పించండి. న్యాయస్థానంలో ఏవైనా సమస్యలుంటే రాజీమార్గాన్ని ఆశ్రయించి సరిచేసుకునే ప్రయత్నం చేసుకోండి. లేని పక్షంలో మీ వ్యక్తిగత కార్యాలన్నిటికీ ఈ రాకపోకలు అటు ధనపరంగానూ అటు సహాయపరంగానూ నష్టపరుస్తాయని గమనించండి.
**లౌకిక పరిహారం:** విద్యార్థుల్లో విద్యేతరదృష్టీ వ్యాపార దృష్టీ రాకుండా చూసుకోండి.
**అలౌకిక పరిహారం:** శ్రావణమంగళవారం ముత్తైదువులకి పులిహోరనిచ్చి పాదాభివందనం చేసి రండి.

# తొలి పరిచయం

తెలుగు, తమిళం, కన్నడం, హిందీ ఇండస్ట్రీల్లో సినిమాలు చేసి మంచి ఫాలోయింగ్ ఏర్పరచుకున్నారు తమన్నా. నార్త్ టు సౌత్ తమన్నా అందరికీ పరిచయం. కానీ ఇప్పుడు మలయాళ ఇండస్ట్రీకి తొలి పరిచయం కాబోతున్నారు. పద్నాలుగేళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్న తమన్నా తొలిసారి మలయాళంలో స్ట్రయిట్ మూవీ చేస్తున్నారు. గతంలో డబ్బింగ్ సినిమాల ద్వారా మలయాళంలో కనిపించారామె. ఇప్పుడు తొలి స్ట్రయిట్ సినిమాతోనే ప్రేక్షకులను భయపెడతానంటున్నారు. 'సెంట్రల్ జైలిలే ప్రేతం' (సెంట్రల్ జైల్లో దెయ్యం అని తెలుగు అర్థం) అనే హారర్ సినిమాలో లీడ్ రోల్ చేస్తున్నారు తమన్నా. కథ మొత్తం ఓ సెంట్రల్ జైల్, అందులో ఉండే దెయ్యాల చుట్టూ తిరుగుతుందట. ఇందులో మలయాళ, తమిళ స్టార్స్ యాక్ట్ చేయనున్నారు. సంధ్యా మీనన్ దర్శకురాలు.


● తమన్నా

# వారికి శేష్ ఒక ఉదాహరణ

**- 'దిల్' రాజు**

''ఇండస్ట్రీలో మాకు బ్యాక్‌గ్రౌండ్ లేదు. మమ్మల్ని ఎవరు చూసుకుంటారు' అని చాలామంది అంటుంటారు. వారందరికీ అడివి శేష్ ఒక ఉదాహరణ. ప్రతిభ ఉండి కష్టపడితే మంచి ఫలితం ఉంటుంది'' అన్నారు నిర్మాత 'దిల్'రాజు. అడివి శేష్, రెజీనా, నవీన్‌చంద్ర ముఖ్య తారాగణంగా వెంకట్ రామ్‌జీ దర్శకత్వంలో పీవీపీ పతాకంపై పెరల్ వి. పొట్లూరి, పరమ్ వి. పొట్లూరి, కెవిన్ అన్నే నిర్మించిన చిత్రం 'ఎవరు'. ఈ సినిమా ఈ నెల 15న విడుదలైంది. మంచి టాక్‌తో ప్రదర్శించబడుతోందని చిత్రబృందం చెబుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో 'దిల్' రాజు మాట్లాడుతూ–''ఒక స్టోరీ ఎలా ఉంది? ఏంటి? అంటే నేను చెప్పగలను కానీ ఇలాంటి ట్విస్ట్‌లతో కూడుకున్న సినిమాను నేను సరిగ్గా జడ్జ్ చేయలేను. 'ఎవరు' సినిమా చూశాను. పాటలు, ఫైట్స్ లేవు. వరుస ట్విస్ట్‌లతో ఆడియన్స్‌ను థియేటర్‌లో కూర్చోబెట్టారు. ఇటీవల ఇలాంటి సినిమా తెలుగులో రాలేదు. ఈ సినిమాను నైజాంలో డిస్ట్రిబ్యూట్ చేసినందుకు హ్యాపీ. అడివి శేష్‌ని క్యారెక్టర్ ఆర్టిస్టు అనాలా? లేక హీరో అనాలా?.. డైరెక్టర్ రామ్‌జీ యాక్టర్ అనమంటున్నారు. 'క్షణం', 'గూఢచారి' ఇప్పుడు 'ఎవరు' వంటి సినిమాలతో శేష్ యాక్టర్‌గా ఎదుగుతున్నాడు. మా బ్యానర్‌లో సినిమా చేయమని అడిగాను. రెజీనా, నవీన్‌చంద్ర బాగా నటించారు. 'నేను లోకల్' సినిమా సమయంలో నవీన్‌చంద్రకు హీరోగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా ట్రై చేయమని చెప్పాను. అతను బాగా చేస్తున్నారు. చాలా మంది హీరోలకు ఇలా చెబితే ..'రాజుగారి ఏంటీ ఇలా చెబుతారు.. హీరోగా చేయమని ఎంకరేజ్ చేయాలి కదా' అనుకుంటారు. ఏళ్ల తరబడి హీరోలుగా చేసిన వారు కూడా ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయాల్సిందే. క్యారెక్టర్ ఆర్టిస్టు ఎప్పుడూ ఉంటాడు. నా మిత్రుడు పీవీపీ బ్యానర్‌లో మరో మంచి సినిమా వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అని అన్నారు.


● అడివి శేష్, రెజీనా, 'దిల్' రాజు, వెంకట్ రామ్‌జీ, నవీన్ చంద్ర

''సినిమా విజయం సాధించడంతో మంచి హ్యాపీ మూడ్‌లో ఉన్నాను. చాలాకాలం తర్వాత హాయిగా ఎనిమిది గంటలు నిద్రపోయాను. 'దిల్' రాజుగారి 'ఎవడు' సినిమాలో మెయిన్ విలన్‌గా చేయడానికి అప్పట్లో ప్రయత్నించాను. కుదర్లేదు. బహుశా.. నేను అప్పటికీ ఆ స్థాయిలో లేనేమో. ఇప్పుడు 'దిల్' రాజుగారు 'ఎవరు' సినిమా చూసి అభినందించడం మరిచిపోలేను. సినిమా చూసి మా బ్యానర్‌లో ఎప్పుడు సినిమా చేస్తున్నావ్? అన్నారు. హ్యాపీ ఫీలయ్యాను. కలెక్షన్స్ గురించి మాట్లాడను. కానీ 'గూఢచారి' కంటే ఎక్కువ కలెక్షన్స్ వచ్చాయని చెప్పగలను'' అన్నారు అడివి శేష్. '''అరవిందసమేత..'లో చేసిన బాల్ రెడ్డి పాత్రలానే 'ఎవరు'లో నేను చేసిన అశోక్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. హీరోగానే కాదు.. క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ ట్రై చేయమన్న 'దిల్' రాజుగారి సలహాను పాటిస్తూనే ఉంటాను'' అన్నారు నవీన్‌చంద్ర. ''ఇది సమిష్టి విజయం'' అన్నారు వెంకట్ రామ్‌జీ. ''సక్సెస్‌ను అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్ అన్నారు మురళీ శర్మ. ''ఈ సినిమాకు, నేను చేసిన సమీర పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. సింగిల్ స్క్రీన్‌కి వెళ్లి చూశాం. ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమాలోని ట్విస్ట్‌లను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి చూడబోయేవారి ఆసక్తిని తగ్గించవద్దు. వారు కూడా సినిమాను థియేటర్‌లో ఎంజాయ్ చేయాలి'' అన్నారు రెజీనా.


● సుధీర్ వర్మ, శర్వానంద్, పీడీవీ ప్రసాద్

# నాకు నేను నచ్చాను

**- శర్వానంద్**

''రణరంగం' విడుదలైన తొలిరోజు మార్నింగ్ షోకి డివైడ్ టాక్ వినిపిస్తోందన్నారు. మ్యాట్నీ షోకి యావరేజ్ అన్నారు. సెకండ్ షో పడేసరికి ఎబౌ యావరేజ్ అనే టాక్ వచ్చింది. ముందు ముందు మరింత పాజిటివ్ టాక్‌తో ఈ సినిమా ప్రేక్షకులకు ఇంకా చేరువ అవుతుందని నమ్ముతున్నాను'' అని శర్వానంద్ అన్నారు. సుధీర్ వర్మ దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'రణరంగం'. కాజల్ అగర్వాల్, కల్యాణీ ప్రియదర్శన్ హీరోయిన్లుగా నటించారు. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా గత గురువారం విడుదలైంది. చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందన్న చిత్ర బృందం హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులకు ఒక స్క్రీన్‌ప్లే బేస్డ్ అండ్ ప్రాపర్ యాక్షన్ సినిమా ఇవ్వాలని 'రణరంగం' సినిమా చేశాను. ఈ విషయంలో 200 శాతం సక్సెస్ అయ్యాం. ఇటీవల తెలుగులో వచ్చిన మంచి క్వాలిటీ ఫిల్మ్‌గా 'రణరంగం' పేరును చెబుతుంటే హ్యాపీగా ఉంది. నా కెరీర్‌లో ఇలాంటి మాస్ పాత్ర చేయలేదు. నాకు నేను నచ్చాను. స్క్రీన్‌ప్లే బేస్డ్ పరంగా కొత్తగా ఉండే సినిమా ఇది. క్లైమాక్స్ అలా ఉండకపోతే రెగ్యులర్ సినిమాలా ఉండేది. సినిమాలో కల్యాణీకి, నాకు మంచి కెమిస్ట్రీ వర్కవుట్ అయింది. మా ఇద్దరి లవ్‌ట్రాక్ నా కెరీర్‌లోనే బెస్ట్. చిన్న పాత్ర అయినా చేసినందుకు కాజల్‌కి థ్యాంక్స్. కలెక్షన్స్ గురించి మాట్లాడను. ప్రేక్షకులు నాపై ఉంచిన నమ్మకానికి థ్యాంక్స్. రణరంగం నిర్మాతలకు థ్యాంక్స్'' అని అన్నారు. ''విడుదలకు ముందే ఇది శర్వానంద్ సినిమా అని చెప్పా. మంచి ఓపెనింగ్స్ రావడానికి శర్వానే కారణం. ఖర్చు విషయంలో నిర్మాతలు వెనకాడలేదు. ఓపెనింగ్ ట్రెండ్ ఇలానే కొనసాగితే నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ సక్సెస్‌గా ఈ చిత్రం నిలుస్తుంది'' అన్నారు సుధీర్ వర్మ. ''రాంగ్ ఫిగర్లు (వసూళ్లు) చెప్పడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాకు తెలుగురాష్ట్రాల్లో తొలి రోజు ఏడున్నర కోట్ల గ్రాస్ వచ్చింది. దాదాపు నాలుగున్నర కోట్ల షేర్ వచ్చింది. ఇలానే ప్రేక్షకాదరణ కొనసాగితే భవిష్యత్ కలెక్షన్స్ బాగుంటాయనుకుంటున్నాం. ఫ్యామిలీ సీన్స్‌కు మంచి రెస్పాన్స్ వస్తుందంటున్నారు'' అని పీడీవీ ప్రసాద్ అన్నారు. ''విజువల్స్ క్వాలిటీగా ఉన్నాయని మెచ్చుకుంటుంటే ఆనందంగా ఉంది'' అన్నారు దివాకర్ మణి. ''జెన్యూన్ ఎఫర్ట్ పెట్టి సినిమా చేశాం. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు రాజా.


● కీర్తి సురేష్, చిరంజీవి

# అభినేత్రికి అభినందనలు

'మహానటి'కి జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకున్న ఆనందంలో ఉన్నారు కీర్తీ సురేశ్. అందాల అభినేత్రి సావిత్రి పాత్రలో కీర్తి అద్భుతంగా ఒదిగిపోయారని ప్రత్యేకంగా చెప్పొచ్చు. అందుకే ఈ తరం అభినేత్రి అని ఆమెను చాలామంది కీర్తిస్తున్నారు. అందరి అభినందనలతో ఉత్సాహంగా ఉన్నారు కీర్తి. ఇటీవల చిరంజీవి కూడా తన అభినందనలతో పాటు కీర్తీ సురేశ్‌కు ఆశీస్సులు అందించారు. సైమా అవార్డ్స్ ఫంక్షన్‌కి అతిథిగా చిరంజీవి హాజరయ్యారు. సావిత్రిలా డ్రెస్ చేసుకుని కీర్తీ సురేశ్ ఈ అవార్డు వేడుకకు హాజరయ్యారు. అక్కడ చిరంజీవి అభినందనలు అందుకుంటున్న సమయంలో క్లిక్‌మన్న ఫోటో ఆకట్టుకునే విధంగా ఉంది.

**'సైరా'కు వాయిస్ ఓవర్**

చిరంజీవి నటించిన లేటెస్ట్ చిత్రం 'సైరా: నరసింహారెడ్డి'. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించారు. రామ్‌చరణ్ నిర్మించారు. ఈ సినిమా టీజర్ ఆగస్ట్ 20న రిలీజ్ కానుంది. ఈ టీజర్‌కు పవన్ కల్యాణ్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ''టీజర్‌కు వాయిస్ ఓవర్ అందించినందుకు థ్యాంక్యూ కల్యాణ్ బాబాయ్'' అని రామ్‌చరణ్ పేర్కొన్నారు.


● నరేశ్, విశ్వనాథ్, ఆది సాయికుమార్, శ్రద్ధా శ్రీనాథ్, విజయలక్ష్మి

# కొత్తగా ఉన్నావు అంటున్నారు

**- ఆది సాయికుమార్**

''నేను ఓ రియలిస్టిక్ ఫిల్మ్ చేయాలనుకుంటున్న టైమ్‌లో విశ్వనాథ్ ఈ కథ గురించి చెప్పాడు. చాలా బాగుంది. మిమ్మల్ని ఈ సినిమాతో ఖచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తా అనే నమ్మకముంది'' అన్నారు హీరో ఆది సాయికుమార్. శ్రీనివాస్ గుర్రం సమర్పణలో విజయలక్ష్మి నిర్మించారు. విశ్వనాథ్ అరిగెల దర్శకుడు. ఆది సాయికుమార్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 6న సినిమా విడుదల కానుంది. గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆది మాట్లాడుతూ– ''కన్నడంలో శ్రద్ధా నటించిన 'యూటర్న్' చిత్రం నాకు చాలా ఇష్టం. ఆమె చాలా ప్రొఫెషనల్ ఆర్టిస్ట్. ఈ చిత్రం టీజర్ రిలీజయ్యాక అందరూ ఫోన్ చేసి 'నువ్వు చాలా కొత్తగా ఉన్నావు' అని అభినందించారు'' అన్నారు. విశ్వనాథ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ముగ్గురి నమ్మకంతో మొదలై ఇప్పుడు రిలీజ్ వరకు వచ్చింది. నిర్మాత విజయలక్ష్మి ఇప్పుడు చెప్పాల్సిన కథ ఇది అంటే, హీరో ఆది ఇలాంటి కథ కోసమే ఎదురు చూస్తున్నా అన్నారు. హీరోయిన్ శ్రద్ధా కథ వినగానే చేస్తున్నా అన్నారు. నరేశ్‌గారికి పాత్ర చాలా బాగా వచ్చింది. సంగీత దర్శకుడు ఫణికుమార్, నేను కొత్త ట్యూన్స్ కోసం ప్రయత్నించాం' అన్నారు. శ్రద్ధా మాట్లాడుతూ– ''జెర్సీ' సినిమాతో తెలుగు ప్రేక్షకులు అందించిన ప్రేమను మరచిపోలేను. 'జోడి' కథ వింటూ చాలాసార్లు నవ్వుకున్నాను'' అన్నారు. నరేశ్ మాట్లాడుతూ– ''కొన్ని సినిమాలు మోహమాటంతో, కొన్ని సినిమాలు ఆ సినిమా స్పాన్ చూసి చేస్తాం. కానీ ఈ సినిమాలో నా పాత్ర ఎంతో నచ్చి చేశాను'' అన్నారు. ''నేచురల్‌గా ఉండే సినిమా చేద్దాం అనుకున్నాను. విశ్వనాథ్ ఈ కథ చెప్పగానే ఆదిగారు కరెక్ట్ అనిపించి ఆయనకు చెప్పాం. కథ వినగానే ఆది ఓకే అన్నారు. శ్రద్ధా మా సినిమాకు ఎస్సెట్ అవుతుంది'' అన్నారు విజయలక్ష్మి.


● రాశీ ఖన్నా

# ధనుష్ కాదు ప్రశాంత్!

శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వంలో ఆయుష్మాన్ ఖురానా, రాధికా ఆప్టే, టబు ముఖ్య పాత్రల్లో నటించిన హిందీ బ్లాక్‌బస్టర్ చిత్రం 'అంధాధూన్'. ఈ చిత్రం తమిళంలో రీమేక్ కాబోతుందని ఆ మధ్య వార్తలు వచ్చాయి. హీరోగా ధనుష్, సిద్ధార్థ్ ఇలా పలువురు పేర్లు కూడా వినిపించాయి. ఓ సందర్భంలో 'అంధాధూన్' చేయాలని చాలా ఆసక్తిగా ఉన్నానని కూడా తెలిపారు ధనుష్. ఇప్పుడు 'అంధాధూన్' తమిళ రీమేక్‌లో 'జీన్స్' ఫేమ్ ప్రశాంత్ నటిస్తారని తెలిసింది. ఈ హిందీ చిత్రం తమిళ రైట్స్‌ను ప్రశాంత్ తండ్రి, నటుడు–దర్శకుడు–నిర్మాత త్యాగరాజన్ సొంతం చేసుకున్నారు. ప్రశాంత్ నటించిన గత చిత్రం 'జానీ' (తమిళం) కూడా శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కించిన 'జానీ గద్దర్' (హిందీ)కు రీమేకే కావడం విశేషం.


● ప్రశాంత్

# ముచ్చటగా మూడోసారి?

'బెంగాల్ టైగర్, టచ్ చేసి చూడు' సినిమాల్లో కలసి నటించారు రవితేజ, రాశీ ఖన్నా. ఈ ఇద్దరూ మూడోసారి కలసి నటించనున్నారని తెలిసింది. 'ఆర్ ఎక్స్ 100' తర్వాత దర్శకుడు అజయ్ భూపతి 'మహా సముద్రం' అనే సినిమా తెరకెక్కించడానికి ప్లాన్ చేస్తున్నారు. ఇందులో రవితేజ, సిద్ధార్థ్ హీరోలుగా యాక్ట్ చేస్తారని సమాచారం. రవితేజకు జోడీగా అదితీరావ్ హైదరీ నటించనున్నారని వార్తలు వచ్చాయి. డేట్స్ ఇష్యూ కారణంగా ఆమె ఈ సినిమా నుంచి తప్పుకున్నారని, ఆమె స్థానంలో రాశీఖన్నా వచ్చారని తెలిసింది. సెప్టెంబర్ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది.

# బంధాలు మళ్లీ గుర్తొస్తాయి

''నీకోసం' సినిమా నాకు బాగా నచ్చింది. సిస్టర్ సెంటిమెంట్ సీన్స్ హైలైట్‌గా ఉంటాయి. ఊహించని మలుపులతో కథ సాగుతుంది. ఈ చిత్రంతో అవినాష్ వంటి మరో ప్రతిభావంతుడైన దర్శకుడు టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నాడు. ఇలాంటి మంచి సినిమాను అందరూ ఆదరించాలి'' అని నిర్మాత బెక్కం వేణుగోపాల్ అన్నారు. అరవింద్ రెడ్డి, అజిత్ రాధారామ్ హీరోలుగా, శుభాంగి పంత్, దీక్షితా పార్వతి హీరోయిన్లుగా అవినాష్ కోకటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నీకోసం'. రాజలింగం సమర్పణలో అల్లూరమ్మ (భారతి) నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. అవినాష్ కోకటి మాట్లాడుతూ– ''ఎమోషనల్ లవ్ స్టోరీగా తెరకెక్కిన చిత్రమిది. ప్రివ్యూ చూసిన పెద్దలందరూ సినిమా చాలా బావుందని మెచ్చుకున్నారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరికీ కచ్చితంగా నచ్చుతుంది. మర్చిపోయిన లేదా వదిలేసిన బంధాలన్నీ మళ్లీ గుర్తొస్తాయి'' అన్నారు. ''అందరం కొత్తవాళ్లమే అయినా చాలా కొత్తదనం ఉన్న కథతో వస్తున్నాం'' అన్నారు అరవింద్ రెడ్డి. ''మా సినిమాలో ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది'' అన్నారు అజిత్ రాధారామ్. ''ఈ సినిమాకి రీ రికార్డింగ్ చేస్తున్నప్పుడే మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం కుదిరింది'' అన్నారు సంగీత దర్శకుడు శ్రీనివాస్ శర్మ. శుభాంగి పంత్, దీక్షితా పార్వతి మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: శివ క్రిష్ణ యెదులపురమ్.


● శుభాంగి పంత్, అరవింద్


● స్టెఫీ, వంశీ

# నిను తలచి...

వంశీ యాకశిరి, స్టెఫీ పటేల్ జంటగా రూపొందిన చిత్రం 'నిను తలచి'. ఎస్ఎల్‌యన్ ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ పతాకాలపై ఓబులేష్ మొదిగిరి, నేదురుమల్లి అజిత్ కుమార్ నిర్మించారు. అనిల్ తోట దర్శకత్వం వహించారు. ఈ చిత్రం లేటెస్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ''త్వరలోనే వీడియో సాంగ్స్, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం. సెప్టెంబర్‌లో చిత్రాన్ని విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రనిర్మాతలు తెలిపారు. అనిల్ తోట మాట్లాడుతూ– ''అనుకున్న బడ్జెట్‌లో అనుకున్న టైమ్‌లో చిత్రాన్ని పూర్తి చేశాం. ఈ సినిమా ద్వారా హీరోగా పరిచయమవుతున్న వంశీ కొత్త హీరోలా అనిపించడు. అతని నటన సినిమాకు ప్లస్ అవుతుంది'' అన్నారు. వంశీ మాట్లాడుతూ– ''ఓ ఫీల్‌గుడ్ మూవీతో హీరోగా పరిచయమవ్వటం ఆనందంగా ఉంది. నిర్మాతలు అన్ని సౌకర్యాలు కల్పిస్తే దర్శకుడు అనిల్ తోట అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని తెరకెక్కించారు' అన్నారు.



# సాక్షి స్పోర్ట్స్

శనివారం
17-8-2019



## యు ముంబా విజయం

అహ్మదాబాద్ వేదికగా శుక్రవారం జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-7 మ్యాచ్‌లో యు ముంబా 34-30తో పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. యు ముంబా రైడర్ రోహిత్ బలియాన్ 9 పాయింట్లతో జట్టుకు విజయాన్ని అందించాడు. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 22-19తో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌పై విజయం సాధించింది. జైపూర్ రైడర్ దీపక్ నివాస్ హుడా 7 పాయింట్లతో రాణించాడు. నేటి నుంచి చెన్నైలో పోటీలు జరుగుతాయి. తొలి రోజు తమిళ్ తలైవాస్‌తో బెంగళూరు బుల్స్; బెంగాల్ వారియర్స్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.



# రవిశాస్త్రినే రైట్

ఓ ఎంపిక తంతు ముగిసింది...! టీమిండియా ప్రధాన కోచ్‌గా మళ్లీ రవిశాస్త్రికే అవకాశం దక్కింది. ప్రతిష్టాత్మక ప్రపంచ కప్ సాధించలేకపోయినా... జట్టు కూర్పులో విమర్శలెదుర్కొన్నా... కెప్టెన్ విరాట్ కోహ్లి అండదండలు సమృద్ధిగా ఉన్న అతడు... అందరినీ తోసిరాజంటూ మరో రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నాడు. హెడ్‌కోచ్ ఎంపిక కోసం శుక్రవారం ముంబైలో సమావేశమైన దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)... రవిశాస్త్రి నియామకానికి ఏకగ్రీవంగా అంగీకరించింది. కుదించిన జాబితాలో శాస్త్రి సహా మొత్తం ఆరుగురు ఉండగా, వీరిలో చివరి దశకు ముగ్గురే మిగిలారు. అందులోంచి అంతా అనుకుంటున్నట్లుగా... ముందే నిర్ణయించేసినట్లుగా... 'రవి భాయ్'కే పట్టం కట్టారు.

**ముంబై:** పెద్దగా మలుపులేం లేవు. అనూహ్యమేమీ జరగలేదు. అంచనాలకు తగ్గట్లే, కెప్టెన్ కోహ్లి మనోగతానికి అనువుగానే అంతా సాగిపోయింది. భారత జాతీయ పురుషుల క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రి పదవి 2021 టి20 ప్రపంచకప్ వరకు పదిలమైంది. తాము ప్రామాణికంగా నిర్దేశించుకున్న శిక్షణా రీతులు, అనుభవం, సాధించిన ఘనతలు, సమాచారం వినియమం, ఆధునిక శిక్షణా పరిజ్ఞానం అనే ఐదు అంశాలకు శాస్త్రినే తగినవాడంటూ కపిల్, మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్, మహిళల జట్టు మాజీ కెప్టెన్ శాంత రంగస్వామితో కూడిన సీఏసీ సభ్యులు నిర్ణయం వెలువరించారు. ఈ పదవికి దరఖాస్తు చేసిన న్యూజిలాండ్ మాజీ కోచ్ మైక్ హెసన్, శ్రీలంకకు కోచ్‌గా పనిచేసిన టామ్ మూడీ 2, 3 స్థానాలతో సరిపెట్టుకున్నారు. శుక్రవారం రోజంతా సమావేశమైన కపిల్ బృందం... వీరితో పాటు టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ రాబిన్‌సింగ్, జట్టు మాజీ మేనేజర్ లాల్‌సింగ్ రాజ్‌పుత్‌లను ఇంటర్వ్యూ చేసింది. మరో దరఖాస్తుదారు ఫిల్ సిమన్స్ (వెస్టిండీస్) మాత్రం అంతకుముందే తప్పుకొన్నాడు. హెసన్, రాబిన్‌సింగ్, రాజ్‌పుత్ నేరుగా హాజరై తమ ప్రణాళికలు వివరించారు. మూడీ, ప్రస్తుతం భారత జట్టుతో కరీబియన్ దీవుల పర్యటనలో ఉన్న రవిశాస్త్రి టెలి కాన్ఫరెన్స్ ద్వారా ప్రక్రియలో పాల్గొన్నారు. 2017 జులైలో శాస్త్రిని హెడ్ కోచ్‌గా అప్పటి సీఏసీ సభ్యులు సచిన్, గంగూలీ, లక్ష్మణ్ ఎంపిక చేశారు. అప్పట్లో అతడి నియామకంపై వీరంతా కెప్టెన్‌గా కోహ్లి అభిప్రాయాన్ని తీసుకు న్నారు. ఇప్పుడు మాత్రం అదేమీ లేకుండానే నిర్ణయం తీసుకున్నామని కపిల్ తెలిపాడు.

**టీమిండియా హెడ్ కోచ్‌గా మళ్లీ అతడికే పట్టం**

- ఏకగ్రీవంగా ఎంపిక చేసిన సీఏసీ
- 2021 టి20 ప్రపంచ కప్ వరకు బాధ్యతలు
- రేసులో వెనుకబడిన హెసన్, మూడీ

### డైరెక్టర్‌గా వచ్చి... కోచ్‌గా పాతుకుపోయాడు

2014 వరకు పూర్తిస్థాయి వ్యాఖ్యాతగా ఉన్న రవి ఆ ఏడాది ఇంగ్లండ్‌లో భారత్ టెస్టు సిరీస్‌లో ఘోరంగా ఓడటంతో వన్డే సిరీస్‌కు టీమ్ డైరెక్టర్‌గా ప్రత్యేక పరిస్థితుల్లో నియమితుడయ్యాడు. నాటి కోచ్ డంకన్ ఫ్లెచర్ ఉండగానే డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు చూశాడు. ఫ్లెచర్ 2015 ప్రపంచ కప్ అనంతరం వైదొలిగాక, 2016 జూన్‌లో మేటి స్పిన్నర్ అనిల్ కుంబ్లే కోచ్‌గా వచ్చేవరకు డైరెక్టర్ కమ్ కోచ్‌గా వ్యవహరించాడు. 2017 జూలైలో కోహ్లితో విభేదాల కారణంగా కుంబ్లే తప్పుకోవడంతో ప్రధాన కోచ్ అయ్యాడు. తాజా ఎంపికకు అతడి ఆధ్వర్యంలో జట్టు సాధించిన విజయాలు ఓ కారణంగా చెబుతున్నారు. శాస్త్రి హయాంలో భారత్ 2017-18 మధ్య కాలంలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లలో టెస్టు విజయాలు సాధించింది. ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్టు సిరీస్ నెగ్గింది. ఇటీవలి వన్డే ప్రపంచ కప్‌లో లీగ్ దశలో టాప్‌లో నిలిచి సెమీస్ చేరింది. మధ్యలో ఆసియా కప్ వంటి చిన్నాచితక టోర్నీలు, స్వదేశంలో సిరీస్‌లు గెలుచుకుంది. ఇప్పుడు 2021 వరకు ఎంపిక చేసినందున బహుశా భారత క్రికెట్ చరిత్రలో ఎక్కువ కాలం కోచ్‌గా పనిచేసినవాడిగా రికార్డులకెక్కుతాడు.

### కోహ్లి వ్యాఖ్యల ప్రభావం లేదు

'కోచ్ ఎంపికలో మేం కోహ్లి వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకోలేదు. ఒకవేళ అలానే చేసి ఉంటే... మిగతా జట్టు సభ్యులందరి అభిప్రాయాలు తీసుకునేవారం. ఈ విషయంలో మేమెవరినీ సంప్రదించలేదు. అసలు అందుకు అవకాశమే లేదు. ప్రపంచ కప్ సాధించనంత మాత్రాన వేటు వేయాలని ఏమైనా ఉందా? మీరు మొత్తం విజయాలను చూడండి. వారి ప్రజంటేషన్‌నే మేం చూశాం. దాని ప్రకారమే వెళ్లాం. అందరూ నిపుణులే అయినా కమ్యూనికేషన్ స్కిల్స్ రవిశాస్త్రిని ముందంజలో నిలిపాయి'

**- రవిశాస్త్రి ఎంపికపై కపిల్ స్పందన**



### ఎందుకీ ప్రహసనం?

'కోచ్‌గా రవి భాయ్‌ను కొనసాగిస్తే సంతోషం'... వెస్టిండీస్ పర్యటనకు వెళ్తూవెళ్తూ కోహ్లి చేసిన వ్యాఖ్య ఇది. వీటిని బట్టి చూసినా, వన్డే ప్రపంచ కప్‌తోనే గడువు ముగిశాక 45 రోజుల పొడిగింపు ఇవ్వడాన్ని బట్టి లెక్కగట్టినా వాస్తవానికి కాబోయే కోచ్ ఎవరో అప్పుడే స్పష్టమైపోయింది. కానీ, ఏదో ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్నట్లు చెప్పుకొనేందుకు బీసీసీఐ... టీమిండియా కోచ్ పదవికి దరఖాస్తులు ఆహ్వానించింది. ఓ గడువు పెట్టి వాటిని వడపోసింది. మరీ విడ్డూరంగా కపిల్ స్థాయి వ్యక్తితో సలహా కమిటీని వేసింది. దాని నియామకంపై భిన్నాభిప్రాయాలతో పాటు మధ్యలో క్రికెట్ పాలకుల కమిటీ (సీఓఏ) జోక్యం సరేసరి. తీరా అంతా అయ్యాక చూస్తే రవిశాస్త్రికే అవకాశం ఇచ్చింది. ఇంతోటిదానికి హెసన్ రెండో స్థానంలో, మూడీ మూడో స్థానంలో నిలిచారని ప్రకటించి నవ్వు తెప్పించింది. పైగా బోర్డు అధికారిక ప్రకటనలో హెసన్ పేరు కూడా తప్పుగా రాశారంటే దీనిని ఏమాత్రం సీరియస్‌గా తీసుకున్నారో అర్థమవుతుంది. ఇది వచ్చేది కాదు పోయేది కాదని అర్థమై ఇంటర్వ్యూకు ముందు సిమన్స్ తప్పుకోగా రాబిన్ సింగ్, రాజ్‌పుత్ హాజరు వేయించుకుని వెళ్లినట్లైంది. ఇక్కడ తేలిందేమంటే... భారత క్రికెట్‌లో కోహ్లి అంతకంత బలవంతుడయ్యాడని...! కెప్టెన్ మాటను జవదాటి పోలేని స్థితికి బోర్డు చేరిందని...!

## ఖేల్‌రత్న బజరంగ్

**ఏకగ్రీవంగా నామినేట్ చేసిన అవార్డు కమిటీ**



**న్యూఢిల్లీ:** భారత అగ్రశ్రేణి రెజ్లర్ బజరంగ్ పూనియా అత్యున్నత క్రీడాపురస్కారమైన 'రాజీవ్ ఖేల్‌రత్న' అవార్డుకు ఎంపికయ్యాడు. 2018 ఆసియా గేమ్స్ (జకార్తా), కామన్వెల్త్ గేమ్స్ (గోల్డ్‌కోస్ట్) చాంపియన్ అయిన పూనియాను 12 మంది సభ్యులు గల అవార్డుల కమిటీ ఏకగ్రీవంగా నామినేట్ చేసింది. రిటైర్డ్ జస్టిస్ ముకుందకం శర్మ నేతృత్వంలోని ఈ కమిటీలో భారత క్రీడా దిగ్గజాలు బైచుంగ్ భూటియా, మేరీకోమ్ తదితరులున్నారు. ఈ కమిటీ రెండు రోజుల సమావేశం శుక్రవారం మొదలైంది. తొలిరోజే చాంపియన్ రెజ్లర్‌ను నామినేట్ చేయగా, శనివారం మరొకరిని ఈ 'ఖేల్‌రత్న'కు జతచేసే అవకాశాల్ని కమిటీ పరిశీలిస్తుంది. గతేడాది అత్యున్నత క్రీడాపురస్కారానికి తనను గుర్తించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేసిన పూనియా కోర్టును కూడా ఆశ్రయించాడు. చివరకు మెగా ఈవెంట్లలో అతని బంగారు ప్రదర్శనను గుర్తించిన కమిటీ ఖేల్‌రత్నకు ఎంపిక చేయడం విశేషం. ఎట్టకేలకు తన ఘనతలకు గుర్తింపు దక్కినందుకు స్టార్ రెజ్లర్ బజరంగ్ పూనియా హర్షం వ్యక్తం చేశాడు. వచ్చే నెలలో కజకిస్తాన్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ముందు అవార్డుకు ఎంపిక కావడంకంటే కూడా తన శక్తి, సామర్థ్యాలే తనకు స్ఫూర్తి, ప్రేరణ అని చెప్పుకొచ్చాడు. మొత్తం మీద అవార్డుల కమిటీ... అర్జున, ద్రోణాచార్య అవార్డులకు ఎంపికైన అథ్లెట్లు, కోచ్‌లను నేడు ఖరారు చేసి భారత ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది. అనంతరం క్రీడాశాఖ అధికారికంగా జాబితాను విడుదల చేస్తుంది. దివంగత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవమైన ఆగస్టు 29న అవార్డుల్ని అందజేస్తారు.

# కోహ్లి లేకుండా ప్రాక్టీసుకు...

**నేటి నుంచి విండీస్ బోర్డు ఎలెవెన్‌తో మూడు రోజుల మ్యాచ్**

**కూలిడ్జ్ (ఆంటిగ్వా):** స్పెషలిస్ట్ ఆటగాళ్ల చేరికతో కరీబియన్ పర్యటనలో టీమిండియా టెస్టు సమరానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా శనివారం నుంచి వెస్టిండీస్ క్రికెట్ బోర్డు ఎలెవెన్‌తో మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో భారత జట్టులో లేని బ్యాట్స్‌మెన్ చతేశ్వర్ పుజారా, అజింక్య రహానే, మయాంక్ అగర్వాల్, హనుమ విహారి, వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా, పేసర్లు ఉమేశ్ యాదవ్, ఇషాంత్ శర్మ, ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌లు సంప్రదాయ ఫార్మాట్‌కు సమాయత్తం అయ్యే ప్రయత్నం చేయనున్నారు. నెల రోజుల విశ్రాంతి అనంతరం ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తాజాగా మైదానంలో దిగనున్నాడు. బుధవారం జరిగిన మూడో వన్డేలో కుడి చేతి బొటన వేలికి గాయం కావడంతో ప్రాక్టీస్ మ్యాచ్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లి బరిలోకి దిగకపోవచ్చని తెలుస్తోంది. ఇది అధికారిక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ కాకపోవడంతో టీమిండియా తరపున బ్యాట్స్‌మెన్, బౌలర్లు అందరూ మైదానంలో కాసేపు గడిపే వీలుంది. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ విజయంలో ప్రధాన పాత్ర పోషించిన వన్ డౌన్ బ్యాట్స్‌మన్ పుజారా ఎనిమిది నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్నాడు. దేశవాళీ జట్టు సౌరాష్ట్ర తరపున ఫిబ్రవరి మొదటివారంలో రంజీ ట్రోఫీ ఫైనల్ ఆడిన అనంతరం అతడు మార్చిలో ముస్తాక్ అలీ టి20 టోర్నీలో పాల్గొన్నాడు. టెస్టు జట్టు వైస్ కెప్టెన్ హోదాలో ఉన్నప్పటికీ కొంతకాలంగా తనదైన ఇన్నింగ్స్ ఆడలేకపోతున్న రహానేకు ఇప్పుడు అసలైన పరీక్షా కాలం నడుస్తోంది. ఇంగ్లిష్ కౌంటీల్లోనూ అతడు పెద్దగా రాణించలేకపోయాడు. ఏడు మ్యాచ్‌ల్లో 307 పరుగులే చేశాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌కు రహానేనే సారథ్యం వహించనున్నాడు. సాహా అందుబాటులోకి వచ్చినందున తొలి టెస్టులో చోటు దక్కాలంటే పంత్ మెరుగైన కీపింగ్ లక్షణాలు కనబర్చాల్సి ఉంటుంది. హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ ఆటపైనా ఆసక్తి నెలకొంది. ప్రథమ ప్రాధాన్య ఓపెనర్లుగా మయాంక్ అగర్వాల్, కేఎల్ రాహుల్‌లకే అవకాశం ఉన్నా... విహారి నుంచి వీరిద్దరిలో ఒకరికి పోటీ ఉంది. పేస్‌తో ఉమేశ్, ఇషాంత్, స్పిన్‌తో అశ్విన్, జడేజా టీం మేనేజ్‌మెంట్‌ను మెప్పించేందుకు ప్రయత్నించవచ్చు. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్-వెస్టిండీస్ మధ్య తొలి టెస్టు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది. దీనినీ కైవసం చేసుకుంటే చరిత్రలో తొలిసారిగా 3 ఫార్మాట్లను భారత్ అజేయంగా ముగించినట్లు అవుతుంది.



# ఈ సారి సాధిస్తా

**ప్రపంచ చాంపియన్‌షిప్‌పై సింధు వ్యాఖ్య**



**న్యూఢిల్లీ:** ప్రపంచ చాంపియన్‌షిప్ నేపథ్యంలో భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఫిట్‌నెస్‌పై ఎక్కువ దృష్టిపెట్టినట్లు చెప్పింది. ఈ మెగా ఈవెంట్‌లో గతంలో సింధు నాలుగు పతకాలు సాధించింది. రెండేసి చొప్పున రజత, కాంస్య పతకాలు నెగ్గింది. కానీ స్వర్ణం మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. ఫైనల్ చేరిన రెండుసార్లు పరాజయమే చవిచూసింది. అయితే ఈ సారి మాత్రం టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నానని 24 ఏళ్ల సింధు చెప్పు కొచ్చింది. ఈ నెల 19 నుంచి స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ జరుగనుంది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 'ప్రాక్టీస్‌లో కఠోరంగా శ్రమించా. ఈ సారి తప్పకుండా స్వర్ణం సాధిస్తానన్న నమ్మకముంది. అలాగని నాపై ఒత్తిడేమీ లేదు. మంచి ప్రదర్శన కనబరుస్తాను. డిఫెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్‌పై ఎక్కువగా శ్రద్ధ పెట్టాను. అలాగే ఆటతీరు కూడా మెరుగయ్యేందుకు కష్టపడ్డాను' అని తెలిపింది. తెలుగుతేజంకు జపాన్ ప్రత్యర్థి యామగుచి కొరకరాని కొయ్య గా మారింది. ఇండోనేసియా, జపాన్ టోర్నీల్లో సింధుకు చుక్కలు చూపించింది. ఆమెను ఎదుర్కోవడంపై ఎలాంటి కసరత్తు చేశారని ప్రశ్నిం చగా.... 'యామగుచితో పోరు కష్టమేమీ కాదు. ఇండోనేసియా టోర్నీలో ఆమెను దీటుగా నే ఎదుర్కొన్నా. కానీ ఆమె అటాకింగ్ బాగా చేసింది. ర్యాలీల్లోనూ దిట్టే! కాబట్టి ఆమె దూకుడు నన్నేమీ ఆశ్చర్యపరచలేదు. ఆమెతో నేను తలపడేందుకు సిద్ధంగా ఉన్నా' అని సింధు వివరించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తెలుగుతేజం ఐదో సీడ్‌గా బరిలోకి దిగుతోంది. తొలిరౌండ్లో ఆమెకు బై లభించింది. రెండో రౌండ్లో చైనీస్‌తైపీకి చెందిన పాయ్ యు పో లేదంటే లిండా (బల్గేరియా)తో తలపడే అవకాశముంది. ఇందులో గెలిస్తే... తదుపరి రౌండ్లో బీవెన్ జంగ్ (అమెరికా)ను ఎదుర్కొంటుంది. ఈ అడ్డంకులన్నీ దాటితే క్వార్టర్స్‌లో తైపీ స్టార్ తై జు యింగ్ ఎదురయ్యే అవకాశాలున్నాయి.

## కిర్గియోస్‌కు రూ.80 లక్షల జరిమానా!

**అంపైర్‌ను తిట్టినందుకు ఏటీపీ తీవ్ర చర్య**



*సిన్సినాటి: కెరీర్ ఆరంభం నుంచి వివాదాలతో సహవాసం చేస్తున్న ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్ నిక్ కిర్గియోస్ ఇప్పుడు దూషణల పర్వాన్ని శిఖర స్థాయికి తీసుకెళ్లాడు! ఫలితంగా భారీ జరిమానాకు గురవడంతో పాటు నిషేధానికి కూడా చేరువయ్యాడు. సిన్సినాటి మాస్టర్స్ టోర్నీ రెండో రౌండ్‌లో పరాజయం అనంతరం అతని ప్రవర్తన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)కి తీవ్ర ఆగ్రహం కలిగించింది. ఈ మ్యాచ్‌లో కరెన్ కచనోవ్ (రష్యా) 6-7, 7-6, 6-2తో కిర్గియోస్‌ను ఓడించాడు. మ్యాచ్ ముగిశాక కిర్గియోస్ అంపైర్‌కు షేక్ హ్యాండ్ ఇవ్వకుండా చెత్త అంపైర్ అంటూ దుర్భాషలాడుతూ అతని వైపు ఉమ్మేశాడు! మ్యాచ్‌లో అప్పటికే టైమ్ నిబంధనను అతిక్రమించడం, అనుమతి లేకుండా కోర్టును వీడటం, రెండు సార్లు రాకెట్లు విరగ్గొట్టడంవంటి చేసేశాడు. దాంతో క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించాడంటూ ఏటీపీ ఏకంగా ఈ ఒక్క మ్యాచ్‌లోనే 9 అభియోగాలు నమోదు చేసింది. అన్నీ కలిపి లక్షా 13 వేల డాలర్లు (సుమారు రూ. 80 లక్షలు) జరిమానాగా విధించింది. ఇది తక్షణ చర్య మాత్రమేనని, ముందుముందు పూర్తి స్థాయి విచారణ జరిపిన తర్వాత కిర్గియోస్‌పై మరింత తీవ్ర చర్య ఉండవచ్చని కూడా ఏటీపీ ప్రకటించింది. ప్రపంచ 27వ ర్యాంకర్ అయిన 24 ఏళ్ల కిర్గియోస్‌పై నిషేధం విధించే అవకాశం కనిపిస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో వివాదాస్పద వ్యాఖ్యలు, చర్యలతో శిక్షలకు గురయ్యాడు.*

# న్యూజిలాండ్ 195/7

**శ్రీలంకతో తొలిటెస్టు**

**గాలే:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లోనూ న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ స్పిన్‌కు తలవంచారు. లెఫ్టార్మ్ స్పిన్నర్ లసిత్ ఎంబుల్‌డెనియా (4/71) చెలరేగడంతో మ్యాచ్ మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి కివీస్ 7 వికెట్లకు 195 పరుగులు చేసింది. వికెట్ కీపర్ వాట్లింగ్ (63 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ చేయగా, లాథమ్ (45) రాణించాడు. ధనంజయకు 2 వికెట్లు దక్కాయి. సౌతీ (23)తో కలిసి వాట్లింగ్ ఏడో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. ప్రస్తుతం చేతిలో 3 వికెట్లున్న న్యూజిలాండ్ 177 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 227/7తో ఆట కొనసాగించిన శ్రీలంక మరో 40 పరుగులు జోడించి తొలి ఇన్నింగ్స్‌లో 267 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆ జట్టుకు 18 పరుగుల ఆధిక్యం లభించింది. డిక్‌వెలా (61) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, లక్మల్ (40) రాణించాడు.




## 24.1 ఓవర్ల ఆట మాత్రమే!

**లండన్:** యాషెస్ సిరీస్ రెండో టెస్టును మరో సారి వాన దెబ్బ తీసింది. లార్డ్స్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు శుక్రవారం భారీ వర్షం కారణంగా కేవలం 24.1 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఓవర్‌నైట్ స్కోరు 30/1తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా 4 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. బాన్‌క్రాఫ్ట్ (13), ఉస్మాన్ ఖాజా (36), ట్రవిస్ హెడ్ (7) పెవిలియన్ చేరగా... స్టీవ్ స్మిత్ (13), వేడ్ (0) క్రీజ్‌లో ఉన్నారు. తొలి సెషన్‌లోనే మ్యాచ్‌కు అడ్డుగా నిలిచిన వర్షం ఆ తర్వాత ఏమాత్రం తెరిపినివ్వలేదు. చివరకు అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాల్సి వచ్చింది. ఇప్పటికే ఈ టెస్టులో తొలి రోజు వర్షంతో పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. మరో రెండు రోజుల ఆట మాత్రమే మిగిలి ఉండగా రెండు ఇన్నింగ్స్‌లు కూడా పూర్తి కాకపోవడంతో టెస్టు 'డ్రా' అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. తొలి టెస్టు నెగ్గిన ఆస్ట్రేలియా సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉంది.

## ఫైనల్లో శ్రీవల్లి

**సాక్షి, హైదరాబాద్:** తమిళనాడులో జరుగుతున్న జాతీయ జూనియర్ క్లే కోర్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో తెలంగాణ అమ్మాయి శ్రీవల్లి రష్మిక ఫైనల్‌కు చేరి అదరగొట్టింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీవల్లి 6-3, 7-5తో టోర్నీ ఎనిమిదో సీడ్ క్రీడాకారిణి సారా దేవ్ (పంజాబ్)ను చిత్తుచేసి తుది పోరుకు అర్హత సాధించింది. ఆట ఆద్యంతం అద్భుతంగా ఆడిన శ్రీవల్లి వరుస సెట్లల్లో ప్రత్యర్థిని చిత్తు చేసింది.



# చంద్రశేఖర్‌ది ఆత్మహత్య

**ధ్రువీకరించిన పోలీసులు**



**సాక్షి, చెన్నై:** భారత మాజీ క్రికెటర్ వీబీ చంద్రశేఖర్ (58) గుండెపోటుతో మరణించలేదని, ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు ధ్రువీకరించారు. ఆయన బలవన్మరణానికి అప్పులే కారణమని తేల్చారు. ఆర్థిక సమస్యల వల్లే చెన్నైలోని తన నివాసంలో చంద్రశేఖర్ గురువారం ఉరేసుకొని మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఆయన మరణవార్తతో తమిళనాడు క్రికెట్ సంఘం వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో కాంచీ వీరన్స్ జట్టును ఆయన కొనుగోలు చేశారు. దీని నిర్వహణతో పాటు తన అకాడమీ కోసం బ్యాంకులు, సన్నిహితుల వద్ద రూ. 3 కోట్ల మేర అప్పు చేశారు. చివరకు చెల్లించలేని పరిస్థితి తలెత్తడంతో ఆత్మహత్య చేసుకున్నారని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. చెన్నై రాయపేట ఆసుపత్రిలో శుక్రవారం చంద్రశేఖర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్, క్రికెటర్లు దినేష్ కార్తీక్, మురళీ విజయ్, విజయ్ శంకర్‌లతో పాటు తమిళనాడు క్రికెట్ సంఘం సభ్యులు ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు.

## విండీస్‌కు లారా, శర్వాన్ సలహాలు

**నార్త్ సౌండ్:** పటిష్టమైన టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్‌కు ఆ దేశ దిగ్గజం బ్రియాన్ లారా, మేటి బ్యాట్స్‌మన్ రామ్ నరేశ్ శర్వాన్ సలహాలు ఇవ్వనున్నారు. ఈ టెస్టుతోనే విండీస్ ప్రపంచ చాంపియన్‌షిప్ ప్రయాణం ప్రారంభం కానుంది. దీంతో వెస్టిండీస్ క్రికెట్ బోర్డు (సీడబ్ల్యూఐ) డైరెక్టర్ జిమ్మీ ఆడమ్స్... మెలకువలు చెబుతూ, అనుభవాలు పంచుకోవాలని లారా, శర్వాన్‌లను కోరాడు. దీంతో ఆంటిగ్వాలో నిర్వహించే జట్టు సన్నాహక శిబిరంలో సేవలు అందించేందుకు వీరిద్దరూ అంగీకరించారు.

## ఎన్నికలు సెప్టెంబర్ 14లోగా పూర్తవ్వాలి

**రాష్ట్ర సంఘాలకు బీసీసీఐ ఎన్నికల అధికారి ఆదేశం**

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)లో ఎన్నికల హడావుడి మొదలైంది. బోర్డుకు అనుబంధంగా ఉన్న రాష్ట్ర క్రికెట్ సంఘాలు ఎన్నికల ప్రక్రియ వెంటనే చేపట్టాలని బీసీసీఐ ఎన్నికల అధికారి ఎన్.గోపాలస్వామి తెలిపారు. వచ్చే నెల 14వ తేదీలోపు అన్ని రాష్ట్రాల సంఘాలకు ఎన్నికలు పూర్తవ్వాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అప్పుడే బీసీసీఐ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశముంటుందని ఆయన చెప్పారు. బోర్డు పరిపాలక కమిటీ (సీఓఏ) అక్టోబర్ 22న బీసీసీఐకి ఎన్నికలు నిర్వహిస్తామని ఇదివరకే సుప్రీం కోర్టుకు వెల్లడించింది. నిర్ణీత గడువు (సెప్టెంబర్ 14)లోగా ఏ రాష్ట్ర సంఘమైనా కార్యవర్గాన్ని ఎన్నుకోకపోతే బీసీసీఐ ఎన్నికల్లో ఓటు వేసే అర్హత కోల్పోతారని ఎన్నికల అధికారి శుక్రవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. ఎన్నికైన సంఘాల ప్రతినిధులే బోర్డు ఎన్నికల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అయితే ఈ తంతు అంత సులభమయ్యేలా లేదు. ఎందుకంటే బోర్డుకు అనుబంధంగా ఉన్న 38 క్రికెట్ సంఘాల్లో ఇంకా 10 సంఘాలైతే కొత్త నియమావళికి తగ్గ మార్పులు చేసుకోలేదు.

### స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39 ▲ | 18 ▲ |
| 37,350 | 11,048 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,902 | ▲ | 135 |
| డోజోన్స్ | 25,892 | ▲ | 307 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,117 | ▲ | 50 |
| డాక్స్ | 11,563 | ▲ | 150 |
| షాంఘై | 2,824 | ▲ | 8 |
| నికాయ్ | 20,416 | ▲ | 13 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

### ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్‌ డాలర్ | ఎస్‌బీఐ | 70.65 | 72.29 |
| బ్రిటన్‌ పౌండ్ | ఎస్‌బీఐ | 84.89 | 87.94 |
| యూరో | ఎస్‌బీఐ | 77.89 | 80.78 |
| జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 66.05 | 68.55 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.48 | 49.66 |
| సింగపూర్‌ డాలర్ | ఎస్‌బీఐ | 50.65 | 52.40 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.20 | 19.96 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.63 | 20.19 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.84 | 9.48 |

## తిరూర్‌ తమలపాకు... పళని పంచామృతాలకు జీఐ ట్యాగ్



**న్యూఢిల్లీ:** తమిళనాడులోని ప్రసిద్ధ పళని దేవస్థానం ప్రసాదమైన పంచామృతం, కేరళలోని తిరూరు తమలపాకులకు భౌగోళిక గుర్తింపు (జీఐ) ట్యాగ్‌ లభించింది. అలాగే, మిజోరంకు చెందిన రెండు వస్త్రోత్పత్తులు తావ్‌లోహ్‌పున్‌ (చేతితో నేయబడిన ఓ రకమైన వస్త్రం), మిజో పుంచీలకు కూడా ఈ గుర్తింపును కేటాయించినట్టు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. భౌగోళిక మూలాలు, నాణ్యత, వాటికి ఉన్న ప్రత్యేకతలను జీఐ ట్యాగ్‌ తెలియజేస్తోంది. పళనిలో దండయుతపాణి స్వామికి అభిషేక సేవలో వినియోగించే పంచామృతాన్ని అరటిపండు, బెల్లం, ఆవు నెయ్యి, తేనె, యాలకులు కలిపి చేస్తారు. ఎటువంటి రసాయన ప్రిజర్వేటివ్‌లు (పదార్థం పాడవకుండా ఉంచేందుకు) కలపకుండా సహజ పద్ధతుల్లో చేయడం దీని ప్రత్యేకత. కృత్రిమ పదార్థాలను కూడా వినియోగించరు. తమిళనాడులోని ఓ దేవాలయానికి చెందిన ప్రసాదానికి ఈ గుర్తింపు లభించడం ఇదే మొదటిసారని వాణిజ్య శాఖ పేర్కొంది. ఇక తిరూరు తమలపాకు రకాన్ని కేరళలోని మలప్పురం జిల్లా వ్యాప్తంగా పలు తాలూకాల్లో పండిస్తుంటారు. ఈ తమలపాకులో పలు ఔషధ లక్షణాలతోపాటు కొంత మేర ఉత్తేజాన్ని కూడా ఇస్తుంది. తావ్‌లోహ్‌పున్‌ వస్త్రాన్ని మిజోరం రాష్ట్రమంతటా ఉత్పత్తి చేస్తుంటారు. ఇక మిజో పూంచీ అనే శాలువను, మిజో సంప్రదాయ పండుగల సందర్భాల్లో నృత్యాల్లో ధరిస్తుంటారు. జీఐ ట్యాగ్‌ వల్ల ఆయా ఉత్పత్తులకు మరింత గుర్తింపుతోపాటు మంచి ధర కూడా లభిస్తుంది.

# 'ఆటో'లో మరిన్ని మూసి'వేతలు'

- తాత్కాలికంగా ఉత్పత్తి నిలిపివేసిన హీరో, సుందరం క్లేటన్
- హీరో మోటోకార్ప్‌ ప్లాంటు 4 రోజుల పాటు మూసివేత




**న్యూఢిల్లీ:** వాహన విక్రయాలు పడిపోయి, సంక్షోభ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న ఆటోమొబైల్‌ కంపెనీలు ఉత్పత్తిని మరింతగా తగ్గించుకుంటున్నాయి. దీంతో పలు కంపెనీల ప్లాంట్ల మూసివేతలు కొనసాగుతున్నాయి. తాజాగా ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్, సుందరం–క్లేటన్‌ (ఎస్‌సీఎల్‌) సంస్థలు తాత్కాలికంగా ప్లాంట్లను మూసివేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించాయి. హీరో మోటోకార్ప్‌ ఆగస్టు 15–18 దాకా (నాలుగు రోజుల పాటు) ప్లాంట్లను మూసివేస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుత మార్కెట్‌ డిమాండ్‌కి అనుగుణంగా ఉత్పత్తిని సర్దుబాటు చేసుకునేందుకు, వార్షిక మెయింటెనెన్స్‌లో భాగంగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది. 'స్వాతంత్య్ర దినోత్సవం, రక్షా బంధన్, వారాంత సెలవులు వంటి అంశాల కారణంగా ప్లాంట్ల మూసివేత నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుత మార్కెట్‌ డిమాండ్‌ పరిస్థితులు ఇందుకు కొంత కారణం' అని హీరో మోటోకార్ప్‌ ఈ సందర్భంగా వివరించింది.

ఈ ఏడాది ఏప్రిల్‌–జూలై మధ్య కాలంలో హీరో మోటోకార్ప్‌ వాహనాల ఉత్పత్తిని 12 శాతం తగ్గించుకుని 24,66,802 యూనిట్లకు పరిమితం చేసుకుంది. మరోవైపు, దేశ, విదేశ ఆటోమోటివ్స్‌ తయారీ సంస్థలకు అల్యూమినియం ఉత్పత్తులు సరఫరా చేసే ఎస్‌సీఎల్‌ కూడా 'పాడి'లోని ప్లాంటులో ఆగస్టు 16, 17న (రెండు రోజులు) కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు వివరించింది. ఇప్పటికే టాటా మోటార్స్, మహీంద్రా అండ్‌ మహీంద్రా, ఆటో పరికరాల తయారీ దిగ్గజం బాష్‌ తదితర సంస్థలు డిమాండ్‌కి అనుగుణంగా సర్దుబాటు చేసుకునేందుకు ఉత్పత్తిని తగ్గించుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## మారుతీలో 3 వేల ఉద్యోగాలు కట్‌..

ఆటోమొబైల్‌ రంగంలో డిమాండ్‌ మందగించిన నేపథ్యంలో దేశీ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియాలో (ఎంఎస్‌ఐ) సుమారు 3,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. వీరంతా తాత్కాలిక ఉద్యోగులు. మందగమనంతో తాత్కాలిక ఉద్యోగుల కాంట్రాక్టులను రెన్యువల్‌ చేయలేదని సంస్థ చైర్మన్‌ ఆర్‌సీ భార్గవ తెలిపారు. 'మారుతీలో సుమారు 3,000 మంది సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. వ్యాపారంలో ఇది సర్వసాధారణమే. డిమాండ్‌ ఎక్కువగా ఉన్నప్పుడు మరింత మంది కాంట్రాక్టు ఉద్యోగులను తీసుకోవడం, డిమాండ్‌ పడిపోయినప్పుడు తగ్గించుకోవడం జరుగుతుంది' అని చెప్పారు. అయితే, పర్మనెంట్‌ ఉద్యోగులపై మాత్రం ప్రభావమేమీ పడలేదన్నారు. ప్రభుత్వం కూడా సానుకూల చర్యలేమైనా ప్రకటిస్తే ఆటోమొబైల్‌ రంగంలో పరిస్థితులు మెరుగుపడటానికి ఉపయోగకరంగా ఉండగలవన్నారు.




# గుడ్‌బై.. ఎయిరిండియా!!

### పూర్తిగా నిష్క్రమించేందుకు కేంద్రం చర్యలు

- 95 శాతం వాటాల అమ్మకం
- ప్రైవేటీకరణ నిబంధనలు కూడా సడలింపు
- వాటాలు తక్షణం అమ్ముకోవడానికి కొనుగోలుదారులకు వెసులుబాటు
- విక్రయ ప్రతిపాదనలపై కేంద్రం కసరత్తు
- అక్టోబర్‌ నాటికి ఈవోఐ

**న్యూఢిల్లీ:** పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా విక్రయ ప్రక్రియను ఈసారైనా కచ్చితంగా పూర్తి చేయాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇన్వెస్టర్లకు అభ్యంతరకరంగా ఉన్న నిబంధనలను సవరించడంపై కసరత్తు చేస్తోంది. దీని ప్రకారం ఎయిరిండియా నుంచి కేంద్రం పూర్తిగా నిష్క్రమించే అవకాశం ఉంది. ఉద్యోగుల ఎసాప్స్‌ కోసం అయిదు శాతం వాటాలు మాత్రమే అట్టే పెట్టుకుని మిగతా 95 శాతాన్ని విక్రయించేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు క్యాబినెట్‌ సెక్రటరీ పి.కె. సిన్హా సారథ్యంలోని కార్యదర్శుల కమిటీ చేసిన సిఫార్సులకు సూత్రప్రాయంగా ప్రభుత్వం ఆమోదముద్ర వేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎయిరిండియా విక్రయం ఎప్పుడు చేపట్టాలి, ఎన్ని షేర్లు విక్రయించాలి, డీల్‌ ఎంత స్థాయిలో ఉండాలి అన్న అంశాలపై హోం మంత్రి అమిత్‌ షా సారథ్యంలోని మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నాయి. అక్టోబర్‌ తొలి వారంలోగా ఆసక్తి వ్యక్తీకరణ పత్రాల (ఈవోఐ)ను ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయని వివరించాయి.

**ప్రతిపాదనలు ఇలా..**

కొనుగోలుదారులపై భారీ రుణభారం పడకుండా చూడటం నుంచి ప్రైవేటీకరణ ప్రక్రియ నిబంధనల సడలింపు దాకా ఎయిరిండియాను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటోంది. గతంలో ఎయిరిండియా విక్రయానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడానికి గల కారణాలను విశ్లేషించుకుని, తగు మార్పులు, చేర్పులు చేస్తున్నట్లు అధికార వర్గాలు వివరించాయి. ఎయిరిండియా ప్రైవేటీకరణ తర్వాత కూడా ప్రభుత్వం 24 శాతం వాటాలను తన దగ్గరే ఉంచుకుంటుందన్న నిబంధన కారణంగా చాలా మంది ఇన్వెస్టర్లు ముందుకు రావడం లేదని విక్రయ ప్రక్రియకు సలహాదారుగా వ్యవహరించిన ఈవై సంస్థ పేర్కొనడంతో ఏకంగా 95 శాతం వాటాలను అమ్మకానికి పెట్టాలని కేంద్రం భావిస్తోంది.




ఇక, వాటాలు కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు.. కంపెనీ నిర్వహణకు అవసరమైన నిధులను సమీకరించుకునేందుకు లాకిన్‌ వ్యవధి లేకుండా కొన్ని వాటాలను తక్షణం విక్రయించుకునే వెసులుబాటు కూడా కల్పించనుంది. గతంలో సెంటార్‌ హోటల్‌ విక్రయం విషయంలో కంప్ట్రోలర్‌ అండ్‌ ఆడిటర్‌ జనరల్‌ (కాగ్‌) అక్షింతల కారణంగా ఎయిరిండియా వాటాల అమ్మకంలో మూడేళ్ల లాకిన్‌ వ్యవధి నిబంధనను గత ప్రతిపాదనల్లో పెట్టిన సంగతి తెలిసిందే. అప్పట్లో సెంటార్‌ హోటల్‌ను కొనుగోలు చేసిన టులిప్‌ హాస్పిటాలిటీ సర్వీసెస్‌.. దాన్ని నిర్వహించే ప్రయత్నాలేమీ చేయకుండా ఆ వెంటనే మరింత అధిక ధరకు దాన్ని అమ్మేసేయడాన్ని కాగ్‌ తప్పుపట్టింది. ఇలాంటివి మళ్లీ తలెత్తకుండా ఎయిరిండియా విక్రయ ప్రతిపాదనలో లాకిన్‌ వ్యవధిని చేర్చాల్సి వచ్చింది. అయితే, అసలే నష్టాలతో కుదేలైన ఎయిరిండియాను నడిపించడానికి అవసరమైన నిధులను సమీకరించుకోవడానికి ఈ నిబంధన సమస్యగా మారుతుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఎయిరిండియాకు రుణాలివ్వడానికి బ్యాంకులు ముందుకు రావు కాబట్టి కొత్త యజమాని తాను కొనుక్కున్న వాటాలను విక్రయించుకుంటే గానీ నిధులు సమకూర్చుకోవడం కుదరదు అని తెలిపాయి. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకుని లాకిన్‌ వ్యవధి నిబంధనను పక్కన పెట్టనున్నట్లు అధికార వర్గాలు వివరించాయి. అంతే కాకుండా కొనుగోలుదారు తన ప్రస్తుత వ్యాపారంలో ఎయిరిండియాను విలీనం చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించేలా నిర్దిష్ట నిబంధనను కూడా సడలించనున్నారు.

### ముచ్చటగా మూడోసారి..

ఎయిరిండియాను విక్రయించేందుకు గతంలో రెండు సార్లు ప్రయత్నాలు జరిగాయి. 2001లో ఒకసారి, మళ్లీ 2018లో మరోసారి కేంద్రం ప్రయత్నించింది. కానీ ఈ రెండూ విఫలం కావడంతో.. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి ప్రయత్నిస్తోంది. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఎయిరిండియాను గట్టెక్కించేందుకు కేంద్రం 2016–17 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,465 కోట్లు, 2017–18లో రూ.1,800 కోట్లు, 2018–19లో రూ. 3,975 కోట్ల మేర నిధులు సమకూర్చింది.

### గోప్యంగా సమాలోచనలు...

ప్రస్తుత విధానాలకు భిన్నంగా ఎయిరిండియాను కొనుగోలు చేసే అవకాశాలున్న సంస్థలతో ఒక చిన్నపాటి ప్రభుత్వాధికారుల బృందం నేరుగా సంప్రదింపులు జరుపుతోంది. కొనుగోలుకు ఆశక్తిగా ఉన్న ఇన్వెస్టర్ల అభిప్రాయాలను తెలుసుకుని ఎయిరిండియా విక్రయ ప్రతిపాదనకు తుది మెరుగులు దిద్దుతోంది. ఈ సమాలోచనలన్నీ గోప్యంగా జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. సాధ్యమైనంత వరకూ విక్రయ ప్రక్రియపై ప్రభుత్వ వర్గాల ప్రభావమేదీ పడకుండా చూసేందుకే ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నాయి. అయితే, పెద్ద మొత్తంలో బిడ్‌ చేస్తున్నప్పుడు సీఈవో లేదా సీఎఫ్‌వోల్లాంటివారు కాకుండా ప్రమోటరు స్థాయిలో ఉన్నవారే నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. ఇలాంటప్పుడు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రమోటర్లు నేరుగా విక్రేతతోనే సంప్రదింపులు జరిపేందుకు ప్రాధాన్యం ఇస్తారు. కాబట్టే కీలకమైన కొంత మంది ప్రభుత్వ అధికారులను మాత్రమే ఈ చర్చల్లో భాగం చేసినట్లు అధికార వర్గాలు వివరించాయి.

## టారిఫ్‌ నిబంధనలు దుర్వినియోగం

**బ్రాడ్‌కాస్టర్స్, డీపీవోలపై ట్రాయ్‌ వ్యాఖ్య**




**న్యూఢిల్లీ:** టీవీ చానళ్ల సిసలైన మార్కెట్‌ రేటును కనుగొనేందుకు లేకుండా బ్రాడ్‌కాస్టర్స్, ఆపరేటర్లు (డీపీవో) కొత్త టారిఫ్‌ ఆర్డరును దుర్వినియోగం చేశారంటూ టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌ వ్యాఖ్యానించింది. చానళ్ల ఎంపిక, చార్జీల పరంగా కొత్త సమస్యలపై సంబంధిత వర్గాలు అభిప్రాయాలు తెలపాలంటూ కోరింది. టీవీ రంగంలో వ్యాపార ప్రక్రియలు క్రమబద్ధీకరించేందుకు, వివిధ వర్గాల మధ్య విభేదాలను పరిష్కరించేందుకు, చానళ్ల చార్జీల విషయంలో పారదర్శకత తెచ్చేందుకు కొత్త నిబంధనలు ఉపకరించినా.. కస్టమర్లు తాము కోరుకున్న చానళ్లను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ లభించకుండా పోయిందని ట్రాయ్‌ పేర్కొంది. టీవీ వీక్షకులు తాము కోరుకున్న చానళ్లు మాత్రమే పొందేందుకు, నెలవారీ బిల్లులు తగ్గించుకునేందుకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో గతేడాది డిసెంబర్‌ నుంచి ప్రభుత్వం కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అయితే, బ్రాడ్‌కాస్టింగ్‌ సంస్థలు భారీ డిస్కౌంటులకు బొకేలను ఆఫర్‌ చేస్తుండటం తదితర అంశాల కారణంగా ఆయా చానళ్ల అసలు మార్కెట్‌ రేటును తెలుసుకునే అవకాశం లేకుండా పోతోందని తాజాగా ట్రాయ్‌ పేర్కొంది. పైపెచ్చు స్వల్ప మార్పులతో బొకేలను ఆఫర్‌ చేస్తుండటం యూజర్లను గందరగోళంలో పడేస్తోందని అభిప్రాయపడింది.

## బ్యాంకింగ్‌ భవిష్యత్తుకు ఐడియాలివ్వండి



**ప్రభుత్వరంగ బ్యాంకులను కోరిన కేంద్ర ఆర్థిక శాఖ**

**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక శాఖ ఓ వినూత్న ప్రయత్నానికి బీజం వేసింది. రానున్న ఐదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ (రూ.350 లక్షల కోట్లు) స్థాయికి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకోగా... దీన్ని సాధించేందుకు గాను బ్యాంకింగ్‌ రంగాన్ని గాడిలో పెట్టాలని భావించింది. ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ నెల పాటు బ్రాంచ్‌ల స్థాయిలో అధికారులతో సంప్రదింపుల ప్రక్రియను చేపట్టి.. వారి సలహాలు స్వీకరించాలని కోరింది. శనివారాల్లో దీన్ని చేపట్టాలని వారిచ్చిన సూచనలను, బ్యాంకింగ్‌ రంగ భవిష్యత్తు వృద్ధికి రోడ్‌మ్యాప్‌ రూపకల్పనలో వినియోగించాలని సూచించింది. దిగువ స్థాయి నుంచి ఈ సంప్రదింపుల ప్రక్రియ ఉంటుందని, బ్రాంచ్‌ల స్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరుగుతుందని ప్రభుత్వరంగ బ్యాంకుల చీఫ్‌లకు పంపిన లేఖలో కేంద్ర ఆర్థిక శాఖ పేర్కొంది. తొలుత బ్రాంచ్‌ లేదా ప్రాంతీయ స్థాయిలో, ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో సలహాల స్వీకరణ ప్రక్రియ జరుగుతుంది. అనంతరం, ఢిల్లీలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సమావేశం ఉంటుంది. 2024–25 నాటికి 5 ట్రిలియన్‌ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే విషయంలో కీలక భాగస్వాములైన ప్రభుత్వరంగ బ్యాంకుల పాత్రను గుర్తించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలుస్తోంది.

## బలహీన డిమాండ్‌తో వృద్ధికి అడ్డంకులు

- జీఎస్‌టీ వసూళ్లు తగ్గడం, రేట్ల కోత బదిలీ కాకపోవడం కూడా
- గోల్డ్‌మ్యాన్‌ శాక్స్‌ అభిప్రాయం




**న్యూఢిల్లీ:** భారత్‌ వృద్ధి, ద్రవ్యోల్బణం విషయంలో మెరుగ్గా ఉన్నప్పటికీ బలహీన డిమాండ్, ఆర్‌బీఐ మానిటరీ పాలసీ విధానం బదిలీ కాకపోవడం రెండు అతిపెద్ద సవాళ్లని గోల్డ్‌మ్యాన్‌ శాక్స్‌ పేర్కొంది. 2010–2014 మధ్య జీడీపీ వృద్ధి రేటు 6.7% నుంచి 7.3 శాతానికి పెరగ్గా, సగటు ద్రవ్యోల్బణం 10% నుంచి 5%కి క్షీణించింది. ''వృద్ధి రేటు బలంగా ఉన్నా కానీ, మొత్తం మీద పెట్టుబడుల వాతావరణం చాలా బలహీనంగా ఉంది'' అని గోల్డ్‌మ్యాన్‌ శాక్స్‌ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రాచి మిశ్రా తెలిపారు. బడా ఇన్వెస్టర్లు, విధాన నిర్ణేతలు, మార్కెట్‌ భాగస్వాములు, బ్యాంకర్లు, రాజకీయ విశ్లేషకులతో ముంబై, ఢిల్లీలో గోల్డ్‌మ్యాన్‌ శాక్స్‌ సమావేశాలు నిర్వహించగా.. ఆర్‌బీఐ మానిటరీ విధానం బదిలీ కాకపోవడం, జీఎస్టీ వసూళ్ల నిదానంగా ఉండడాన్ని అందులో భాగంగా వారు వ్యక్తపరిచారు. ఈ దశాబ్ద కాలంలో భారత సగటు జీడీపీ 7 శాతంగా ఉంటుందన్నారు. ఇందులో నాలుగింట మూడో వంతు వినియోగానికి సంబంధించినదేనని ప్రాచి మిశ్రా పేర్కొన్నారు.

**ప్రాఫిట్‌ ప్లస్ | డైలీ**

## ఈ వెబ్‌సైట్‌ నుంచి పాలసీలను కొనొద్దు..




ఆన్‌లైన్‌లో బీమా పాలసీల అమ్మకాలు ఇటీవలి కాలంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. డేటా, స్మార్ట్‌ఫోన్ల అందుబాటు ఆన్‌లైన్‌ కొనుగోళ్లు పెరిగేందుకు దోహదం చేస్తోంది. అయితే, సరిగ్గా ఈ అనుకూలతలను వినియోగించి మోసాలకు పాల్పడే అప్లికేషన్లు, వెబ్‌ పోర్టళ్లు కూడా పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో బీమా పాలసీలు కొనుగోలు చేసే వారు సంబంధిత పోర్టల్‌కు బీమా అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) గుర్తింపు ఉందా అని పరిశీలించుకోవడం అవసరం. www.irdaionline.org అనే వెబ్‌సైట్‌ నుంచి బీమా పాలసీలను కొనుగోలు చేయవద్దంటూ తాజాగా ఐఆర్‌డీఏఐ నోటీసు జారీ చేసింది. ఇది ఒక నకిలీ వెబ్‌ పోర్టల్‌ అని, బీమా పాలసీలను విక్రయించే అనుమతి లేదని స్పష్టం చేసింది. ఐఆర్‌డీఏఐ అధికారిక వెబ్‌ పోర్టల్‌ www.irdaonline.org అని గుర్తు చేసింది. తగిన రిజిస్ట్రేషన్‌ లేకుండా బీమా ఉత్పత్తులను విక్రయించే సంస్థలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొంది.

# భారత్‌కు మళ్లీ వస్తాం..!

- ఎలక్ట్రానిక్స్‌ మార్కెట్లో కొత్త ట్రెండ్
- తిరిగి ప్రవేశిస్తున్న టీవీ కంపెనీలు
- స్మార్ట్‌ఫోన్స్‌ బ్రాండ్లదీ అదే దారి




హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో

దేశంలో 135 కోట్లు దాటిన జనాభా. కోట్లాది మంది యువ కస్టమర్లు. ఉద్యోగులు, వ్యాపారులకు పెరుగుతున్న వ్యయం చేయదగ్గ ఆదాయం. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని కోరుకునే వినియోగదార్లు.. ఇంకేముంది ఈ అంశాలే తయారీ, రిటైల్‌ కంపెనీలకు భారత మార్కెట్‌ బంగారు బాతుగా నిలుస్తోంది. ముఖ్యంగా టెలివిజన్, స్మార్ట్‌ఫోన్స్‌ తయారీ సంస్థలకైతే ఇండియా ప్రధాన మార్కెట్‌ కూడా. దీంతో భారత్‌ నుంచి వెనుదిరిగిన ఈ రంగ కంపెనీలు మళ్లీ రీ–ఎంట్రీ ఇస్తున్నాయి. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త ఫీచర్లతో రంగంలోకి దిగుతున్నాయి. కొన్ని బ్రాండ్లు అయితే ఏకంగా ప్రైస్‌ వార్‌కు తెరతీస్తున్నాయి కూడా.

**ఐవా:** దేశీయ టెలివిజన్‌ మార్కెట్లో ఆగస్టు 1న రీ–ఎంట్రీ ఇచ్చిన ఈ సంస్థ ఏకంగా 75 అంగుళాల 4కే స్మార్ట్‌ టీవీతో దర్శనమిచ్చింది. వాయిస్‌ కమాండ్‌తో పనిచేసే ఆరు రకాల స్మార్ట్‌ టీవీలను ప్రవేశపెట్టింది. టీవీల ధరల శ్రేణి రూ.7,999తో మొదలుకుని రూ.1,99,000 వరకు ఉంది. వీటితో పాటు స్మార్ట్‌ హోం ఆడియో సిస్టమ్స్, వైర్‌లెస్‌ హెడ్‌ఫోన్స్, బ్లూటూత్‌ స్పీకర్స్, పర్సనల్‌ ఆడియో ఉత్పత్తులను సైతం అందుబాటులోకి తెచ్చింది. వినూత్న, ఆధునిక ఫీచర్లతో ప్రొడక్టులను అన్ని ధరల శ్రేణిలో తీసుకొస్తామని ఐవా ఇండియా ఎండీ మన్‌మిత్‌ చౌదరి తెలిపారు. రానున్న రోజుల్లో రూ.200 కోట్లకుపైగా ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు.

**నూబియా:** టెక్నాలజీ కంపెనీ జెడ్‌టీఈ అనుబంధ బ్రాండ్‌ అయిన నూబియా తిరిగి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. రెండేళ్ల క్రితం భారత్‌ నుంచి నిష్క్రమించిన ఈ బ్రాండ్‌ రెడ్‌ మేజిక్‌–3 పేరుతో గేమింగ్‌ ఫోన్‌ ప్రవేశపెట్టింది. 8/12 జీబీ ర్యామ్, 128/256 జీబీ ఇంటర్నల్‌ మెమరీ, 6.65 అంగుళాల డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్‌ బ్యాటరీ, సోనీ సెన్సార్‌తో 48 ఎంపీ కెమెరా, 16 ఎంపీ ఫ్రంట్‌ కెమెరాను జోడించింది. ప్రపంచంలో తొలిసారిగా ఈ స్మార్ట్‌ఫోన్‌లో లిక్విడ్‌ కూలింగ్‌ టెక్నాలజీతో ఇంటర్నల్‌ టర్బో ఫ్యాన్‌ పొందుపరిచారు. ఇక ఆల్ఫా పేరుతో అద్దిరిపోయే స్మార్ట్‌వాచ్‌తో ఎంట్రీ అదరగొట్టింది. ఫోల్డబుల్‌ ఫ్లెక్సిబుల్‌ డిస్‌ప్లే ఈ స్మార్ట్‌వాచ్‌ ప్రత్యేకత.

**హెచ్‌టీసీ:** తైవాన్‌కు చెందిన ఈ స్మార్ట్‌ఫోన్‌ బ్రాండ్‌ భారత్‌లో రెండవ ఇన్నింగ్స్‌కి సిద్ధమైంది. వైల్డ్‌ఫైర్‌ ఎక్స్‌ పేరుతో కొత్త మోడల్‌ను రెండు వేరియంట్లలో ఆవిష్కరించింది. వెనుకవైపు 12, 8, 5 ఎంపీ కెమెరాలు, 8 ఎంపీ సెల్ఫీ కెమెరా పొందుపరిచింది. ధర 4 జీబీ ర్యామ్‌ రూ.12,999 కాగా, 3 జీబీ ర్యామ్‌ మోడల్‌ రూ.9,999 ఉంది. ఆగస్టు 22 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో లభిస్తుంది. రానున్న రోజుల్లో స్మార్ట్‌ఫోన్‌ మార్కెట్లో వినూత్నమైన ఫీచర్లను పరిచయం చేయనున్నట్టు కంపెనీ వర్గాల సమాచారం. 2018లో కంపెనీ భారత్‌లో తన కార్యకలాపాలను నిలిపివేసింది. ప్రీమియం లుక్, నాణ్యమైన మోడళ్లతో కస్టమర్ల మది దోచిన ఈ బ్రాండ్‌కు ఇప్పటికీ మంచి ఇమేజ్‌ ఉంది.

**ఎల్‌జీ:** డబ్ల్యూ సిరీస్‌తో భారత్‌లో రీఎంట్రీ ఇచ్చిన ఎల్‌జీ మొబైల్స్‌ ఈ ఏడాది మరో అయిదు కొత్త స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టనుంది. డబ్ల్యూ సిరీస్‌తో పాటు విదేశాల్లో విక్రయిస్తున్న 'జీ', 'క్యూ' సిరీస్‌ మోడళ్లను పరిచయం చేయనుంది. ప్రస్తుతం సంస్థ ఖాతాలో అయిదు మోడళ్లున్నాయి. 2020 ఏడాది ద్వితీయార్ధానికి దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఎల్‌జీ మొబైల్స్‌ బిజినెస్‌ హెడ్‌ అద్వైత్‌ వైద్య సాక్షి బిజినెస్‌ బ్యూరోకు తెలిపారు. ఏడాది తర్వాత 5జీ స్మార్ట్‌ఫోన్‌ 'వి–50'ని భారత్‌లో ఆవిష్కరించనుంది. 5జీలో నాయకత్వ స్థానాన్ని దక్కించుకోవాలన్నదే కంపెనీ లక్ష్యం. దక్షిణ కొరియా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఎల్‌జీ.. భారత్‌లో తొలిసారిగా డబ్ల్యూ సిరీస్‌ ద్వారా ఫోన్ల అభివృద్ధితో పాటు తయారీ కూడా చేపట్టింది.



## రికార్డు సృష్టించిన జూలై!

ఇప్పుడైతే శాంతించాయి గానీ.. రెండు నెలల కింద ఎండలు మండిపోయిన విషయం మనకు తెలిసిందే.. ఇదే విషయాన్ని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ ధ్రువీకరించింది. ఈ సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జూలైలో చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యూరప్, అమెరికాతో పాటు భూ ఉత్తరార్ధ గోళంలోని అనేక దేశాల్లో వడగాడ్పులు ప్రజలను తారెత్తించాయి. అంతే కాదు.. ఈ ఏడాది తొలి 6 నెలల ఉష్ణోగ్రత రెండో స్థానంలో ఉన్నట్లు ఈ నివేదిక చెబుతోంది. జూలైలో భూమి. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సుమారు ఒక డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా ఉన్నట్లు స్పష్టం చేసింది. 20వ శతాబ్దం మొత్తమ్మీద సగటు ఉష్ణోగ్రతలు 15.8 డిగ్రీ సెల్సియస్ ఉండగా.. జూలై ఉష్ణోగ్రత 16.75 డిగ్రీలుగా నమోదైంది. మూడేళ్ల కింద అంటే 2016లో సుమారు 16 నెలల పాటు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైన తర్వాత అంతటి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి. 1998 తర్వాత జూలైలో ఉష్ణోగ్రతలు క్రమేపీ ఎక్కువవుతూ వస్తున్నాయని.. గత ఐదు సంవత్సరాల్లో చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇదే సమయంలో సముద్ర ప్రాంతాల్లోని మంచు కూడా రికార్డు స్థాయిలో కరిగిపోయిందని చెబుతున్నారు.



## తేలికైన సౌరఫలకాలు..

సౌరశక్తిని విస్తృత స్థాయిలో వాడకపోయేందుకు కారణాలేంటో తెలుసా? బరువు ఎక్కువగా ఉండటం.. కావాల్సినట్లు మడత పెట్టే అవకాశం లేకపోవడం వంటివి రెండు కారణాలు. ఈ సమస్యను అధిగమించేందుకు ఆస్ట్రేలియాలోని సన్‌మ్యాన్ ఎనర్జీ సంస్థ వినూత్నమైన సౌర ఫలకాలను అభివృద్ధి చేసింది. తేలికగా, గాజు లేకుండా తయారు చేసింది. ఫలితంగా వీటిని ఎలా అంటే అలా మడత పెట్టి వాడుకోవచ్చు. దీంతో వంపులున్న భవనాల్లోనూ ఎక్కువ సంఖ్యలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి పెంచుకోవచ్చు. ఈ–ఆర్చ్ అని పిలుస్తున్న ఈ సోలార్ ప్యానెల్ ఒక్కొక్క దాంట్లో దాదాపు వంద వరకు ఘటకాలు ఉంటాయి. రెండు మిల్లీమీటర్ల మందం మాత్రమే ఉండే ఈ ప్యానెల్‌ను కావాల్సిన ఆకారంలో మార్చుకునే అవకాశం ఉంది. సంప్రదాయ సోలార్ ప్యానెల్స్ ఒక్కొక్కటి 20 కిలోల బరువు ఉంటే ఈ ఆర్చ్ 2.4 కిలోలు మాత్రమే ఉంటుంది. భవనాల కిటికీలతో పాటు పైకప్పులపై కూడా ఇవి తేలిగ్గా ఇమిడిపోతాయని సన్‌మ్యాన్ ఎనర్జీ సీఈవో డారెన్ మిల్లర్ తెలిపారు.

## డిసెంబర్ 8న సీటెట్

### ఈనెల 19 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ అధీనంలోని స్కూళ్లలో ఉపాధ్యాయ పోస్టులకు ప్రధాన అర్హతగా పరిగణనలోకి తీసుకునే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు (సీటెట్) డిసెంబర్ 8న జరగనుంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దేశ వ్యాప్తంగా 20 భాషల్లో, 110 పట్టణాల్లో ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, సిలబస్, భాషలు, అర్హత వివరాలు, పరీక్ష ఫీజు, పరీక్ష కేంద్రాలు, ముఖ్యమైన తేదీల వివరాలను ఈనెల 19న www.ctet.nic.inలో అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది. అభ్యర్థులు ఈనెల 19వ తేదీ నుంచి వచ్చేనెల 18 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించింది. పరీక్ష ఫీజును వచ్చేనెల 23వ తేదీ మధ్యాహ్నం 3:30 గంటల వరకు చెల్లించవచ్చని తెలిపింది. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం ఏటా రెండు సార్లు టెట్‌ను నిర్వహించాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసిన సీబీఎస్‌ఈ గత జూలై 7న సీటెట్‌ను నిర్వహించింది. ఆ పరీక్షలకు దేశవ్యాప్తంగా 23.77 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 3.52 లక్షల మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు సీబీఎస్‌ఈ తెలిపింది.

## సుధీర్ జలగంకు ‘హింద్ రతన్’ అవార్డు

**సాక్షి, హైదరాబాద్:** ప్రవాస భారతీయులకు ఇచ్చే అత్యున్నత పురస్కారం ‘హింద్ రతన్’ అవార్డును 2018 సంవత్సరానికి గాను సుధీర్ జలగంకు ఎన్‌ఆర్‌ఐ వెల్ఫేర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకటించింది. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజస్తాన్‌లోని జైపూర్‌లో జరిగే 39వ ఎన్‌ఆర్‌ఐ కాంగ్రెస్‌లో సుధీర్‌కు అవార్డు ఇవ్వనున్నారు.

●● కలర్‌కో కథ.. తీరాలి నీటి వ్యథ ●●

# రంగు పడుద్ది

### హైదరాబాద్‌లో జలమండలి, బల్దియా ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం..



**ఇంటి గుమ్మానికి ఎరుపు రంగు గుర్తు.. డేంజర్ అనడానికి సిగ్నల్‌లాగ.. ఎదురింటికి ఆరెంజ్ గుర్తు.. ఆ పక్క ఇంటికి గ్రీన్.. ఇంకో ఇంటికి బ్లూ..** అంతేకాదు.. మనం మారితే.. ఆ రంగు కూడా మారుతుందట! ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఖైరతా బాద్‌లోనే.. రేపొద్దున్న సిటీ అంతా ఈ రంగులు వస్తాయట.. ఈ కలర్ కోడ్ మీద కేంద్ర ప్రభుత్వ అధికారులు కూడా ఆసక్తి కనబరుస్తున్నారట.. ఇంతకీ ఈ రంగుల వెనకున్న కథ ఏంటి?

గ్రేటర్ హైదరాబాద్‌లో జలమండలి, బల్దియా ఆధ్వర్యంలో మహోద్యమంగా చేపడుతోన్న జలనాయకత్వం.. జలసంరక్షణ (వాక్) ఉద్యమంలో భాగంగా సిటీలో ఇంటింటికీ రంగుల గుర్తులను వేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.. ఇంట్లో జరుగుతున్న నీటి వృథా లేదా సంరక్షణను బట్టి రంగులను వేస్తారు. ప్రస్తుతం ఖైరతాబాద్ డివిజన్‌లోని మాతానగర్ బస్తీలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. నీటివృథా, సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంటి యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంట్లో నీటి వృథా తగ్గితే.. ఇంటికి వేసే రంగు గుర్తు మారుస్తారు. ఈ వినూత్న విధానంపై కేంద్ర జలశక్తి అభియాన్ ప్రతినిధులు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి ప్రయోగాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రవేశపెడితే విలువైన తాగునీటిని సంరక్షించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.



హైదరాబాద్‌లో నిత్యం వృథా అవుతున్న 50 మిలియన్ గ్యాలన్ల తాగునీటితో చెన్నై మహానగరం నీటి కొరతను తీర్చవచ్చు. అందుకే ప్రస్తుతం 40 శాతం మేర ఉన్న నీటి వృథాను 20 శాతానికి తగ్గించేందుకు జలసంరక్షణ.. జలనాయకత్వం ఉద్యమాన్ని చేపట్టాము. ఇందులో స్వయం సహాయక బృందాల మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతోపాటు బల్దియా, జలమండలికి సంబంధించి అన్ని స్థాయిల అధికారులు పాల్గొంటున్నారు. ఈ అంశంపై ఈనెల 19న కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విజ్ఞాన్ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నాము.

**ఎం.దానకిశోర్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్**

### శాస్త్రీయంగా లెక్కేస్తారు..

**జలమండలి పరిధిలో ప్రతీ కాలనీ, బస్తీలకు తాగు నీటిని సరఫరా చేసే పైపులైన్లకున్న వాల్వ్‌ను తిప్పినపుడు ఆ నీరు ఎన్ని ఇళ్లకు..ఏ మోతాదులో సరఫరా అవుతోంది...సరఫరా జరిగిన నీటికి సంబంధించి శాస్త్రీయంగా బిల్లింగ్ జరుగుతుందా అన్న విషయాలను సైతం లెక్కేస్తారు. దీని వల్ల ఆ వీధిలో ఏ ఇంట్లోనైనా నీటి వృథా అధికంగా ఉందా? లేదా అన్న అంశాన్ని ప్రయోగాత్మకంగా తెలుసుకోనున్నారు.**

**ఎరుపు**

- జలమండలి సరఫరా చేస్తున్న తాగు నీటి వృథా అత్యధికంగా ఉన్నట్లు లెక్క.
- వర్షపు నీటిని ఒడిసిపట్టే ఇంకుడు గుంత లేకపోవడం, నల్లా నీళ్లతో ఫ్లోర్ క్లీనింగ్, జంతువులు, కార్లు, ద్విచక్రవాహనాలను కడగడం వంటివి చేస్తే...
- పైపులు, మోటార్లు, వాల్వ్‌లు, మీటర్ చాంబర్‌లలో నీటి వృథా అధికంగా ఉండడం, మీ ఇంట్లోని సంప్ నిండి.. వీధిలోకి నీళ్లు వృథాగా పొంగి పొర్లడం
- మీ సంప్ నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని మళ్లించే పైపులైన్లలో లీకేజీ ఉండడం వంటివి..

**కాషాయం**

- పైన చెప్పిన విధంగా తొమ్మిది రకాల వృథా కాకుండా.. అందులో ఏ ఐదు రకాల వృథా జరిగినా ఈ గుర్తు పడుతుంది..

**పచ్చ**

- మీ ఇంట్లో నీటి వృథాను అరికట్టేందుకు పైన పేర్కొన్న అంశాలను తక్కువ సమయంలో కట్టడి చేయడంతోపాటు ఇంట్లో ఇంకుడు గుంత ఉంటే.. ఈ రంగు వేస్తారు.

**నీలం**

- నీటి వృథా అస్సలు లేదు.. పైగా.. మీ ఇంటి పైకప్పుపై పడిన వర్షపు నీటిని జాగ్రత్తగా ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంత ఉంటే.. ఇంటికి నీటి బిందువును ప్రతిబింబించేలా నీలం గుర్తు వేస్తారు.

సాక్షి, హైదరాబాద్

# అనుసంధానానికి సాయం చేయండి

- కృష్ణా–గోదావరి లింక్‌పై కేంద్రాన్ని కోరనున్న తెలంగాణ
- 21న జరిగే ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో ప్రస్తావించాలని నిర్ణయం
- ఇప్పటికే సాయం కోరుతూ కేంద్రానికి ఏపీ సీఎం వైఎస్ జగన్ లేఖ

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా, గోదావరి నదుల అనుసంధాన ప్రక్రియపై ఏపీతో కలిసి తీసుకున్న నిర్ణయాలు, సిద్ధం చేసిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గోదావరి–కావేరి అనుసంధాన ప్రక్రియలో భాగంగా జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) గతంలో సూచించిన ప్రతిపాదనలను పక్కనపెట్టి ప్రస్తుతం ఏపీతో పాటు తాము ప్రతిపాదిస్తున్న గోదావరి జలాల మళ్లింపు అంశానికి ప్రాధాన్యమివ్వాలని కోరనుంది. ఈ నెల 21న కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగే సమావేశంలో ఈ అంశాన్ని ముందుంచాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించిన అకినేపల్లి, జనంపేట నుంచి నీటిని కృష్ణా నది ద్వారా పెన్నాకు, అటు నుంచి కావేరీకి తరలించే ప్రతిపాదనను తెలంగాణ పలు వేదికలపై తప్పుపట్టింది. అకినేపల్లి, జనంపేట నుంచి నీటిని తరలించే సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీకి ఎలాంటి సంప్రదింపులు జరగలేదని, ఈ ప్రతిపాదనలతో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేని దృష్ట్యా దీన్ని పక్కనపెట్టి ఇరు రాష్ట్రాలు తెరపైకి తెచ్చిన గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకు తరలించే ప్రతిపాదనలను పరిశీలించాలని కేంద్రాన్ని కోరనుంది.

**ఇప్పటికే లేఖ రాసిన ఏపీ సీఎం...**

కృష్ణా, గోదావరి నదుల అనుసంధానానికి సహాయం చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవలే కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి లేఖ రాశారు. నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో కరువు పరిస్థితులున్నాయని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల ఏపీ ప్రాజెక్టులకు నీరు రావట్లేదని, ఆల్మట్టి ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.2 మీటర్లకు పెంచుతున్నందున ముమ్ముందు ఏపీకి వచ్చే 100 టీఎంసీలు కూడా రాని పరిస్థితి ఉందని లేఖలో జగన్ పేర్కొన్నారు. గోదావరి జలాలు పెద్ద ఎత్తున సముద్రంలో కలుస్తున్నాయని, ఈ నేపథ్యంలో గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌లోకి తరలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గోదావరి నీటిని సాగర్, శ్రీశైలానికి ఎత్తిపోయడం వల్లే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని షెకావత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఇదివరకే తెలంగాణతో కలిసి చర్చించామన్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరితోపాటు తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలకు కూడా ప్రయోజనం చేకూరేలా రోజుకు 4 టీఎంసీల చొప్పున 120 రోజుల్లో 480 టీఎంసీలను ఇరు రాష్ట్రాల పరిధిలో ఉన్న శ్రీశైలం, సాగర్ డ్యామ్‌లకు తరలించాలన్న ప్రతిపాదన చేశామని పేర్కొన్నారు. దీనికి కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఏపీ రాసిన ఈ లేఖను ప్రస్తావిస్తూనే తెలంగాణ సైతం ఈ ప్రతిపాదనకు సాయం చేయాలని కోరాలని నిర్ణయించింది. ఇప్పటికే కేంద్రం చేపట్టిన నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి నీటిని కృష్ణా, సాగర్‌లకు తరలించే ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవాలని ఇటీవలి సమావేశాల్లో ఇంజనీర్ల కమిటీ సైతం అభిప్రాయపడింది. దీనికి అనుగుణంగా ఈ ప్రతిపాదనను ఆమోదించి ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని తెలంగాణ కోరనుంది.

# ‘స్నాక్స్’ సంబురం

- హైదరాబాద్‌లో స్నాక్స్ ఘుమఘుమలు
- నాలుగు మెట్రోస్టేషన్లలో స్నాక్స్ ఫెస్టివల్
- 7 దేశాలు, 17 రాష్ట్రాలకు చెందిన స్నాక్స్ ప్రదర్శన

**హైదరాబాద్:** భాగ్యనగరం సిగలో మణిహారమైన మెట్రోరైల్ మరోసారి అంతర్జాతీయ దృష్టి ఆకర్షించేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ సహకారంతో ‘ఇంటర్నేషనల్ స్నాక్స్ ఫెస్టివల్’కు పలు మెట్రోస్టేషన్లు వేదిక కానున్నాయి. దీని ద్వారా విదేశీ స్నాక్స్ వంటకాలతో పాటు దేశంలోని 17 రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వంటకాలు ఆహార ప్రియుల నోరూరించనున్నాయి. ఆగస్టు 30, 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ఈ ఫెస్టివల్ జరగనుంది. దీనికి సంబంధించిన వివరాలను హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న మెట్రో భవన్‌లో శుక్రవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డిలు వివరాలను వెల్లడించారు.

**150 రకాల స్నాక్స్..**

సరికొత్త వంటకాల రుచులను ఆస్వాదించేందుకు ఈ ఫెస్టివల్ వేదిక కానుంది. తెలంగాణకు చెందిన పాన్ రాగి లడ్డు, బిహార్‌కు చెందిన లిట్టి చోక్, ఖజూర్, గుజరాత్‌కు చెందిన గుడ్‌పార్, చక్రపార్, స్మర్‌పార్, మేతిమట్టి, లస్సీ.. ఒడిశా, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఢిల్లీ, పంజాబ్, ఏపీ, రాజస్తాన్ తదితర 17 రాష్ట్రాల సంప్రదాయ వంటకాలు ఈ ఫెస్టివల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఇథియోపియా, చైనా, స్వీడన్ తదితర 7 దేశాలకు చెందిన స్నాక్స్ రుచులనూ చవిచూడొచ్చు.

**ఇంటి వంటకాలకే అనుమతి..**

ఆయా రాష్ట్రాలు, ఆయా దేశాల్లో ఇంట్లో తయారు చేసుకునే వంటకాలనే ఈ ఫెస్టివల్‌కు అనుమతిస్తున్నారు. అంటే మహిళలే స్వయంగా తయారు చేసిన స్నాక్స్‌ను ఇక్కడ ఉంచుతారు. హోటళ్లకు, షాపులకు, స్వీట్ భండార్‌లకు ఎలాంటి అనుమతి లేదు. కాగా, ఈ స్నాక్స్ ఫెస్టివల్‌ను నాలుగు ప్రధాన మెట్రో స్టేషన్లలో నిర్వహించాలని నిర్ణయించారు. నాగోల్, ఎంజీబీఎస్, అమీర్‌పేట, హైటెక్‌సిటీ మెట్రో స్టేషన్లలో ఆయా రుచులు అందుబాటులో ఉండనున్నాయి.

**ఏయే రోజుల్లో..**

ఆగస్టు 30, 31, సెప్టెంబర్ 1 తేదీల్లో మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ఫెస్టివల్ కొనసాగుతుంది. ప్రయాణికులతో పాటు స్నాక్స్‌ను ఆరగించేందుకు ఎవరైనా రావొచ్చు.



శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేట మెట్రో రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో స్నాక్స్ రుచి చూస్తున్న ఎన్వీఎస్ రెడ్డి, బుర్రా వెంకటేశం తదితరులు

**బహుమతులు సైతం..**

స్నాక్స్ ఆరగించే వారికి బహుమతులను సైతం అందించనున్నారు. అయితే వారు చేయాల్సిందల్లా కొనుగోలు చేసిన స్టాల్ వద్ద తమకు నచ్చిన స్నాక్స్‌ను తింటూ సెల్ఫీ దిగాలి. ఆ సెల్ఫీకి సోషల్ మీడియాలో ఎవరికి ఎక్కువ లైక్స్ వస్తే వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తారు.

**భిన్నత్వంలో ఏకత్వంలా**

**బుర్రా వెంకటేశం**

గతంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ తరపున ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించాం. ఇదే తరహాలో ఇప్పుడు స్నాక్స్ ఫెస్టివల్ నిర్వహణకు ముందుకొచ్చాం. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ఈ ఫెస్టివల్ నిలిచిపోతుంది.

# ‘వసతి’ ఫుల్.. ప్రవేశాలు లేవు..!

- పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో ఇప్పటికే నిండిన సీట్లు...!
- ప్రవేశాల ప్రక్రియ ముగియడంతో ప్రవేశాల కోసం భారీగా దరఖాస్తులు
- కొత్తగా 10 వేల ప్రవేశాలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి లేఖ

**సాక్షి, హైదరాబాద్:** బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు డిమాండ్ పెరుగుతోంది. పోస్టుమెట్రిక్ కోర్సుల్లో ప్రవేశాలకు గాను అడ్మిషన్ల కౌన్సెలింగ్ ముగుస్తుండడంతో విద్యార్థులంతా కళాశాలల బాట పడుతున్నారు. ఈ క్రమంలో హాస్టల్ అడ్మిషన్లకు ఉపక్రమిస్తున్న పలువురికి బీసీ సంక్షేమ వసతిగృహాలు అడ్మిషన్లు ఇవ్వడం లేదు. సీట్లు నిండాయని వారికి ప్రవేశాలు కల్పించడం లేదు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 964 సంక్షేమ వసతిగృహాలున్నాయి. వీటిలో 238 హాస్టళ్లు పోస్టుమెట్రిక్ విద్యార్థులవే. సగం హాస్టళ్లు బాలికలు, మిగతా సగం బాలురకు కేటాయించారు. ఒక్కో హాస్టల్‌లో సగటున వంద మందికి ప్రవేశాలు కల్పించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. విద్యార్థుల ఒత్తిడి తీవ్రంగా ఉన్నచోట్ల అక్కడున్న మౌలిక వసతులను బట్టి అదనంగా 20 మందికి అవకాశం కల్పిస్తున్నారు.ప్రస్తుతం వీటిలో విద్యార్థుల సంఖ్య నిర్దేశించిన దానికంటే ఎక్కువగా ఉంది. దీంతో కొత్తగా అడ్మిషన్లు తీసుకోవద్దని నిర్ణయించిన బీసీ సంక్షేమ శాఖ ఆమేరకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పోస్టుమెట్రిక్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్ దాదాపు ముగిసింది. డిగ్రీ(దోస్త్) మినహా మిగతా కోర్సుల్లో ప్రవేశాలు పూర్తి కావడంతో ఆయా విద్యార్థులు వసతి కోసం హాస్టళ్ల చుట్టూ తిరుగుతున్నారు.



**సీట్లు పెరిగితేనే ప్రవేశం...**

ప్రస్తుతం బీసీ వసతిగృహాల్లో అడ్మిషన్లకు వసతిగృహ సంక్షేమాధికారులు నో చెబుతున్నారు. దీంతో అవకాశం కల్పించాలని కోరుతూ ఆశావహులంతా సంక్షేమ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాలు, రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నాలు సైతం నిర్వహించారు. అదేవిధంగా బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి బీసీ సంక్షేమ సంఘం నేతలు సీట్ల పెంపును కోరుతూ వినతులు సమర్పించారు. దీంతో స్పందించిన ఆ శాఖ బీసీ హాస్టళ్లలో సీట్లు పెంచాలని ప్రభుత్వాన్ని కోరింది. మౌలిక వసతులు, అనుకూల భవనాలున్న చోట ఒక్కో హాస్టల్‌కు సగటున 50 సీట్లు పెంచేలా అవకాశం ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు నివేదిక సమర్పించింది. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

- తన భారత పౌరసత్వంపై చట్ట ప్రకారం స్పందించాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్ని సవాల్ చేస్తూ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు. అప్పీల్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు సింగిల్ జడ్జి ఉత్తర్వులను నిలిపేయాలని కోరారు.







## అనుమతులు ఉపసంహరించుకోవాలి: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** నల్లగొండ జిల్లా లంబాపూర్‌లో యురేనియం తవ్వకాలకు కేంద్రం ఇచ్చిన అనుమతులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రజల ఆరోగ్యం, అటవీ సంపద, జీవరాశులపై పడే ప్రభావాన్ని దృష్టి లో పెట్టుకోవాలని కోరింది. ఈ తవ్వకాలను నిలిపేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో కోరారు. నల్లగొండ జిల్లాలోని లంబాపూర్, పులిచర్ల, నామాపురం, ఎల్లాపురం గ్రామాల పరిధిలోని 542 హెక్టార్లలో యురేనియం తవ్వకాలు జరపాలన్న కేంద్రం నిర్ణయం మేరకు పర్యావరణశాఖ అనుమతులు జారీ చేయడం చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. తవ్వకాలు జరపొద్దని వామపక్ష పార్టీల బృందం 6న సీఎస్‌ను కలిసిన సందర్భంగా.. ‘ఏవైనా ఉత్తర్వులు వస్తే ఆయా అంశాలు పరిగణనలోకి తీసుకుంటాం’ అని ఆయన చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని సూచించారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792